RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 10 సంచిక : 207 శనివారం 22 - 02 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

## నా దెబ్బతో బ్రిక్స్ మాటే వినిపించడం లేదు

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకొస్తే బ్రిక్స్‌పై 150 శాతం సుంకాలు విధిస్తానని తాను చెప్పగానే ఆ కూటమిలోని దేశాలు దూరం జరిగాయని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు.




## భారత్ నుంచి ప్రపంచస్థాయి నాయకులు తయారుకావాలి




- అన్ని రంగాల్లోనూ ఇండియన్ మైండ్‌తో ఇంటర్నేషనల్ మైండ్‌సెట్ కలిగిన నాయకులు తయారు కావాలి
- ప్రపంచ శక్తి కేంద్రంగా భారత్
- ప్రధాని నరేంద్ర మోదీ

## హైకోర్టులో కేటీఆర్ పిటిషన్



- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్
- ముషీరాబాద్ పీఎస్‌లలో నమోదైన కేసులు కొట్టేయాలని పిటిషన్
- సీఎంను దురుద్దేశ పూర్వకంగా అవమానించలేదు

- వివరాలు 2 లో

## మహా కుంభమేళాతో రూ.3 లక్షల కోట్ల ఆదాయం

10 కోట్ల మందికి ఉపాధి'

కుంభమేళాతో యూపీ ఆర్థిక వ్యవస్థకు రూ.3 లక్షల కోట్ల ఆదాయం

మహాశివరాత్రి వరకూ కుంభమేళాకు వచ్చే భక్తుల సంఖ్య

60 కోట్లు ఉంటుంది

యూపీ ప్రభుత్వం మహాకుంభ మేళాను చాలా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది

రంగంలోకి భారీగా పోలీసు బలగాలు



దేశ, విదేశాల నుంచి వస్తున్న యాత్రికులతో మహాకుంభమేళాలో వాణిజ్యం పెరుగుతోంది. యాత్రికులు చేసే ఖర్చులు వల్ల ఉత్తర్‌ప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు రూ.3లక్షల కోట్లు సమకూరుతాయని యూపీ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అసెంబ్లీలో తెలిపారు. మహాశివరాత్రి వరకూ కుంభమేళాకు వచ్చే భక్తుల సంఖ్య 60 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. యూపీ ప్రభుత్వం మహాకుంభ మేళాను చాలా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని యాత్రికుల రద్దీ దృష్ట్యా ప్రయాగ్ రాజ్‌లో భద్రతా ఏర్పాట్లు ముమ్మరం చేసింది. కాగా 2030 నాటికి దేశంలో - వివరాలు 2 లో

## మిర్చి రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరాం



- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- మిర్చికి రూ.11,600కు పైగా ధర ఇవ్వాలి
- మిర్చి ఎగుమతులపైనా చర్చ

ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలని కోరినట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. మిర్చి రైతులకు చేయూతపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నేతృత్వంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన రామ్మోహన్ నాయుడు అనంతరం మీడియాతో మాట్లాడుతూ మిర్చికి రూ.11,600కు పైగా ధర ఇవ్వాలని కోరామన్నారు. మిర్చి ఎగుమతులపైనా చర్చించామన్నారు.ఎగుమతిదారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుం టామని శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారని వెల్లడించారు.అంతర్జాతీయ మార్కెట్‌లో ధర కల్పించి ద్వారా మిర్చి రైతులను ఆదుకోవాలని కోరగా, సమస్య చెప్పిన వెంటనే శివరాజ్‌సింగ్ స్పందించారని తెలిపారు. మార్కెట్ ధర, ఉత్పత్తి ఖర్చుల మధ్య వ్యత్యాసం ఇస్తామని చెప్పారన్నారు. మిర్చి రైతులు కష్టాల్లో ఉన్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్‌లో బిగ్ వికెట్ డౌన్

మాజీ శాసన సభ్యుడు కోనేరు కోనప్ప

పార్టీకి గుడ్‌బై

పార్టీకి రాజీనామా

తన రాజీనామా పత్రాన్ని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయానికి పంపించారు.



కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ శాసన సభ్యుడు కోనేరు కోనప్ప పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయానికి పంపించారు.ఆయన సొంత నియోజకవర్గం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్. నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాల వల్లే కోనేరు కోనప్ప రాజీనామాకు దారి తీశాయని చెబుతు న్నారు. సొంతగూటికి చేరిన తరువాత ఆయనను పక్కనె ఎట్టారని చెబుతున్నారు.గతంలో కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంపాటు కొనసాగారు కోనేరు కోనప్ప. 2004 లో సిర్పూర్ నుంచి కాంగ్రెస్ - వివరాలు 2 లో

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం

- అప్పకపల్లెలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన సీఎం
- వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- వైద్య కళాశాలలో భవనాలకు శంకుస్థాపన



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇవాళ వికారాబాద్, నారాయణపేట పర్యటనకు వెళ్లిన సీఎం, అప్పకపల్లెలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులు ప్రారంభించారు. అప్పక్ పల్లిలో బంగలి దేవమ్మ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, సీఎం సలహాదారు వెం నరేందర్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అంతకుముందు అప్పకపల్లెలో మహిళా సమాఖ్య పెట్రోల్ బంకు ప్రారంభించారు. అనంతరం అక్కడి మహిళలతో సీఎం, మంత్రులు ముచ్చటించారు.కేంద్రం, రాష్ట్రం ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటు మహిళలు నిర్వహించబోతున్నారని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయబోతున్నామని వివరించారు. శిల్పారామం వద్ద మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు అమ్మే ఏర్పాటు చేశామని అన్నారు. స్వయం సహాయక సంఘాల్లో మొత్తం 67 లక్షల మంది మహిళలు ఉన్నారని, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇకపై ఏడాదికి రెండు మంచి చీరలు, రూ. 1000 కోట్ల ఖర్చుతో సమాఖ్య సభ్యులకు చీరలు వెల్లడించారు.కోటి మంది మహిళలతో ఓఆర్ఆర్ వద్ద భారీ ప్రదర్శన చేపడదామని, స్వయం సహాయక సంఘాల భారీ ప్రదర్శనకు ప్రధాని మోదీని కూడా ఆహ్వానిద్దామని తెలిపారు. అరుణమ్మ సాయం చేస్తే ప్రధాని మోదీ కూడా ప్రదర్శనకు వస్తారని, కేంద్రం, రాష్ట్రం ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలని పేర్కొన్నారు.

**వైద్య కళాశాలలో భవనాలకు శంకుస్థాపన**

నారాయణపేట వైద్య కళాశాలలో భవనాలకు రేవంత్? రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.130 కోట్లతో వైద్య కళాశాల, హాస్టల్ నిర్మాణానికి, రూ.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణానికి, నారాయణపేటలో రూ.40 కోట్లతో 100 పడకల యూనిట్‌కు శంకుస్థాపన చేశారు.

**వైద్య కళాశాలలు రద్దు కాకుండా కృషి చేశాం**

మారుమూల ప్రాంతంలో మెడికల్ కాలేజీ నిర్మించుకోవడం ఆనందంగా ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ వైఖరి వల్ల 8 వైద్య కళాశాలల ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 8 వైద్య కళాశాలలు రద్దు కాకుండా కృషి చేశామని, అవసరమైన వసతులు కల్పించి మెడికల్ కాలేజీలను నిలబెట్టుకున్నామని వెల్లడించారు. మెడికల్ కాలేజీలకు అవసరమైన అన్ని వసతులు భవిష్యత్‌లోనూ - వివరాలు 2 లో

## తొక్కిసలాటలో 121 మంది మృతి.. బోలే బాబాకు క్లీన్ చీట్

- ఘటనకు బోలే బాబా దోషి కాదని జ్యూడిషియల్ కమిషన్ స్పష్టం
- పోలీసుల నిర్లక్ష్యంగా కారణంగానే ఈ దారుణం
- ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకు పలు కీలక సూచనలు



లక్నో : సత్సంగ్ నిర్వహణ అనంతరం జరిగిన తొక్కిసలాటలో 121 మంది మరణించారు. ఈ ఘటనకు బోలే బాబా దోషి కాదని జ్యూడిషియల్ కమిషన్ స్పష్టం చేసింది. ఆ క్రమంలో ఆయనకు క్లీన్ చీట్ ఇచ్చింది. పోలీసుల నిర్లక్ష్యంగా కారణంగానే ఈ దారుణం జరిగిందని స్పష్టం చేసింది. ఈ తప్పునకు బాధ్యత నిర్వహాకులదేనని సదరు కమిషన్ కుండబద్దలు కొట్టింది. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనలో 121 మంది మృతి చెందారు. ఈ ఘటనలో బోలే బాబాకు - వివరాలు 2 లో

## తమిళ దర్శకుడు శంకర్ ఆస్తులను సీజ్ చేసిన ఈడీ

తమిళ దిగ్గజ దర్శకుడు శంకర్‌కి ఈడీ షాక్ ఇచ్చింది.

శంకర్ ఆస్తులను సీజ్ చేసిన ఈడీ



# మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ కాంగ్రెస్‌లో బిగ్ వికెట్ డౌన్



అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2014 నాటి ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఆ తరువాత బీఆర్ఎస్‌లో చేరి, ఆ పార్టీ తరఫున పోటీ చేసి భారీ మెజారిటీతో గెలిచారు.నియోజకవర్గంలో తనపై పోటీ చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడం పట్ల కేసీఆర్‌తో విభేదించారు. గత ఏడాది మార్చిలో ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థాన్ని పుచ్చుకున్నారు. సొంతగూటికి చేరుకున్నారు.ఇటీవలే తన నియోజకవర్గానికి కేటాయించిన ఫ్లైఓవర్ రద్దు కావడం కోనప్పను తీవ్ర అసంతృప్తికి గురి చేసిందని అంటున్నారు. కాంగ్రెస్‌ను దొంగల గుంపుగా విమర్శించారాయన. ఈ విషయంపై రేవంత్ రెడ్డితో మాట్లాడినప్పటికీ ఎలాంటి హామీ లభించలేదని, ఫలితంగా వారం రోజుల కిందటే పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది. దీనికి అనుగుణంగా ఇప్పుడాయన రాజీనామా చేశారు.

## నా దెబ్బతో బ్రిక్స్ మాటే వినిపించడం లేదు



కూటమి పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేసే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా అదే తరహాలో మాట్లాడారు. సుంకాలు విధిస్తామనగానే 'బ్రిక్స్' చెల్లాచెదురైందని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. "డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకొస్తే బ్రిక్స్‌పై 150 శాతం సుంకాలు విధిస్తానని నేను చెప్పగానే అందులోని దేశాలు పరస్పరం దూరం జరిగాయి. తర్వాత ఆ కూటమి మాటే వినిపించడం లేదు" అని విమర్శించారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, యూఏఈ.. ఈ గ్రూప్‌లో సభ్య దేశాలు.యూఎస్ డాలర్‌ను పక్కనపెడితే ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇప్పటికే ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. డాలర్‌కు బదులుగా బ్రిక్స్ దేశాలు మరో కరెన్సీని సృష్టించలేవన్నారు. ఒకవేళ వారు డాలర్‌ను వదులుకుంటే అద్భుతమైన యూఎస్ ఎకానమీలో అమ్మకాలకు గుడ్‌బై చెప్పి.. ఆయా దేశాలు ప్రయోజనం పొందడానికి మరో దేశాన్ని ఎన్నుకోక తప్పదని ట్రంప్ పేర్కొన్నారు. శక్తిమంతమైన అమెరికా డాలర్‌కు బదులుగా బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీని రూపొందిస్తే ఆయా దేశాల దిగుమతులపై 100 శాతం సుంకం విధిస్తామని, అమెరికాతో వాణిజ్యాన్ని వదులుకోవాల్సి ఉంటుందని గతంలో హెచ్చరించారు.గత అక్టోబరులో రష్యాలోని కజాన్ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరిగిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే బ్రిక్స్ దేశాలు ఉమ్మడిగా కరెన్సీ రూపొందిం చడంపై దృష్టిపెట్టాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చారు. పెట్టుబడుల ప్రాజెక్టులకు ఆర్థిక వనరులు సమకూర్చడానికి ఆయా దేశాలు డిజిటల్ కరెన్సీని వాడుకోవాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం కూటమిలోని దేశాలు డిజిటల్ కరెన్సీ వాడుకునేందుకు భారత్‌తో కలిసి రష్యా పని చేస్తోందన్నారు. సభ్య దేశాలు కొత్త ఆర్థిక సాధనాలను వినియోగించుకోవాలని పుతిన్ కోరారు. దీనిపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. కాగా అట్లాంటిక్ కౌన్సిల్‌కు చెందిన జియో ఎకనామిక్స్ సెంటర్ గత సంవత్సరం చేసిన అధ్యయనంలో బ్రిక్స్ దేశాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా డాలర్‌పై ప్రపంచ దేశాలు ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించలేవని వెల్లడించింది.

## తమిళ దర్శకుడు శంకర్ ఆస్తులను సీజ్ చేసిన ఈడీ



2010లో శంకర్ దర్శకత్వంలో వచ్చి విడుదలైన రోబో కాపీ రైట్ సినిమా విషయంలో మానీలాండరింగ్ కింద శంకర్‌కి చెందిన రూ.10 కోట్లకు పైగా విలువైన మూడు స్థిరాస్తులను ఈడీ జప్తు చేసింది. తమిళనాడుకి చెందిన అరూర్ తమిళనాథన్ అనే వ్యక్తి తన జిగుబా పుస్తకంలోని కథను కాపీ కొట్టి శంకర్ రోబో తెరకెక్కించినట్లు 2011లో ఎగ్మోర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. 1957 కాపీరైట్ యాక్ట్ ఉల్లంఘించిన నేపథ్యంలో శంకర్‌పై చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో తమిళనాథన్ పేర్కొన్నాడు.అయితే ఈ పిటిషన్‌పై ఎగ్మోర్ కోర్టు తాజాగా విచారణ చేపట్టింది. ఈ కేసు విషయంలోనే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నివేదిక కూడా శంకర్ వ్యతిరేకంగా రావడంతో పాటు జిగుబా కథ రోబో సినిమాకి దగ్గర పోలికలున్నాయని తెలిపింది. దీంతో శంకర్ కాపీరైట్‌లోని సెక్షన్ 63ను ఉల్లంఘించినట్టు ఈడీ స్పష్టం చేసింది. అలాగే రోబో సినిమాకు పారితోషకంగా 11.5 కోట్ల రూపాయలను శంకర్ అందుకున్నట్లు ఈడీ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం ఫిబ్రవరి 17న ఆస్తులను జప్తు చేసినట్లు ఈడీ వెల్లడించింది.

## హైకోర్టులో కేటీఆర్ పిటిషన్



కేటీఆర్ హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. బంజారాహిల్స్, ముషీరాబాద్ పీఎస్‌లలో నమోదైన కేసులు కొట్టేయాలని కోరారు. సీఎం రేవంత్‌ను అవమానించారంటూ కాంగ్రెస్ కార్యకర్త ఫిర్యాదుతో బంజారాహిల్స్‌లో కేసు నమోదైంది. బిల్డర్లు, కాంట్రాక్టర్ల వద్ద సీఎం రూ.2500 కోట్లు తీసుకున్నట్లు కేటీఆర్ ఆరోపణలు చేశారంటూ కాంగ్రెస్ కార్యకర్త బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఎన్నికల ప్రచారంలో బాణసంచా కాల్చినందుకు ముషీరాబాద్ పీఎస్‌లో కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌పై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణాలు లేకుండా పోలీసులు కేసులు నమోదు చేశారని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. సీఎంను దురుద్దేశ పూర్వకంగా అవమానించలేదని.. తన వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లలేదన్నారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను హైకోర్టు మార్చి 18కి వాయిదా వేసింది.

## 'మహా కుంభమేళాతో రూ.3 లక్షల కోట్ల ఆదాయం



### మొదటిపేజీ తరువాయి

ఆధ్యాత్మిక పర్యాటకం 10 కోట్ల మందికిపైగా ఉపాధి కల్పిస్తుందని పలు నివేదికలు చెబుతున్నాయి.

### యూపీకి రూ.3లక్షల కోట్ల ఆదాయం!

ప్రయాగ్‌రాజ్‌లో భక్తుల కోసం 3000 వంటశాలలు, 1,50,000 మరుగుదొడ్లను అధికారులు ఏర్పాటు చేశాయి. 40 కిలోమీటర్ల మేర 25 సెక్షన్లుగా విభజించి టెంట్ సిటీని ఏర్పాటు చేశారు.

ఇందులో నిర్మాణాలు, రోడ్లు, విద్యుత్,నీళ్లు, సెల్ టవర్లు, 11 ఆసుపత్రులను భక్తులకు అందుబాటులో ఉంచారు. నది ఇసుకతిన్నెల్లో విలాసవంతమైన గోపురాలు నిర్మించారు. వీటిలో బస చేయడానికి ఒక్క రాత్రికే 1000 డాలర్లు చెల్లించాలి. నదిలో బోటు ప్రయాణాలు, హోటళ్లు, చిన్న చిన్న వ్యాపారాలు వచ్చే భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

ఆటోలు, బస్సులు, రిక్షాలు, ప్రైవేటు వాహనాల్లో యాత్రికులు చేసే ప్రయాణాలతో భారీగా నగదు లభిస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లో లక్షలాది మందికి 45 రోజులపాటు పరోక్షంగా, ప్రత్యక్షంగా తాత్కాలిక ఉద్యోగాలు లభించాయి. మహాకుంభమేళాలో ఇచ్చే వాణిజ్య ప్రకటనలు, హోర్డింగ్‌లు వల్ల ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. వీటితో పాటు యాత్రికులు చేసే ఖర్చులు వల్ల ఉత్తర్‌ప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు కుంభమేళా బలం చేకూరుస్తోంది.తమ ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.3 లక్షల కోట్ల ఆదాయం లభిస్తుందని యూపీ సర్కార్ ప్రకటించింది. ఈ తరహా మతపరమైన వేడుకలు ఏటా దేశ ఆర్థిక వ్యవస్థకి పరోక్షంగా సాయపడతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

### 10కోట్ల మందికి ఉపాధి

సుమారు 8వ శతాబ్దం నుంచి ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా జరుగుతోంది. త్రివేణి సంగమంలో స్నానం ఆచరిస్తే పాపాలు తొలగిపోతాయనే నమ్మకంతో దేశ విదేశాల నుంచి భక్తులు కుంభమేళాకు తరలివస్తున్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భారీగా పోలీసు బలగాలను రంగంలోకి దింపారు.

భక్తులు సురక్షితంగా పుణ్యస్నానాలు ఆచరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 2030 నాటికి భారత్‌లో ఆధ్యాత్మిక పర్యటకం 10 కోట్ల మందికిపైగా ఉపాధి కల్పిస్తుందని నివేదికలు చెబుతున్నాయి. దేశీయ పర్యటకంలో ఆధ్యాత్మిక పర్యాటకం వాటా 60 శాతం ఉంటుందని తెలిపాయి.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం



### మొదటిపేజీ తరువాయి

మెరుగ్గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నిత్యం మానవత్వంతో నడుచుకోవాల్సిన వృత్తి వైద్య వృత్తి అని, ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ప్రజలకు సేవ చేసేందుకు వినియోగించాలని అన్నారు. నారాయణపేట ఆస్పత్రికి చిట్టెం నర్సిరెడ్డి పేరు పెడితే సముచితం అని భావిస్తున్నానని తెలిపారు. అనంతరం నారాయణపేట బహిరంగ సభలో పాల్గొననున్నారు."మారుమూల ప్రాంతంలో మెడికల్ కాలేజీ నిర్మించుకోవడం ఆనందంగా ఉంది. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. గత ప్రభుత్వ వైఖరి వల్ల 8 వైద్య కళాశాలల ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 8 వైద్య కళాశాలలు రద్దు కాకుండా కృషి చేశాం. అవసరమైన వసతులు కల్పించి మెడికల్ కాలేజీలను నిలబెట్టుకున్నాం."– రేవంత్ రెడ్డి, సీఎం.ఈ పర్యటనలో భాగంగా ముందుగా సీఎం వికారాబాద్ జిల్లాలోని పోలేపల్లి రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి చేరుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అర్చకులు, అధికారులు రేవంత్?రెడ్డికి అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. సీఎం రేవంత్? రెడ్డి వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్? రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ప్రత్యేక హెలికాప్టర్?లో నారాయణపేట జిల్లాకు సీఎం రేవంత్? రెడ్డి, మంత్రులు వెళ్లారు.

## తొక్కిసలాటలో 121 మంది మృతి.. బోలే బాబాకు క్లీన్ చీట్


### మొదటిపేజీ తరువాయి



జ్యూడిషియల్ కమిషన్ క్లీన్ చిట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ తొక్కిసలాట ఘటన పోలీసుల నిర్లక్ష్యం కారణంగా చోటు చేసుకుందని జ్యూడిషియల్ కమిషన్ ఆరోపించింది. ఈ ఘటనకు బాధ్యులు కార్యక్రమ నిర్వాహకులేనని జ్యూడిషియల్ కమిషన్ స్పష్టం చేసింది. ఇక అదే సమయంలో ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండేందుకు పలు కీలక సూచనలు సైతం జ్యూడిషియల్ కమిషన్ చేసింది.ఇటువంటి కార్యక్రమాలు చేపట్టినప్పుడు ఆ యా వేదికలను పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించాలని స్పష్టం చేసింది. ఈ తరహా కార్యక్రమాల ఏర్పాటుకు అనుమతి కోరినప్పుడు.. నిర్వహాకులు తప్పని సరిగ్గా నిబంధనలు పాటించేలా చూడాలని పేర్కొంది. తద్వారా ఈ తరహా ఘటనలు నివారించవచ్చని సూచించింది. అదే సమయంలో ఓ వేళ.. నిర్వహకులు ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తీసుకునేలా నిబంధనలు ఉండాలని జ్యూడిషియల్ కమిషన్ స్పష్టం చేసింది.2024, జులై 2వ తేదీన సికంద్రారావులోని ఫుల్లెరాయ్ మొఘట్ గఢి గ్రామంలో నారాయణ్ సకారి హరి బోలే బాబా అలియాస్ సురజ్‌పాల్ సత్సంగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన వెళ్లిపోయే సమయంలో.. బోలే బాబా పాద దూళిని కోసం జనం ఒక్కసారగా పరుగెత్తారు. దీంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 121 మంది మరణించారు. ఈ కేసులో 11 మందిని పోలీసులు అరెస్ట్ చేసి.. జైలుకు తరలించారు. ఈ ఘటనపై యూపీలోకి యోగి ప్రభుత్వం స్పందించింది. ఈ తొక్కిసలాట ఘటన వెనుక ఏమైనా కుట్ర కోణం ఉందా అనే అంశంపై దర్యాప్తు చేపట్టాలంటూ జులై 3వ తేదీన.. ముగ్గురు సభ్యులతో జ్యూడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు యోగి ప్రభుత్వం ప్రకటించింది.మరోవైపు.. ఈ కార్యక్రమం నిర్వహాణలో ముఖ్య సేవాదార్ దేవ్ ప్రకాశ్ మధుకర్‌తోపాటు పలువురు సేవాదార్‌లపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు పలు కేసులు నమోదు చేశారు.పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని ప్రముఖ సన్యాసుల్లో సంత్ నారాయణ్ సకారి హరి ఒకరు. నిత్యం తెల్ల దస్తులతోపాటు టై కట్టుకొని సత్సంగ్ కార్యక్రమాల్లో ఆయన ప్రవచనాలు చెబుతుంటారు. ఈ సత్సంగ్ కార్యక్రమాలకు ఆయన తన సతీమణితో కలిసి వస్తారు. ఆయన ప్రవచనాలు చెప్పే సమయంలో.. ఆయన భార్య పక్కనే కూర్చొని ఉంటారు. అయితే సంత్ నారాయణ్ సకారి హరి.. గతంలో ఇతా జిల్లాలోని బహదూర్ నగర్‌లో పోలీస్ శాఖలో చిన్న స్థాయి ఉద్యోగిగా విధులు నిర్వర్తించే వారు.1990లో ఆయన ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి.. బాబాగా అవతారం ఎత్తారు. అయితే కోవిడ్ సమయంలో.. ఆయన పలు సత్సంగ్‌లు నిర్వహించే వారు. అలా ఆయన సత్సంగ్ కార్యక్రమాలకు ప్రజాదరణ ఏర్పడింది. ఇంకోవైపు నారాయణ్ హరికి రాజకీయంగా మంచి పలుకుబడి ఉన్నట్లు ఓ ప్రచారం సైతం సాగుతోంది. పలు సందర్భాల్లో ఆయన నిర్వహించిన సత్సంగ్‌లకు వారు సైతం ముఖ్య అతిథిగా హాజరైనట్లు ఓ చర్చ సైతం సాగుతోంది.

## భారత్ నుంచి ప్రపంచస్థాయి నాయకులు తయారుకావాలి

### మొదటిపేజీ తరువాయి



భారతదేశం నుంచి ప్రపంచస్థాయి నాయకులు తయారుకావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. రాజకీయాలు, క్రీడలు, కళలు, మీడియా, ఆధ్యాత్మికం, బ్యూరోక్రసీ, వ్యాపారం సహా అన్ని రంగాల నుంచి ప్రపంచ స్థాయి లీడర్లు రావాలని ఆయన పిలుపునిచ్చారు. దిల్లీలోని భారత మండపంలో స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ (సోల్) సదస్సును ప్రారంభించిన ప్రధాని మోదీ ప్రపంచ సమస్యలు, అవసరాలను తీర్చే మేధస్సు కలిగిన నాయకులు తయారు కావాలని పేర్కొన్నారు.

**ప్రపంచ శక్తి కేంద్రంగా భారత్**

ప్రస్తుతం భారత్ ప్రపంచ శక్తి కేంద్రంగా అవతరిస్తోందని మోదీ చెప్పారు. ఈ ఒరవడిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లే శక్తిసామర్థ్యాలను నాయకులు అలవర్చుకోవాలని సూచించారు. ఈ మేరకు నాయకులను తయారుచేసే విషయంలో 'సోల్' గేమ్‌ఛేంజర్‌గా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఒకప్పుడు మహారాష్ట్ర నుంచి విడిపోయిన గుజరాత్ ఎలాంటి వనరులు లేకుండా ఎలా అభివృద్ధి చెందుతుందని అనే ఆందోళన వ్యక్తమైందని మోదీ గుర్తుచేశారు. అయితే ఆ రాష్ట్రంలో ఉన్న నాయకుల కారణంగానే గుజరాత్ మంచి అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు."అన్ని రంగాల్లోనూ భారత్‌తోపాటు యావత్ ప్రపంపంలో తనదైన ముద్ర వేయగలిగిన లీడర్లు స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ నుంచి వస్తారని నాకు విశ్వాసం ఉంది. ఇక్కడ శిక్షణ తీసుకొని బయటకొచ్చిన యువకులు రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించవచ్చు. ఏ దేశమైనా అభివృద్ధి సాధించింది అంటే సహజంగా అందులోని సహజవనరుల పాత్ర కీలకంగా ఉంటుంది. అంతకంటే ఎక్కువగా మానవవనరుల పాత్ర చాలా ఎక్కువగా ఉంటుంది."ఈ సదస్సులో భూటాన్ ప్రధాని దషో షేరింగ్ తోబ్గే కూడా పాల్గొన్నారు. 'సోల్' అనేది నరేంద్ర మోదీకి వచ్చిన 'కళాత్మక ఆలోచన' అని తోబ్గే అభివర్ణించారు. భారతదేశానికి సేవ చేయడానికి అనుగుణంగా యువతను శక్తివంతం చేయడంలో మోదీకున్న అచంచలమైన నిబద్ధతకు ఇది నిదర్శమని పేర్కొన్నారు. మోదీని తన 'గురువు, అన్నయ్య'గా తోబ్గే పేర్కొన్నారు. ఆయనను కలిసినప్పుడు ప్రజా సేవకుడిగా మరింత కష్టపడి పనిచేయడానికి తనకు ప్రేరణ లభిస్తుందని అన్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 22 - 02 - 2025

# ఉజ్వలమైన చరిత్రకు భూమిక వేసిన ఆర్ ఎస్ యూ




**హైదరాబాద్, తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం సదస్సు రెండో రోజు విజయవంతం అయ్యింది. ఈ సదస్సులో విరసం సభ్యులు పాణి మాట్లాడుతూ ఉజ్వలమైన చరిత్రకు భూమిక వేసిన ఆర్.ఎస్.యూ ఈనాడు మనకు కనిపించకపోవచ్చు కానీ, దాని ప్రభావం అది అందించిన చైతన్యం వర్తమానాన్ని నడిపిస్తున్నదని తెలిపారు.అది నడుస్తున్న చరిత్రను, భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో ఆర్.ఎస్.యూ మనకు నేర్పింది.మరీ ముఖ్యంగా మేధో,కళా ,సాంస్కృతిక రంగాలపై ప్రభావం చాలా పెద్దది ఆర్ఎస్యు తన ఆసరణ ద్వారా రచనల ద్వారా ఆలోచనల ద్వారా పంచిన జీవన రంగాలకు ఎంతో సృజనాత్మక విప్లవాత్మక ప్రభావాన్ని వేసింది. మరీ ముఖ్యంగా మేధా సృజన రంగాలపై ప్రభావం అనితర సాధ్యమైంది. అలాగే,తన ఆచరణ ద్వారా భారత విప్లవానికి నాయకత్వాన్ని అందించింది.ఆర్.ఎస్.యూ తన ఆచరణ ద్వారా గ్రామాలను, విశ్వవిద్యాలయాలను అనుసంధానించింది. గ్రామాలను వర్గపోరాట కేంద్రాలుగా మలిచింది. విశ్వవిద్యాలయాలను భావజాల సంఘర్షణ కేంద్రాలుగా మలిచింది.రాడికల్ విద్యార్థి సంఘం "గ్రామాలకు తరలండి". కార్యక్రమంలో గ్రామాన్ని, అంతిమంగా భారతదేశాన్ని అధ్యయనం చేసి పద్ధతిని నేర్పింది.విప్లవ రచయితల సంఘం తన రచనలు, సాహిత్యం ద్వారా ఆర్ ఎస్ యు ను ఎంతగా ప్రభావితం చేసిందో అంతకన్నా ఎక్కువగా తన ఆచరణ ద్వారా పోరాటాల ద్వారా త్యాగాల ద్వారా విరసాన్ని ప్రభావితం చేసింది.తన సృజనాత్మక కార్యాచరణ ద్వారా అద్భుతమైన సృజనా కారులను, మేధావులను, రచనా కారులను, నాయకత్వాన్ని అందించింది.ఆపరేషన్ కగార్ పేరుతో అంతిమ యుద్ధం చేస్తూ విప్లవోద్యమాన్ని నిర్మూలిస్తామని భారత పాలకవర్గం అనుకున్నది. కానీ ప్రజలందరినీ నిర్మూలించ లేరని విశ్వాసంతో జీవిద్దాం అని తెలిపారు. జ్యోతి మాట్లాడుతూ 70,80 దశకంలో లింగ బేధం వివక్ష అనేదే లేకుండా పనిచేశాం. విద్యార్థుల్లో సమస్యల పరిష్కారం కోసం పోరాటాల విద్యార్థులతో కలిసి పనిచేశాం.మహిళగా సామాజిక ఆచరణలోకి రావాలంటే కాదు మొదలుకుంటూ ధరలోని, ఘర్షణ ఎదుర్కోవడం జరిగింది. గ్రామాలకు తరలిరండి కార్యక్రమంలో గ్రామాల్లో బీజేపీ,ఏబీవీపీ వాళ్లతో తనదిగా ఘర్షణ పడాల్సి వచ్చింది శాస్త్రీయ ఆలోచనలకు వ్యతిరేకించడమే ఏబీవీపీ పనిగా పెట్టుకుని విద్యార్థుల్లో ఘర్షణ పడేది దారులకు గురయ్యేది ప్రాథమిక స్థాయిలో మహిళలపై హింసా దౌర్జన్యాలు ఏబీవీపీ రూపంలో జరిగేవి. ప్రశ్నించడం నేర్పిన మహిళా సమానత్వం గురించి మాట్లాడింది, ఆచరించింది.పురుషులతో పోలిస్తే, మహిళలకే ఎక్కువ సమస్యలున్నాయి అందుకే ఇట్లు ఉద్యమంలో మహిళలు లాగే లేని పోరాటాలు చేశారు, చేస్తున్నారు ఆ క్రమంలోనే మహిళలకే విప్లవం అవసరమని నేర్పింది స్వేచ్ఛ సమానత్వం పేరుతో వికృత పోకడలు వస్తున్నాయి నిజమైన స్వేచ్ఛ మహిళలకు సమాజ మార్పు విప్లవం ద్వారానే లభిస్తుంది. అని బోధించింది ఆ మార్గంలోనే మహిళలంతా నడవాలి అని తెలిపారు. రాజశేఖర్ మాట్లాడుతూ విప్లవద్యమాన్ని విభిన్న కుల అస్తిత్వాలకు కుదించలేమని భావించింది. పాలకవర్గాలు విప్లమోద్యమాన్ని బలహీనపరచడానికి ప్రజల్లో చీలికలు సృష్టించే కుట్రలో భాగంగానే అస్తిత్వాలు ఉనికిలోకి వచ్చాయి. సమాజంలోని అన్ని వర్గాల సమస్యలను పరిశీలించి,కుల సమస్య విప్లవోద్యమ విజయంతోనే ముడిపడి ఉన్నది.చేపట్టిన గ్రామాలకు తరలిరండి కార్యక్రమం లో విద్యార్థులు ఎక్కడికి పోవాలి, ఎక్కడ తినాలని దేశా నిర్దేశం చేసింది. అందులో విద్యార్థులంతా, మాదిగ వాడలోనే తినాలని బోధించింది. సమస్త కులాలు,వృత్తులకు సంబంధించింది పాటలు పాడింది, రాసింది.90ల దాకా విద్యార్థుల మధ్య కుల ప్రస్తావన లేదు అన్ని రకాల కుల వివక్ష,అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడింది ఒక రకంగా దళిత వర్గాలకు ధన్నుగా నిలిచింది గుణాత్మక మార్పులు ఏర్పరిచేందుకు, మొదటిసారి అగ్రవర్గాల అమ్మాయిలు వచ్చారు. దళిత విద్యార్థులు నాయకత్వంలోకి వచ్చారు. ఎక్కడ అయితే అట్టడుగు వర్గాలుంటాయో, అక్కడ ఉన్నది, ఉంటుంది.

# భూపాలపల్లిలో నడిరోడ్డుపై కత్తులతో దాడి

మాజీ సీఎం కెసిఆర్, హరీష్ రావు, ఇతర అధికారుల పై కేసు వేసిన రాజలింగమూర్తి

కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టు స్కాం పై కేసు పెట్టినందుకు చంపేస్తారా

ఇదెక్కడి న్యాయం అంటున్నా కాంగ్రెస్ నాయకులు

చంపినా వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్



**ములుగు జిల్లా ప్రతినిధి, తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలమేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిటమట రఘు మాట్లాడుతూ కాళేశ్వరంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్రావు, ఇతర అధికారులపై కోర్టులో కేసు వేసిన నాగవెల్లి రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు.భూపాలపల్లి పట్టణంలో నడిరోడ్డుపై ఆయనను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా చంపేశారు. కడుపులో, తలపై కత్తులతో పొడిచారు. పేగులు బయటపడి అక్కడిక్కడే మృతి చెందారు.మాజీ సీఎం కెసిఆర్ పై కేసు పెట్టిన రాజలింగమూర్తి దారుణహత్య,రాజలింగమూర్తి హత్య ముమ్మాటికి టిఆర్ఎస్ హత్యే,హత్య రాజకీయాలను ప్రేరేపించడమే మీ లక్ష్యమా కేసిఆర్ అంటున్న ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు.కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టు స్కాం పై కేసు పెట్టినందుకు చంపేస్తారా అంటూ ప్రశ్నిస్తున్న తెలంగాణ ప్రజలు. మాజీ సీఎం కెసిఆర్, హరీష్ రావు, ఇతర అధికారుల పై కేసు వేసిన రాజలింగమూర్తి.నేడు కోర్టులో కేసు విచారణ ఉండగా నిన్న హత్యకు గురైన రాజలింగమూర్తి. భూపాలపల్లి లో నడిరోడ్డుపై కత్తులతో దాడి.మేడిగడ్డ కుంగుబాటుపై కొన్నేళ్లగా రాజలింగమూర్తి పోరాటం చేస్తున్నారని కక్షపూరితంగా హత్య చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు,గ్రామ నాయకులు, అన్ని అనుబంధాల సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మండలాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్, రూరల్ తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** శుక్రవారం జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం, ఇనుగుర్తి మండలాలలోని కెజిబివి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ హాస్టళ్ళ లోని నిత్యావసర సరకులను, స్టోర్ రూం ను పరిశీలించారు. విద్యార్దులకు నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని అధికారులకు తెలిపారు. నిత్యావసర సరకుల సామాగ్రిని పంపిణీ చేసే ఏజెన్సీ వారు నాణ్యమైన వస్తువులను మాత్రమే సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్దులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని అన్నారు. విద్యార్దులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా వచ్చే బోర్డు పరీక్షల దృష్ట్యా, విద్యార్థులందరూ 10 సాధించేందుకు ఉపాధ్యాయులు సమగ్ర వ్యూహాన్ని అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. తరచుగా ప్రాక్టీస్ టెస్టులు నిర్వహించాలని, ఒక్కొక్క విద్యార్థి పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు పరిశీలించి, చుట్టూ పరిసరాల పరిశుభ్రత మెరుగుదల కోసం పలు సూచనలు చేశారు.ఇనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్యసేవల ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సూచనలు అందించారు. ప్రాథమిక పరీక్ష, ల్యాబ్ ను పరిశీలించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు.ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలని అన్నారు.ఈ తనిఖీలో స్థానిక మండలాల తహసిల్దార్ లు, మెడికల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కూతురిపై లైంగిక దాడి చేసిన తండ్రికి 20ఏండ్ల జైలు

పోక్సో కేసులో సంచలన తీర్పు వెల్లడించిన జడ్జి విశ్వనాథ్ దిలీప్

**నల్లగొండ జిల్లా తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** నల్గొండ జిల్లాలో కన్న కుమార్తెపైనే లైంగిక దాడికి పాల్పడిన కసాయి తండ్రికి 20ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో, ఫాస్ట్ ట్రాక్ కోర్టు సెషన్స్ జడ్జి కులకర్ణి విశ్వనాథ్ దిలీప్ రావు నల్లగొండ కోర్టులో శుక్రవారం సంచలన తీర్పును వెల్లడించారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన అక్కెనపల్లి ఆంజనేయులుకు, భార్య మాదవికి 2013లోనే గొడవలు అవుతున్నాయి. ఈ క్రమంలో ఆంజనేయులు మద్యానికి బానిసయ్యాడు. అతడితో వేగలేక భార్య పుట్టింటికి వెళ్లింది. డిసెంబర్ 14, 2023న 11 ఏండ్ల పెద్ద కూతురు, తన తండ్రి ఆంజనేయులు దగ్గరకు వెళ్లింది. పూటుగా మద్యం తాగిన ఆంజనేయులు, తన కన్న కూమార్తె అనికూడా మరిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. సాయంత్రం తల్లి వచ్చే చూస్తే, బాలికకు తీవ్రమైన రక్తస్రావం అవుతూ రోధిస్తూ, తల్లికి జరిగిన విషయం తెలిపింది. వెంటనే కట్టంగూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ డి.రాజు క్రైం నెంబర్ 207/2023, ఎస్సీ.నెం.39/2024, యూ/ఎస్ 376(2), (ఎఫ్)(ఐ), 376(3) ఐపీసీ, సెక్షన్ 5(ఎన్) ఆర్/డబ్లూ6 ఆఫ్ పోక్సో చట్టం 2012కింద కేసు నమోదు చేశారు. అప్పటి సీఐలు రాఘవ రావు, శ్రీనివాసరెడ్డి సంయుక్తంగా కేసు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అప్పటి నుంచి వాయిదాలపై నడుస్తున్న కేసు శుక్రవారం కోర్టులో ఫైనల్ కు వచ్చింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం, ఆంజనేయులను నేరస్థుడిగా నిర్ధారించి, 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ కోర్టులో వాదనలు వినిపించారు. ప్రస్తుతం శాలిగౌరారం సీఐ కే.కొండల్ రెడ్డి కోర్టులో సాక్షాదారాలను ప్రవేశపెట్టారు.

## గాదె రుక్మారెడ్డి పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం




**మహబుబాబాద్ టౌన్ తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్, మహబూబాబాద్ గాదె రుక్మారెడ్డి పాటశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు రీనాగోపీకృష్ణ, రజితామాదవ్, రజితా కృష్ణమూర్తి నిర్వహించిన ఈకార్యక్రమంలో రాష్ట్ర బీసీ నేత శంతన్ రామరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ నుండి విడిపోయిన బంగ్లాదేశ్ లో అక్కడి మాతృభాష అయిన బెంగాలీలోనే పరిపాలన సాగాలని ఉద్యమం సాగిందన్నారు. మాతృభాషను రక్షించుకునే క్రమంలో వేలాదిమంది మరణించారని పేర్కొన్నారు. ఆ సంఘటన ఫలితంగానే 1999, ఫిబ్రవరి 21వ. తేదీని యునెస్కో అంతర్జాతీయ భాషాదినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఫలితంగా ప్రపంచంలోని ప్రతి దేశం, ప్రతి ప్రాంతం ఆయా సంస్కృతులు సంప్రదాయాలను పరిరక్షించుకుకోవడంతో తమ మాతృ భాష గొప్పదనాన్ని గుర్తుచేసుకుంటాయన్నారు. ప్రతి వ్యక్తి అమ్మవడిలో నేర్చుకునే అమ్మ భాషను మర్చిపోవద్దన్నారు. ఇతరభాషలు మనకు బ్రతుకినిస్తే అమ్మభాష అయిన తెలుగు మనకు జన్మనిచ్చిందనే విషయం మారువొద్దన్నారు. మాతృ భాష అంటేనే బ్రాండ్ అని ఏదేశం వెళ్లినా మనకొక చిరునామా అని అన్నారు. ఏదేమైనా మన భాషతో పాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలే మన స్థాయిని, మన క్యారెక్టర్ ని నిర్దేశిస్తాయన్నారు.ఇంకా ఈకార్యక్రమంలో సన్మాన గ్రహీతలు సరోజినీ దేవి, సరస్వతి, శిరీష, మమత తో పాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ అవినీతి పై కేసీఆర్, హరీష్ ల పై కేసువేసిన రాజలింగమూర్తి హత్య రాజాకీయాలను ఖండించండి

## రాజ లింగమూర్తి హత్య పై జ్యూడిషియల్ విచారణ జరిపించాలి

తెలంగాణ ప్రజా ఫ్రెంట్ తెలంగాణ రాష్ట్ర కమిటీ

రాష్ట్ర కో-కన్వీనర్ మెంతెన సంజీవరావులి

**తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** నగవెల్లి రాజా లింగమూర్తి సామాజిక బాధ్యతగా ప్రభుత్వ భూములు, ఫారెస్ట్ భూములు, శిఖం భూముల అన్యాక్రాంతం. పలు ప్రైవేటు సంస్థలపై న్యాయ పోరాటాలు చేస్తున్నారు. ఈ క్రమంలో రాజలింగమూర్తిపై 18 కేసులతో పాటు పీడీయాక్ట్ నమోదైంది. హైకోర్టును ఆశ్రయించడంతో 98రోజులు జైలు జీవితం గడిపారు.గత అసెంబ్లీ ఎన్నికల ముందు లక్ష 35 వేల కోట్లతో కట్టిన మేడిగడ్డ ప్రాజెక్ట్ అవినీతి జరిగిందని, నాణ్యతా లోపంతో నిర్మించడంతోనే బ్యారేజీ కూలిపోయిందని ప్రాజెక్ట్కు ఖర్చుపెట్టిన రూ.లక్షల కోట్లు రికవరీ చేసేంత వరకు న్యాయ పోరాటం చేస్తానని జనవరి 2024న మీడియాకు వెల్లడించారు. ఈ విషయమై పిటీషన్ వేయగా భూపాలపల్లి జిల్లా కోర్టు స్వీకరించింది. అప్పటి సీఎం కేసీఆర్, హరీష్ రావు, రజత్ కుమార్, స్మితాసభర్వాల్, హరిరామ్, శ్రీధర్, మెగా కృష్ణారెడ్డి, ఎల్అండ్టీ కంపెనీ ఎండీ సురేష్ కుమార్ జిల్లా కోర్టు ద్వారా సమన్లు పంపించారు. వారి తరుపున న్యాయవాదులు హాజరు అయ్యారు,ప్రస్తుతం టిఆర్ఎస్ నాయకులు అనేకసార్లు కేసును విత్ డ్రా చేసుకోమని ప్రలోభాలకు గురి చేశారు ప్రలోభాలకు లొంగక పోవడం వలన నడి రోడ్డు పై ప్రాణం తీశారు. హత్యకు కేసీఆర్, కేటీఆర్ సూచనలతో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణ రెడ్డి, హరిబాబు, రేణుకుంట్ల కొమురయ్య, సంజీవ్, రవిలు కుట్ర చేసి చంపారని తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆరోపింపిస్తుంది, ఈ హత్య పైన జ్యూడిషియల్ విచారణ జరిపించాలి కారకులైనవారిపైన కఠిన చర్యలు తీసుకుని రాజలింగమూర్తి కుటుంబానికి న్యాయం చేయాలి" అని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది,

## రోడ్డు వెయ్యకుండానే బిల్లు డ్రా చేసిన కాంగ్రెస్ నాయకులు తాటి రాజబాబు

బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి రామరాజు నేత



**ములుగు జిల్లా ప్రతినిధి తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** పిబ్రవరి 21 శుక్రవారం రోజున కన్నాయిగూడెం మండల అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు రోడ్డు ను పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమం లో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత పాల్గొని మాట్లాడుతూ, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖమంత్రి అనుచరులు కిసాన్ సెల్ మండల అధ్యక్షులు తాటి రాజబాబు రోడ్డు నిర్మాణం చెయ్యకుండానే మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా తాటి సత్యం ఇంటి నుండి కావేరి నాగయ్య ఇంటి వరకు రోడ్డు వెసినట్టు రికార్డు చేసుకొని బిల్లు డ్రాచేసుకున్నారని అన్నారు.అదేవిదంగా ఇప్పటికైనా అవినీతి అక్రమాలు జరుగ కుండా ఉండాలంటే ప్రశ్నించే తత్వం ఉండాలని అన్నారు. ఇప్పటికైనా కన్నాయిగూడెం లోని యువకులు, మేధావులు పత్రిక మిత్రులు ఆలోచించండి. ఆదివాసీ దళిత బహుజన వర్గాలప్రజలు నివసించే పల్లెలు ప్రగతి సాదించాలంటే తెరాస కాంగ్రెస్ పార్టీ లను భూస్థాపితం చేస్తే మాత్రమే అవినీతి అక్రమాలు జరుగవన్నారు. అదేవిదంగా పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళాశిశు సంక్షమా శాఖ మంత్రి స్పందించి అవినీతి అక్రమాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటారా రోడ్డు పోస్తారో మంత్రే చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శి జనగాం ఆనంద్, మండల ఉపాధ్యక్షురాలు పానుగంటి సంగీత భూత్, అధ్యక్షులు కావేరి నాగయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిరంజీవి తల్లి అంజనాదేవికి అస్వస్థత..?

హుటాహుటినవిజయవాడ నుంచి హైదరాబాద్కు వచ్చిన పవన్ కళ్యాణ్



**తెలంగాణ సేన న్యూస్, ఫిబ్రవరి 21 :** మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనాదేవి అస్వస్థతకు గురయ్యారని సమాచారం. శుక్రవారం తెల్లవారుజామున అంజనాదేవిని నగరంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలుస్తోంది.వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ విషయంపై మెగా ఫ్యామిలీ నుంచి అధికారి కంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. తల్లి అనారోగ్యం విషయం తెలిసి విజయవాడ నుంచి పవన్ కల్యాణ్ హుటాహుటిన విజయవాడ నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజయవాడలో శుక్రవారం కార్యక్రమాలను, అధికారులతో సమీక్షలను రద్దు చేసుకున్నారని, అధికార వర్గాలు తెలిపాయి. కాగా, అంజనాదేవి అనారోగ్యా నికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇటీవల అంజనా దేవి పుట్టిన రోజును మెగాస్టార్ చిరంజీవి కుటుంబం ఘనంగా జరుపుకుంది. ఈ వేడుకకు సంబంధించిన వీడియోను చిరంజీవి ట్విట్టర్ వేదికగా షేర్ చేస్తూ తల్లికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## శాలిగౌరారం స్కూల్కు పూర్వ విద్యార్థుల కుర్చీల వితరణ



**శాలిగౌరారం తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** శాలిగౌరారం జడ్పి హైస్కూల్ కు 2003-2004. బ్యాచ్ పూర్వ విద్యార్థులు. వసుకుల శ్రవణ్ సొంత నిధులతో 10 వేల విలువ గల 4 కుర్చీలను హెచ్ ఎం కోట మల్లయ్యకు అందజేశారు.ఈ కార్యక్రమ ంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు తాటిపాముల శంకర్. బోడరాజు. తాటిపాముల జయరాజు. గరిగంటి శంకర్. కర్నాటి గిరి. వాడపల్లి మల్లేష్. ఆకుల రవి. గుండ్ల సైదులు. మొలుగూరి అశోక్. వరికుప్పల రాజు. నోముల రమేష్. బండారు ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

మరియన్న



**మహబూబాబాద్ రూరల్ తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తెలిపారు.శుక్రవారం దంతాలపల్లి మండలంలో సాగు లో ఉన్న మామిడి, ఆయిల్ పామ్ తోటలను సందర్శించి మేలైన యాజమాన్య పద్ధతులు గురించి తెలిపారు. ప్రస్తుతం రాబోయే వేసవి కాలంలో మామిడి తోటల లో, ఆయిల్ పామ్ తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు , వేసవి కూరగాయలు సాగు మరియు మామిడి తోటల్లో సస్య రక్షణ చర్యలు తెలియజేశారు.ఈ సందర్భనలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు.మరియన్న తో పాటు బిందు సేద్య అధికారులు కిషోర్, ప్రసాద్, అశోక్, రైతులు పాల్గొన్నారు.

## టీచర్స్ ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన అభ్యర్థినీ గెల్పించండి

జాడి రామరాజు నేత

**ములుగు జిల్లా ప్రతినిధి తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** పిబ్రవరి 20గురువారం రోజున బీజేపీ మండలపార్టీ అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క ఆధ్వర్యంలో వరంగల్ నల్గొండ ఖమ్మం జిల్లాలో బీజేపీ బలపర్చిన అభ్యర్థి పులి మద్దతుగా ఉండాలని టీచర్స్ ను కలిసి విన్నవించడం జరిగింది. ఈ సమావేశం కు ముఖ్య అతిధిగా బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా జాడి రామరాజు నేత పాల్గొని మాట్లాడుతూ, టీచర్స్ సమస్యలపై అనేక పోరాటాలు చేసిన అనుభవం ఉన్నటువంటి పులి సరోత్తం రెడ్డి కీ మద్దతుగా ఉండి గెల్పించాలన్నారు. అదేవిదంగా టీచర్స్ కు అసెంబ్లీ ఎన్నికలముందు ఇచ్చిన హామీల నేరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ బుద్ది రావాలంటే సమస్యలపై స్పందించే పులి సరోత్తం రెడ్డి కీ ఓటేయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మండలం ఉపాధ్యక్షులు పానుగంటి సంగీత, మండల ప్రధాన కార్యదర్శి, జనగాం ఆనంద్, కుమ్మరి సత్యం,టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకులవారి ఘనపురం యూత్ ఆధ్వర్యంలో డిస్టిక్ సెటిల్ టోర్నమెంట్

ముఖ్య అతిథిగాలు గా కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ములుగు జిల్లా ప్రతినిధి తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** ఆకులవారి ఘనపురం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా సెటిల్ టోర్నమెంట్ తుది అంకనికి చేరగా ఫైనల్ మ్యాచ్ లో విజేత గా నిలిచినా ములుగు టీమ్ రాహుల్ జట్టు కు ప్రధమ బహుమతి 10000, దుతీయ బహుమతి ఆకులవారి ఘనపురం ఖలీల్ జట్టుకు 5016, త్రుతీయ బహుమతి మహేంద్ర జట్టుకు 2016 అనంతరం షీల్డ్ లు అందించిన అనంతరం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చిటమట రఘు మాట్లాడుతూ ఆటలు అనేవి శరీరానికి దారుద్యానికి దోహద పడుతాయాన్ని, ఆటలు ఆడడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని అయన పేర్కొన్నారు. గేమ్స్ అనేవి పోటి పోటీగా ఉండాలని ఎవ్వరు గెలిచిన టీమ్ లలో ఎవ్వరు అధర్య చెందవద్దని, గెలుపు ఓటమి సహజమని రేపటి గెలుపు కోసం ప్రయత్నం చెయ్యాలన్నారు. ఈరోజు ఓడిపోయిన వారే రేపటి విజయం కోసం పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సెటిల్ టోర్నమెంట్ సభ్యులు ఖాలీల్, రియాజ్, కమిటీ సభ్యులు రోహిత్, సిరాజ్, తరుణ్ లు పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలి

ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేష్




**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన ఫిబ్రవరి.21 :** పట్టణంలోని వరంగల్ రోడ్డులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని నిరసన తెలియజేయడం జరిగింది అనం తరం ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పైసా గణేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ లను తక్షణమే విడుదల చేయాలని అన్నారు ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేస్తామని చెప్పినప్పటికీ ఈ ప్రభుత్వం ఇప్పటివరకు కూడా వాటిని అమలు చేయకపోగా విడుదల చేయడం లేదని అన్నారు విద్యార్థుల పైన ఎందుకు ఇంత కక్షపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడ్డారు అదే విధంగా విద్యార్థులు పై చదువుల కోసం సర్టిఫికెట్లు అడిగితే ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యం డబ్బులు కడితేనే మేము సర్టిఫికెట్లు ఇస్తాం అని విద్యార్థులను చాలా ఇబ్బందులు పెడుతున్నటువంటి పరిస్థితి ఉంది కాబట్టి తక్షణమే విద్యార్థులకు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్ చందు రాజకుమార్ ఆకాష్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో పూజలు



**సనత్ నగర్, తెలంగాణ సేన న్యూస్, ఫిబ్రవరి 21 :** సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయ చైర్మన్ సూరిటి రమేష్ ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న బన్సీలాల్ పేట్ డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు బి. జ్ఞాని కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు నూతన సంవత్సర కేలండర్ లను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కే.ఎం.కృష్ణ, గౌరీ శంకర్, అశోక్ ముదిరాజు తదితరులు పాల్గొన్నారు

# ప్రజాఫిర్యాదులన్నీ 'అప్‌లోడ్' అవుతున్నాయా ?




అధికారం చేపట్టిన తర్వాత కూటమి ప్రభుత్వం రెండు నెలల గడువులో రెండు రెవెన్యూ సదస్సులు జరపమని అధికారులను గ్రామాలకు పంపింది. గత ప్రభుత్వం రాష్ట్రంలో రీ సర్వే %ు% సెటిల్‌మెంట్ మొదలు పెట్టింది. కొన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ సర్వే పూర్తి చేసామని చెప్పుకుంది. ఆ రీ సర్వేలో చాలా తప్పులు జరిగాయి. ఆ అవకతవకలపై బాధితులు ఫిర్యాదు చేసుకోవచ్చని, 2024 అక్టోబర్‌లో ప్రభుత్వం 'రీ సర్వే గ్రామ సదస్సులు' పెట్టింది. అది అయిన రెండు నెలలకు డిసెంబర్ 6 నుంచి 2025 జనవరి 8 వరకు అన్ని రెవెన్యూ గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. గ్రామాలు, వ్యవసాయం గురించి తెలిసినవారెవరికైనా డిసెంబర్ నుంచి జనవరి మొదటి వారం వరకు పంటకోతలలో రైతులు, రైతుకూలీలు మునిగి ఉంటారని తెలుస్తుంది. భూమిశిస్తు కమిషనర్ కార్యాలయం డిసెంబర్ 3న, నాలుగు పేజీల ఉత్తర్వు ఇస్తూ గ్రామ రెవెన్యూ సదస్సులు ఎలా నిర్వహించాలో చెప్పింది. ఆ ఉత్తర్వులోని వివరాలలోకి వెళ్లేముందు, రాష్ట్ర ప్రభుత్వ ఇంటర్‌నెట్ వెబ్ పోర్టల్ 'ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'ను గురించి మాట్లాడుకుందాం. స్వతంత్ర అధికారాలు గల తహశీల్దార్ (ఎమ్మార్వో), రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో), కలెక్టర్ కార్యాలయాలలో ప్రతి సోమవారం 'ఫిర్యాదుల దినం' (గ్రీవెన్స్ డే)గా జరుపుకోవడం బ్రిటిష్ కాలం నుంచి ఒక ఆనవాయితీగా స్థిరపడింది. మిగిలిన రోజులలో అధికారి దొరకకపోవచ్చు కానీ సోమవారం నాడు తప్పక కార్యాలయంలో ఉంటారన్న నమ్మకం కూడా ప్రజలకు ఏర్పడింది.నిజానికి ఈ 'గ్రీవెన్స్ డే'లో ఇచ్చిన సమస్య పరిష్కారం కంటే, వచ్చిన బాధితునితో సదరు అధికారి వ్యవహరించే తీరు ఆ అధికారి పట్ల, ఆ వ్యవస్థ పట్ల, చివరిగా అప్పటి ప్రభుత్వం పట్ల ప్రజలలో గౌరవాన్ని పెంచడమో, తుంచడమో చేస్తుంది. థామస్ మన్రో (1761%-%1827) పేరును 'మన్రోలప్ప'గా రాయలసీమ ప్రాంత రైతులు తమ బిడ్డలకు పెట్టుకున్నారు. నేటి అనకాపల్లి జిల్లా, రోలుగుంట మండలంలోని గదబ ఆదివాసీ గ్రామం వీరపురాజు పేట ఆదివాసీలు, 1977 - 78 మధ్య నర్సీపట్టణం సబ్ కలెక్టర్‌గా పని చేసిన చటర్జీ పేరును తమ గ్రామం పేరుగా మార్చుకున్నారు. నేడది 'చటర్జీపురం'. అందుచేత, 'గ్రీవెన్స్ డే' నిర్వహణలో సాంకేతికత కంటే మానవతాస్ఫూర్తి ముఖ్యం.అనుచానంగా వస్తున్న ఈ 'గ్రీవెన్స్ డే'ని తామే ప్రత్యేకంగా కనిపెట్టినట్లు, పేర్లు పెట్టుకొని, తమ బొమ్మలు పెట్టుకునే పాడు సంస్కృతి దాపురించింది. ప్రభుత్వం మారగానే దాని పేరు మారుతుంది, నాయకుని బొమ్మ మారుతుంది... కానీ తీరు మాత్రం మారదు. గత ప్రభుత్వం దీనికి 'స్పందన' అని పేరు పెట్టింది. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలంటే మీకు ఆధార్, ఫోన్ నెంబర్ ఉండాలి. అవి లేకపోతే మీ సమస్య 'గ్రీవెన్స్ వెబ్ పోర్టల్'లో నమోదై, అధినేత బొమ్మతో రసీదు బయటకు రాదు. ఆ రసీదు లేకపోతే కలెక్టర్ వద్దకు మిమ్ములను దఫేదార్ పోనివ్వడు. రసీదు రావాలంటే, మీ అర్జీలోని బాధ/ సమస్య, అక్కడ ముందే సిద్ధంగా ఉన్న సమస్యల జాబితా (డ్రాప్ డౌన్)లో ఉండాలి. మీ సమస్య ఏమిటి, అది ఏ శాఖకు చెందింది, దానికి అధికారి ఎవరు, దానిని ఎన్ని రోజులలో పరిష్కరించాలి, ఇవ్వన్నీ సెలక్ట్ చేయడం ద్వారా నింపుతారు. అందులో తేడా వస్తే, వైకుంఠపాళిలో పాము మింగినట్లు మీ కథ మళ్లీ మొదటికి వస్తుంది. ఆన్‌లైన్‌లో నమోదైన పిటిషన్ ఒక ప్రత్యేక సంఖ్యతో అధికారి వద్దకు ఆన్‌లైన్‌లోనే పోతుంది. గడువులోగా పరిష్కారం అయినట్లు అధికారి జవాబు అప్‌లోడ్ చేయకపోతే దానిని 'పెండింగ్'గా చూపిస్తుంది. రాష్ట్రస్థాయిలో, తన జిల్లా నుంచి ఎక్కువ 'పెండింగ్' ఉన్నట్లు కనబడకూడదని ప్రతి జిల్లా కలెక్టర్ అనుకుంటారు. అందుచేత బాధితుని సమస్య పరిష్కారం కంటే, ఈ డేటా మేనేజ్‌మెంట్' ముఖ్యమయింది.మన దేశంలో 'శతకోటి అపాయాలకు అనంతకోటి ఉపాయాలు' ఉంటాయి. అసలు అర్జీలను 'గ్రీవెన్స్ వెబ్ పోర్టల్'లో నమోదు చేయడం మానేస్తే 'పెండింగ్' అనే రిమార్కు పీడ విరగడవుతుంది. జిల్లా కలెక్టర్ కార్యాలయం మినహాయిస్తే, రెవెన్యూ డివిజన్ (ఆర్డీవో), తహశీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయం 'గ్రీవెన్స్ డే'లో మనం ఈ దృశ్యాన్ని చూడవచ్చు. "పరిగెడుతున్నట్లే ఉంటుంది కానీ అక్కడే ఉంచే 'ట్రెడ్ మిల్' యంత్రంలా రెవెన్యూ శాఖ పనితీరు ఉంద"ని ఆ శాఖలోని ఓ అధికారి అన్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం జరిపిన గ్రామ రెవెన్యూ సదస్సులను చూడాలి. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు భూమిశిస్తు కమిషనర్ డిసెంబర్ 3న ఇచ్చిన ఉత్తర్వులలోని పేరా 6, సెక్షన్ 1లో, గ్రామసభ ప్రారంభానికి ముందు తహశీల్దార్ రెవెన్యూ గ్రామంలో ఉన్న షెడ్యూల్డ్ కులాలు(ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) ఆవాసాలలో పర్యటించి సదస్సు జరిగే ప్రదేశానికి చేరుకోవాలి. అదే పేరాలో, సదస్సుకు వచ్చిన అర్జీలు స్వీకరించి అక్కడే వారికి రసీదులు కూడా ఇవ్వాలని ఉంది. రసీదులు అంటే రెండు రకాలు, గ్రీవెన్స్ వెబ్ పోర్టల్‌లో నమోదు చేసిన కోడ్ నెంబర్ గల రసీదు. అందుకు సమయం పడుతుందనుకుంటే, ముందు ఒక చేతి రసీదు ఇచ్చి, తరువాత కోడ్ నెంబర్ రసీదు ఇవ్వడం. రెవెన్యూ గ్రామసభలలో ఇది జరిగిందా? రెవెన్యూ సదస్సులకు వచ్చిన అన్ని అర్జీలను గ్రీవెన్స్ వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారా? లేదా ఏవో కొన్ని అప్‌లోడ్ చేసి మిగిలిన వాటిని వదిలివేశారా? ఆదివాసీ రెవెన్యూ గ్రామాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం అర్జీలు ఇచ్చిన వారందరికీ సదస్సులో రసీదులు ఇవ్వలేదు.ఒక కేస్ స్టడీ చూద్దాం. అనకాపల్లి జిల్లా, రావికమతం మండలం, చీమలపాడు రెవెన్యూ గ్రామంలో కొన్ని ఆవాస గ్రామ ఆదివాసీలు కొందరు సామాజిక కార్యకర్తల సహకారంతో 13 అర్జీలు ఇచ్చారు. అందులో మూడింటికి అక్కడే వెబ్ పోర్టల్ రసీదులు ఇచ్చారు. మిగిలిన వారికి జిరాక్స్ అర్జీలపై సంతకం, తేదీ వేసి ఇచ్చారు. కార్యాలయం ముద్ర లేదు. కార్యాలయం ముద్ర లేని ఏ పత్రానికి లీగల్ సాధికారిత ఉండదు. ఇది జరిగింది డిసెంబరు 13న. ఈ కేసు రాష్ట్ర రెవెన్యూ ఉన్నతాధికారుల చెవికి చేరడం, వారు నిలదీయడంతో ఫిబ్రవరి నాలుగున మిగిలిన వాటిని అప్‌లోడ్ చేశారు. అంటే ఆదివాసీలు ఇచ్చిన 50 రోజులు తరువాత. అయితే ఇందులో మరో కొస మెరుపు కూడా ఉంది. సమస్యల పరిష్కారానికి రసీదులోని గడువు 90 రోజులు పెట్టారు. ఆ లోగా సమస్యలు పరిష్కారం అవుతాయా? చిత్తశుద్ధి ఉంటే కొన్ని అవ్వవచ్చు.ఫిబ్రవరి 8 నాటికి రాష్ట్ర గ్రీవెన్స్ వెబ్ పోర్టల్ సమాచారం ప్రకారం, మొత్తం అర్జీలు 7,44,249 కాగా, పరిష్కారం అయిపోయినవి 4,59,130 (70%). జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదులలో 80% భూ సంబంధమైన అర్జీలు ఉంటున్నాయని రెవెన్యూ మంత్రి అన్నారు. మంత్రి చెప్పిన 80% లెక్కన 3.67 లక్షల భూమి సమస్యల అర్జీలు పరిష్కారం అయిపోయాయనుకోవచ్చా. భూమి సమస్యల పరిష్కారం చట్టాలు, నియమాలు, ప్రభుత్వ విధానాలు, కోర్టు తీర్పులకు లోబడి ఉంటాయి. అవి ఏదో రేషన్ కార్డు మంజూరీ లాంటివి కాదు. ఉదాహరణకు%-% సాగు చేస్తున్న భూమికి పట్టా ఇవ్వాలని ఒక లక్ష అర్జీలు గ్రీవెన్స్ వెబ్ పోర్టల్ నమోదైనాయనుకుందాం. ప్రభుత్వం భూ పంపిణీకి విధాన నిర్ణయం తీసుకుంటే తప్ప, తహశీల్దార్లు ఏమీ చేయలేరు. అప్పుడు ఈ అర్జీలలో ఇచ్చిన గడువు సంగతి ఏమిటి? అవి పరిష్కారం కావు. అప్పుడు అవి ఆయా తహశీల్దార్ల ఖాతాలో 'పెండింగ్' నెంబర్లుగా కనిపిస్తూ ఉంటాయి. వాటి సంఖ్యలు తగ్గించాలనే వత్తిళ్ళు కలెక్టరేట్ నుంచి ఉంటాయి. తహశీల్దార్ ఏం చేయాలి? వాటిని తిరస్కరిస్తున్నట్లుగా ఎండార్స్‌మెంట్ ఇచ్చి దానినే పరిష్కరించినట్లు లెక్కలలో చూపించాలి. అంటే 'తిరస్కారమే' 'పరిష్కారం' అన్నమాట. ఇలాంటి గణాంకాలు చూసుకొని మురిసిపోవడానికి మాత్రమే పనికివస్తాయి.గ్రామ రెవెన్యూ సదస్సులు లేదా గ్రీవెన్స్ డేకి కలెక్టరేట్‌కు వచ్చే భూమి సంబంధిత అర్జీలను ఇతర సమస్యల అర్జీల నుంచి పూర్తిగా వేరు చేయాలి. అందులో 1. ఇంటి స్థలం%-% భూమి సమస్య 2. ప్రభుత్వ భూముల భూమి సమస్య 3.ప్రైవేటు భూముల భూమి సమస్య అనే ప్రాథమిక వర్గీకరణలు జరగాలి. ఇందులో మూడవ కేటగిరీ భూముల విషయంలో రెవెన్యూ అధికారులు చేయగలిగేది చాలా తక్కువ. అందుచేత భూమి సమస్యల అర్జీల స్వభావం పూర్తిగా వేరని ప్రభుత్వ పెద్దలు మొదట గుర్తించాలి. గ్రామ రెవెన్యూ సదస్సులకు ఎన్ని అర్జీలు వచ్చాయి, ఎన్ని వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారో విచారించాలి.ఆ రెండు ఒకటేనని ఏ జిల్లా రెవెన్యూ అధికారి చెప్పినా, అది వట్టి అబద్ధం కాదు, పచ్చి అబద్ధం. కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలనే కాదు మండల, డివిజన్ కేంద్రాలలో కూడా వినతిపత్రాల అప్‌లోడ్‌పై దృష్టిపెట్టి చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే చాలు భవిష్యత్తులో 'గ్రామ రెవెన్యూ సదస్సు'లు వంటి కార్యక్రమాల అవసరం లేదు.

# యుద్ధం - లాభం



అదే యుద్ధం గురించి అమెరికా నోట మొన్నటివరకూ విన్న భాష ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. బైడెన్ పోయి ట్రంప్ రాగానే యుద్ధంలో హీరోలు, విలన్లు ఒక్కసారిగా తారుమారైనారు. మూడేళ్ళ రష్యా%-%ఉక్రెయిన్ ఘర్షణలో దురాక్రమణదారుడని బైడెన్‌తో అనిపించుకున్న పుతిన్‌ను ట్రంప్ సమర్థించుకొస్తున్నారు. అయ్యోపాపం అని బైడెన్ జాలిపడిన జెలెన్‌స్కీని యుద్ధపిపాసివి నీవేనంటూ తిట్టిపోస్తున్నారు. తాను శ్వేతసౌధంలో ఉండివుంటే అసలు యుద్ధమే వచ్చేది కాదని, తాను అధ్యక్షుడు కాగానే యుద్ధం ఆగిపోతుందని ట్రంప్ ఎన్నికల కాలంనుంచీ చెబుతున్నారు. సంధిలో కాస్తంత ఎక్కువ న్యాయం పుతిన్‌కు దక్కుతుందని విశ్లేషకులు సైతం ఎప్పటినుంచో అంటున్నదే. కానీ, జెలెన్‌స్కీని ట్రంప్ మరీ ఇంత నాటుగా విమర్శిస్తారని, ఆ మాటలన్నీ పూర్తిగా రష్యా పక్షాన, ఏకంగా పుతిన్ నోటనుంచి ఊడిపడినట్టుగా ఉంటాయని ఎవరూ ఊహించలేదు.నియంత, హాస్యగాడు, ముందుచూపులేనివాడు, దుందుడుకు మనిషి ఇత్యాది మాటలతో, తక్షణమే దారికిరాకపోతే దేశాన్నే కోల్పోతావన్న హెచ్చరికలతో జెలెన్‌స్కీని ట్రంప్ ఘాటుగా బెదిరించారు. యుద్ధం ఆరంభించింది ఉక్రెయిన్ అని పుతిన్ మాటనే అమెరికా అధ్యక్షుడు వల్లెవేశారు. ఆదిలోనే రష్యాతో రాజీపడాల్సిన, యుద్ధాన్ని ముందుగానే నిలువరించాల్సిన బాధ్యత పూర్తిగా ఉక్రెయిన్ అధ్యక్షుడిదేనని ట్రంప్ తేల్చేశారు. రష్యా శక్తిముందు నువ్వెంత, నీ బలమెంత? అని శల్యసారథ్యం చేశారు. యుద్ధం చేసే బలం లేదని తెలిసీ తొడగొట్టిన ఈ దూకుడుమనిషి కారణంగానే వేలాదిమంది సైనికులు, ప్రజలూ ప్రాణాలు కోల్పోయారట. కాస్త భూమితో పోయేదాన్ని జెలెన్‌స్కీ యుద్ధం వరకూ తెచ్చాడని, ఇప్పుడు ఉన్నది కాస్తా ఊడిందంటూ ఈ యుద్ధంలో అంతిమవిజయం పుతిన్‌దేనని ట్రంప్ తేల్చేశారు. అపారమైన నష్టం, తప్పుడు నిర్ణయాలు, తెలివితక్కువతనం ఇత్యాది ట్రంప్ మాటలన్నీ పూర్తిగా జెలెన్‌స్కీని ఉద్దేశించినవే తప్ప, రష్యాను కానీ, పుతిన్‌ను కానీ ఆయన గట్టిగా తప్పుబట్టిందీ, ఘాటుగా అన్నదీ ఏమీ లేదు.సౌదీ శాంతిచర్చలకు తనను ఆహ్వానించనందుకు జెలెన్‌స్కీ ఆగ్రహించడం, ఉక్రెయిన్ ప్రమేయం లేకుండా యుద్ధాన్ని ఎలా ముగిస్తారని ప్రశ్నించడం అసమంజసమేమీ కాదు. అందుకు ప్రతిగా ట్రంప్ ఈ స్థాయిలో విరుచుకుపడటం, జెలెన్‌స్కీ వెంటనే దిగివస్తే కోల్పోయిన భూమిని ఇప్పిస్తానని, లేదంటే ఏలుకోవడానికి దేశమే ఉండదని హెచ్చరించడం విచిత్రం. ఉక్రెయిన్‌కు స్థానం లేకుండా చర్చలు ఆరంభించాలని వారం క్రితం అమెరికా%-%రష్యా అధ్యక్షులు నిర్ణయించినప్పటినుంచీ జెలెన్‌స్కీ తెగబాధపడుతున్నారు. నాటో ఇప్పటికైనా నిజాన్ని గ్రహించాలని, సొంత సైన్యాన్ని నిర్మించుకోవాలని ఏవేవో సలహాలు ఇస్తున్నారు. యుద్ధాన్ని ముగించే విషయంలో ఎవరికీ ఏ అభ్యంతరాలు ఉండవుగానీ, ఆ పని ఎలా జరగాలన్న విషయంలో ఉక్రెయిన్, యూరప్ అనుకున్నదానికి పూర్తిభిన్నంగా ట్రంప్ ఆలోచనలు ఉంటాయన్నది నిజం. ఆయన విమర్శలన్నీ ఉపరితలంలో పుతిన్ పక్షాన ఉన్నట్టు కనిపిస్తున్నప్పటికీ, పూర్తిగా అమెరికా ప్రయోజనాలు, వ్యక్తిగత లాభాల దృష్టితోనే ఆయన వ్యవహరిస్తారన్నది సుస్పష్టం. తనకు నచ్చినరీతిలో గుదిగుచ్చిన శాంతి ఒప్పందానికి, భూ పంపకాలకు జెలెన్‌స్కీని లొంగదీయడం లక్ష్యంగా ఆయన ఈ మాటలన్నీ అంటున్నారనీ, ఉక్రెయిన్ ప్రజల దృష్టిలో అమెరికాకు నచ్చని జెలెన్‌స్కీ పరువు మరింత దిగజార్చి, ఒప్పందానికి అడ్డుపడుతున్న ఆయనను ఇంతలోగానే దింపివేయాలన్నది లక్ష్యం కావచ్చు. దాదాపు రెండువందల బిలియన్ డాలర్ల ఆర్థిక, ఆయుధసాయంతో ఈ మూడేళ్ళ యుద్ధకాలంలో ఉక్రెయిన్‌ను ఆదుకున్న అమెరికా, అనంతరకాలంలో అనేక రెట్లు దోచుకుంటుందని ఎప్పటినుంచో అనుకుంటున్నదే. గాజాను రియల్‌ఎస్టేట్ కళ్ళతో చూసినట్టుగా, ఇప్పుడు ఉక్రెయిన్‌ను ఆయన ఖనిజాల గనిగా చూస్తున్నారు. అత్యంత విలువైన, అరుదైన ఖనిజాల్లో సగం తవ్వుకోనిస్తే అమెరికా మద్దతు కొనసాగుతుందని ఆయన ఈ మధ్యనే ఓ హెచ్చరికలాంటి ప్రతిపాదన చేశారు. ఇది ఐదువందల బిలియన్ డాలర్ల శాంతి ఒప్పందం అంటూ అమెరికా పత్రికలే వ్యాఖ్యానిస్తున్నాయి. కడవరకూ అండగా ఉంటానని హామీ ఇచ్చి ఇలా మిత్రుడిని నడిమధ్యలో వదిలేయడం అగ్రరాజ్యానికి పరువుతక్కువన్న హెచ్చరికలు, హితవులు ఈ తెలివైన వ్యాపారికి ఏమాత్రం పట్టవు.

# ప్రజానుకూల పద్దు కావాలి




'షెడ్డులో సగం.. గుడిలో సగం' ఆదిలాబాద్ జిల్లా దుబ్బగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితిని వివరిస్తూ పత్రికల్లో తాజాగా వచ్చిన కథనానికి శీర్షిక ఇది. 'ప్రసవానికి డోలీలోనే' భద్రాచలం మారుమూల అటవీ ప్రాంతంలో గర్భిణీలు, బాలింతల పరిస్థితిపై వచ్చిన మరో కథనమిది. అత్యంత కీలకమైన విద్యా, వైద్య రంగాలపై పాలకుల నిర్లక్ష్యానికి ఇవి ప్రబల తార్కాణాలు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకూ ప్రభుత్వాలు ఈ రెండు రంగాలకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్నాం వాటి విడుదల, తద్వారా పథకాల అమల్లో మాత్రం చిత్తశుద్ధిని ప్రదర్శించలేకపోతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాకపోవటం శోచనీయం. గత బీఆర్ఎస్, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాలు సైతం 'చేసింది గోరంత-చెప్పుకునేది కొండంత' అనే విధంగానే వ్యవహరిస్తున్నాయి తప్పితే ఆచరణలో చిత్తశుద్ధిని ప్రదర్శించటం లేదు. గత దశాబ్ద కాలంగా వైద్య విద్య, ఫుడ్ సేఫ్టీ, మాదక ద్రవ్యాల విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయంటూ ఇటీవల నిర్వహించిన బడ్జెట్ ప్రతిపాదిత సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వాపోయారు.. కానీ గత ఏడాది కాలంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు, ఆయా రంగాలను ఎందుకు ప్రక్షాళన చేయలేదు, వాటికి చాలినన్ని నిధులు ఎందుకు కేటాయించలేదన్నది ప్రశ్నార్థకం.మరోవైపు రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన దళితులు, గిరిజనుల కోసం ఉద్దేశించిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక నిధుల విషయంలోనూ పాలకులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటం ఆందోళనకరం. బీఆర్ఎస్ హయాంలో సంబంధింత నిధుల వ్యయం ఎప్పుడూ 70 శాతాన్ని దాటలేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మిగతా ముప్ఫై శాతం నిధులను కేసీఆర్ సర్కారు ఇతర పనులకు వినియోగించిందన్న విమర్శలకు అప్పటి ప్రభుత్వం ఇప్పటిదాకా జవాబివ్వకపోవటం గమనార్హం. 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు సైతం అదే బాటలో నడిచి, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేసింది. 2023-24లో ప్రతిపాదించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పేర్కొన్న నిధుల్లో 77శాతాన్ని ఖర్చు చేసి, మిగతా 23 శాతాన్ని వదిలేసింది. 2024-25 బడ్జెట్‌లో ఇప్పటి వరకూ 48 శాతం నిధులను ఖర్చు చేశారు. అయితే ప్రస్తుత పద్దుకు మార్చి ఆఖరు వరకూ గడువుంది కాబట్టి, అప్పటి వరకూ ఎంత వ్యయం చేశారనే లెక్కలు తేలాల్సి ఉంది.పరిస్థితి ఈ విధంగా ఉండగా%ౌ% మరికొద్ది రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి తన బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతోంది. ఈ నేపథ్యంలో ప్రజా ప్రాధాన్యతల గురించి సర్కారు ఆలోచించి, తదనుగుణంగా ముందుకెళ్లాలి. రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకూ విద్యారంగంలో అన్ని స్థాయిల్లోనూ సమూల మార్పులు తెస్తా మంటున్న రేవంత్ సర్కారు%ౌ%అందుకోసం అవసరమైన నిధులను కేటాయించాలి. తెలంగాణలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలంటూ సీపీఐ(ఎం) ఇటీవల విజ్ఞప్తి చేసిన సంగతి విదితమే. ఆ కోవలోనే ఇతర రంగాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన బడ్జెట్‌ను ప్రతిపాదించాలి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు వీలుగా బడ్జెట్ కూర్పు ఉండాలి.బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వాటిని చెల్లించేందుకు తిప్పల గురించి ఇప్పటిదాకా చెబుతూ వచ్చిన కాంగ్రెస్ సర్కారు%ౌ% ఇక ఇప్పుడు తప్పించుకోవటానికి వీల్లేదు. అధికారంలోకి వచ్చిన కొత్తలో 'ప్రభుత్వ ఉద్యోగులం దరికీ ఒకటో తారీఖునే జీతాలు%ౌ%' అంటూ ముఖ్యమంత్రి, మంత్రులు ఆర్భాటంగా ప్రకటించినప్పటికీ అది మూన్నాళ్ల ముచ్చటగానే మారింది.ప్రభుత్వఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, సిబ్బందికి రావాల్సిన గ్రాట్యూటీ, ఇతర బెనిఫిట్లు, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు చెల్లించాల్సిన ఈఎల్స్ డబ్బులు తదితరాలు రూ.వందల కోట్ల మేర పేరుకు పోవటంతో ఆర్థికశాఖ ఉన్నతాధికారులకు ఏం చేయాలో తెలియని దుస్థితి. వాటి కోసం నెలలు, ఏండ్లు ఎదురు చూసిన బాధితులు సహనం కోల్పోతున్న పరిస్థితి. ఇలాంటి సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారం బడ్జెట్. అది ప్రజానుకూలంగా ఉంటే ప్రభుత్వం సేఫ్. లేదంటే మళ్లీ ధర్నాచౌక్ దద్దరిల్లటం ఖాయం.

# కొలువులెక్కడ ?



దేశంలోని మిగతా రాష్ట్రాలు భౌగోళికంగా ఏర్పడితే, తెలంగాణ మాత్రం భావోద్వేగాల పునాదుల మీద ఏర్పడింది. ఇక్కడ కదిలిస్తే అమరవీరుల తల్లుల కన్నీళ్లు కన్పిస్తాయి. నీళ్లు, నిధుల కోసం నాయకులు కొట్లాడితే కొలువులే కొలమానంగా తొలి నుంచి తుది వరకు ఉద్యమంలో కొట్లాడింది విద్యార్థులే. తెలంగాణ వస్తే కోరుకున్న కొలువు వస్తదని, గొప్పగా బతుకుతామని తమ ప్రాణాలను పణంగా పెట్టారు.తమది ప్రజా ప్రభుత్వమని, నిరుద్యోగుల బాధలు, సమస్యలు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలని, జాబ్ క్యాలెండర్ అని ప్రకటించి ఆశలు రేకెత్తించారు. ఇంకెన్నో హామీలివ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇక కొలువుల పండుగే అనుకున్నాం. కానీ, అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా మోసం చేసింది. ఏడాది తిరిగేలోగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటికి ఇచ్చింది 12 వేల ఉద్యోగాలు మాత్రమే. అంటే 5 శాతం మాత్రమే భర్తీ చేసి 95 శాతం ఉద్యోగాల భర్తీని మర్చిపోయింది. ఇచ్చింది 12 వేల ఉద్యోగాలే అయినా 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటు.ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వంలో చిత్తశుద్ధి కనిపించడం లేదు. కనీసం ఆ వైపుగా కూడా అడుగులు పడటం లేదు. దీంతో నిరుద్యోగుల్లో రోజురోజుకు నమ్మకం సన్నగిల్లుతున్నది. పోటాపోటీగా జాబ్ క్యాలెండర్ కృతజ్ఞత సభలను పెట్టారు కానీ, దాని అమలు విషయాన్ని మర్చిపోయారు. నిరుద్యోగులంటే నిరక్షరాస్యులు కాదు.. వారిని ఎప్పటికీ మోసం చేయలేరు. రికార్డుస్థాయిలో ఉద్యోగాలను భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ అని, అప్పులని, వర్గీకరణ అంటూ కావాలనే కాలయాపన చేస్తున్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ఏపీలో అడ్డురాని ఎస్సీ వర్గీకరణ తెలంగాణలో ఎందుకు వస్తున్నది.ప్రభుత్వ అప్పులకు, ఉద్యోగాలకు ముడిపెట్టడం ఎంతమాత్రమూ సబబు కాదు. కాంగ్రెస్ వస్తే కొలువులు వస్తాయని నిరుద్యోగులు ఎంతగానో కష్టపడ్డారు. కాబట్టి మ్యానిఫెస్టోలో పెట్టినట్టుగా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి. రిటైర్మెంట్ వయసును ప్రభుత్వం పెంచబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే నిజమైతే నిరుద్యోగుల ఆశలపై నీళు చల్లినట్టు అవుతుంది. ఏండ్లకేండ్లు కుటుంబాలకు దూరంగా, అర్ధాకలితో, రూ. 5 భోజనం చేస్తూ, అగ్గిపెట్టెలాంటి గదుల్లో ఉంటూ, అప్పులు చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ఇది కోలుకోలేని దెబ్బ అవుతుంది. ఆర్థిక ఇబ్బందుల నెపంతో తాత్కాలిక ఉపశమనం కోసం నిరుద్యోగుల కలలను సమాధి చేయడం తగదు. ఉద్యోగాల భర్తీని, జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే త్వరలో జరిగే కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఊరూరా తిరిగి ప్రచారం చేస్తాం. కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తాం. రిటైర్మెంట్ తర్వాత ప్రశాంతంగా, హాయిగా, సంతోషంగా కుటుంబ సభ్యులతో బతకాల్సిన ఉద్యోగులను రిటైర్మెంట్ వయసు పెంచి బలవంతంగా వారిని ఉద్యోగంలో కొనసాగించాల్సిన అవసరం ఏమొచ్చింది. రిటైర్మెంట్ వయసు పెంచాలని వారేమీ ధర్నాలు, నిరసనలు చేయలేదు కదా. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచితే దాదాపు 50 వేల ఉద్యోగాలను నిరుద్యోగులు కోల్పోతారు.స్థానికేతరులు అయిన ఆంధ్రావారికి, కొన్ని వర్గాల ప్రజల మెప్పు కోసం ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా జీవో 29ను తీసుకొచ్చింది. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా మెరిట్‌కే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంది. దీపేందర్ యాదవ్, కిషోర్ చౌదరి, సౌరవ్ యాదవ్, ఇందిరా సహానీ కేసుల్లో అన్ని దశల్లోనూ (ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ) రిజర్వేషన్లు పాటించాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అయినప్పటికీ కోర్టు తీర్పులకు విరుద్ధంగా ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తున్నది. ఇక, జీవో 46 ఇంకో లొల్లి. అధికారంలోకి వచ్చాక జీవో 46ని రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చింది. ఇంతవరకు ఆ పని చేయకపోగా, దీనిపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న బాధితులకు సాయం చేయడానికి కూడా ముందుకు రావడం లేదు. ఇది ప్రభుత్వ ద్వంద్వనీతికి నిదర్శనం.ఎప్పటికప్పుడు ఖాళీ అయ్యే ప్రతి ఉద్యోగమూ ముందు రోజే భర్తీ అయ్యేలా ప్రభుత్వం కృషి చేయాలి. ప్రభుత్వ ఉద్యోగాలు పరిమితంగా ఉంటాయి కాబట్టి ప్రైవేటు ఉద్యోగాలపైనా ప్రభుత్వం దృష్టిసారించాలి. తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు ఇచ్చే కంపెనీలకు రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించాలి. తెలంగాణ ఏర్పడిందే నియామకాల కోసం కాబట్టి ప్రైవేటు ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకు దక్కేలా ప్రభుత్వం చట్టం తీసుకురావాలి.పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యంపై ప్రభుత్వమే శిక్షణ ఇవ్వాలి. ప్రతి మండలంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పరిశ్రమలు కోరుకుంటున్నట్టు, పారిశ్రామిక అవసరాలు తీర్చేలా విద్యా వ్యవస్థని సమూలంగా మార్చాలి. వ్యాపారాలు చేయాలనుకునే తెలంగాణ బిడ్డలకు ఉదారంగా రుణాలు ఇవ్వాలి. అప్పుడే కొలువుల తెలంగాణ అవతరిస్తుంది.

## అలవాటైన నిర్లక్ష్యం!



మహాకుంభమేళాతో ముడివడిన మరో దుర్ఘటన ఇది. ప్రయాగ్‌రాజ్‌కు ప్రయాణం కట్టిన సామాన్యులను భద్రంగా గమ్యానికి చేర్చని మన రైల్వేవ్యవస్థ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం ఇది. తొక్కిసలాటలను ఊహిస్తామా, కల గంటామా అన్న అడ్డగోలువాదనలకు ఇక్కడ తావులేదు. లక్షలాదిమంది రైళ్ళలో ప్రయాగ్‌రాజ్‌కు పయనమవుతున్నందున ప్రమాదాలకు ఆస్కారం లేని రీతిలో అన్ని ఏర్పాట్లు చేయాలి, అడుగడుగునా వారిని కనిపెట్టుకోవాలి. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో 18మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన అత్యంత విషాదకరమైంది. ఆప్తులను కోల్పోయిన లోటు ఎన్నటికీ తీర్చలేనిది. తండ్రి కళ్ళెదుట కుమార్తె శిరస్సు ఛిద్రమైన ఘోరం సహా తొక్కిసలాట తీవ్రత ఏ స్థాయిలో, ఎంత దారుణంగా ఉన్నదో తెలియచెబుతూ పలు కథనాలు వెలుగుచూశాయి. ఎముకలు విరిగి, అవయవాలు దెబ్బతినిపోయిన క్షతగాత్రుల వేదన మరో రకమైనది. న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ సమీప భవిష్యత్తులో ఎంత అద్భుతంగా ఉండబోతున్నదో చూడండి అంటూ ఐదేళ్ళక్రితం అప్పటి రైల్వేమంత్రి పీయూష్ గోయల్ విడుదల చేసిన కొన్ని చిత్రాలు ఇప్పుడు తిరిగి సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి. వేలాదికోట్లు ఖర్చుచేసి రైల్వేస్టేషన్లకు మెరుగులుదిద్దుతున్న మాటలు ఒకపక్క వినబడుతూండగానే, మరోపక్క ఇటువంటి దారుణాలు సంభవించడం ఆశ్చర్యం.జరిగిన ఘోరానికి పద్ధతీపాడూ లేని ఆ సాధారణజనమే కారణం తప్ప తమ నిర్లక్ష్యం కాదని పాలకులు, అధికారులు పరోక్షంగా వాదిస్తున్నారు. ఆఖరునిముషంలో మరో ప్లాట్‌ఫామ్ మీదకు రైలును తెచ్చి, మీరు ఎక్కాల్సిన రైలు మీరు వేచివున్నదగ్గరకు కాక, వేరే చోటకు వస్తున్నదని ప్రకటించి రైల్వే అధికారులే తొక్కిసలాటకు కారకులైన సందర్భాలు గతంలో లేకపోలేదు. ఆ తరువాత అటువంటి తప్పటడుగులు వేయకూడదని నిర్ణయించుకున్నప్పటికీ, ఇప్పుడు జరిగింది కూడా దాదాపు అటువంటిదే. అనేక రైళ్ళు ప్రయాగ్‌రాజ్‌కే ప్రయాణం కడుతూ, వేలాదిమంది యాత్రికులు వాటికోసం ఎదురుచూస్తున్నప్పుడు 'ప్రయాగ్‌రాజ్' అన్న ఒక్కమాట సదరు సామాన్యయాత్రికుల్లో గందరగోళాన్ని సృష్టించడం సర్వసాధారణం. మామూలురోజుల్లోనే ఎక్కాల్సిన రైలు ఎక్కి కూర్చునేంతవరకూ ప్రయాణికుడి మనసులో ఆందోళన నెలకొనే ఉంటుంది. ఈ కుంభమేళాకాలంలో పేరు చివర్లో చిన్నచిన్న మార్పులతో అన్ని రైళ్ళకూ గమ్యస్థానం పేరు తగిలించి, ఒకే సమయంలో వేర్వేరు ప్లాట్‌ఫామ్‌ల మీదకు పలు రైళ్ళను తెస్తే యాత్రికులు గాభరాపడటం సహజం. పైగా, చాలా రైళ్ళు ఆలస్యంగా నడుస్తున్న స్థితిలో ఎదురుచూపుల్లోనే వారి వివేకం, సహనం చచ్చిపోతాయి. స్టేషన్‌లో ఎస్కలేటర్లు పనిచేయడం లేదని, యాత్రికులు దగ్గరతోవలో పోయేందుకు ప్రయత్నించి ప్రాణాలమీదకు తెచ్చుకున్నారని పలు విశ్లేషణలు వింటున్నాం. వాటిని అటుంచితే, చివరి రెండుగంటల్లో యాత్రికుల సంఖ్య విపరీతంగా పెరిగిన స్థితిలో వారిని నియంత్రించడానికి నిర్దిష్టమైన ప్రయత్నాలు జరిగిన దాఖలాలు కూడా లేవు. పావుగంటలో ఇన్ని ప్రాణాలు పోయిన తరువాత, అతి వేగంగా వరుసరైళ్ళలో యాత్రికులను తరలించగలిగిన రైల్వేశాఖ ముందుచూపుతో ఎందుకు వ్యవహరించలేకపోయిందో తెలియదు. ఈ ఘటన తరువాత అమలులోకి తెచ్చిన పలురకాల రక్షణలు, జాగ్రత్తలు ముందే ఎందుకు లేవన్నది ప్రశ్న.ఈ ఘటనకు మూడురోజుల ముందు రైల్వేభవన్‌లో మంత్రి అశ్విన్ వైష్ణవ్ కూర్చొని అన్ని ప్రధాన స్టేషన్లలో రద్దీని సమీక్షిస్తున్న చిత్రాలను మీడియా ప్రసారం చేసింది. పడుతున్న కష్టాన్ని ప్రజలకు చెప్పుకోవడంలో తప్పులేదు కానీ, మీడియా నిర్వహణ కంటే జనసమ్మర్దాన్ని నిర్వహించడం మరీ ముఖ్యం, ఎంతో కష్టం అని ఈ ఘటన గుర్తుచేస్తోంది. రైల్వేమంత్రి రాజీనామాకు విపక్షాలు డిమాండ్ చేయడం సహజం. మూడువందలమంది ప్రాణాలు తీసిన బాలాసోర్ రైలు ప్రమాదం తరువాత కూడా రైల్వేమంత్రి రాజీనామా చేయలేదు. ఆయనకు అటువంటి ఇబ్బంది రాకుండా ఉండేందుకే కాబోలు ఆ ఘోరం జరగగానే చాలా కుట్రసిద్ధాంతాలు తెరమీదకు వచ్చాయి. రైలుదుర్ఘటనలు జరిగినప్పుడు వీలైతే విదేశీశక్తులను, లేకుంటే దేశీకుట్రదారులను తప్పుబట్టి అసలు కారణాలను బయటకు పొక్కనివ్వకపోవడం అనాదిగా జరుగుతున్నదే. ఎన్ఐఏ, సీబీఐ వంటి సంస్థలను రంగంలోకి దించిన ఘోర రైలుప్రమాదాల్లో సైతం నిజం ఇంకా వెలుగుచూడలేదు. ఢిల్లీ తొక్కిసలాట ఘటనను మొదట్లోనే కప్పిపుచ్చడానికి ప్రయత్నించినవారు ఆ నామమాత్రపు దర్యాప్తును సరైనదిశగా సాగనిస్తారా?

### ప్రోటీన్లు అంటే నాన్‌వెజ్ మాత్రమే

# కాదు ఈ పండ్లను కూడా తినవచ్చు



ప్రోటీన్లు ఉండే ఆహారాలు అంటే సహజంగానే చాలా మందికి పప్పు దినుసులతోపాటు చికెన్, మటన్ వంటి నాన్ వెజ్ ఆహారాలు గుర్తుకు వస్తాయి. ఈ క్రమంలోనే మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ ప్రోటీన్లు ఉండే ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. ప్రోటీన్లు మనకు అందే స్థూల పోషకాల జాబితాకు చెందుతాయి. అంటే వీటిని ఎక్కువ మొత్తంలో రోజూ తీసుకోవాల్సి ఉంటుందన్నమాట. అందులో భాగంగానే చాలా మంది పప్పు దినుసులతోపాటు నట్స్, నాన్ వెజ్ వంటలను తరచూ తింటుంటారు. వీటిని తింటే మన శరీరానికి కావల్సిన ప్రోటీన్లు లభిస్తాయి. అయితే మీకు తెలుసా.. కొన్ని రకాల పండ్లలో కూడా మనకు ప్రోటీన్లు లభిస్తాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకున్నా మనం ప్రోటీన్లను పొందవచ్చు. ప్రోటీన్లు మనకు రోజుకు ఒక కిలో బరువుకు 0.8 గ్రాముల మేర అవసరం అవుతాయి.

## ఎంత మేర ప్రోటీన్లు అవసరం..?

అంటే సుమారుగా 50 కిలోలు ఉన్న వ్యక్తి 40 గ్రాముల మేర ప్రోటీన్లను రోజూ తినాల్సి ఉంటుందన్నమాట. ఇక మనకు ప్రోటీన్లు అధిక లభించే పండ్లలో జామ పండ్లు కూడా ఒకటి. జామ పండ్లలో ప్రోటీన్లు సమృద్ధిగానే ఉంటాయి. ఒక మీడియం సైజ్ జామ పండును తినడం వల్ల మనకు సుమారుగా 4.2 గ్రాముల మేర ప్రోటీన్లు లభిస్తాయి. దీంతోపాటు జామ పండ్లలో విటమిన్ సి కూడా సమృద్ధిగానే ఉంటుంది. అలాగే ఫైబర్ కూడా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. కనుక జామ పండ్లను తింటుంటే ప్రోటీన్లు మనకు సమృద్ధిగా లభిస్తాయి. అలాగే పనస పండ్లలోనూ ప్రోటీన్లు అధికంగానే ఉంటాయి. ఒక కప్పు పనస పండ్లను తినడం వల్ల మనకు సుమారుగా 2.8 గ్రాముల మేర ప్రోటీన్లు లభిస్తాయి. ఈ పండ్లలో పొటాషియం, విటమిన్ బి6 కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి కండరాల పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడును యాక్టివ్‌గా, ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక పనస పండ్లను కూడా మనం తరచూ తినవచ్చు.

## కివీ పండ్లలో..

కివీ పండ్లను తినడం వల్ల కూడా మనం ప్రోటీన్లు పొందవచ్చు. ఒక కప్పు కివీ పండ్లను తినడం వల్ల మనకు సుమారుగా 2.1 గ్రాముల మేర ప్రోటీన్లు లభిస్తాయి. ఈ పండ్లలో ప్రోటీన్లతోపాటు విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఈ పండ్లను తినడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. కివీ పండ్లను తింటే మన శరీరంలో పలు ఎంజైమ్‌లు సైతం ఉత్పత్తి అవుతాయి. ఇవి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతోపాటు కడుపు ఉబ్బరం, గ్యాస్, మలబద్దకం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి.

## దానిమ్మ గింజలు..

ఒక కప్పు దానిమ్మ గింజలను తినడం వల్ల మనకు సుమారుగా 1.5 గ్రాముల మేర ప్రోటీన్లు లభిస్తాయి. దానిమ్మ పండ్లను కూడా ప్రోటీన్లకు మంచి వనరుగా చెప్పవచ్చు. ఈ పండ్లను తినడం వల్ల అనేక యాంటీ ఆక్సిడెంట్లు, పాలిఫినాల్స్ లభిస్తాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఒక కప్పు అరటిపండును తింటే మనకు సుమారుగా 1.3 గ్రాముల మేర ప్రోటీన్లు లభిస్తాయి. అరటి పండ్లు మనకు తినేందుకు అనువుగా ఉంటాయి. వీటి ద్వారా మనకు అనేక పోషకాలు సైతం లభిస్తాయి. అరటి పండ్లలో పొటాషియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. ఇవి కండరాలకు మరమ్మత్తులు చేస్తాయి. శరీరంలో శక్తి స్థాయిలను పెంచుతాయి. దీంతో మనం ఆరోగ్యంగా ఉంటాం.

## చెర్రీ పండ్లు..

ఒక కప్పు చెర్రీ పండ్లను తినడం వల్ల మనకు సుమారుగా 1 గ్రాము మేర ప్రోటీన్లు లభిస్తాయి. ఈ పండ్లను తింటే యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి వాపులను తగ్గిస్తాయి. రోజూ ఈ పండ్లను తినడం వల్ల మైండ్ కూడా రిలాక్స్ అవుతుంది. నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. ఇలా పలు రకాల పండ్లను తినడం వల్ల కూడా మనం ప్రోటీన్లను పొందవచ్చు. ప్రోటీన్లు పొందాలంటే కేవలం నాన్ వెజ్ ఆహారాలను మాత్రమే తినాల్సిన పనిలేదు.

# ఈ ప్రకృతి విడిది మనమూ బుక్ చేసుకోవచ్చు





పల్లెటూరి వాసన తెలియకుండా పెరిగిందామె! కానీ, ఇప్పుడు పల్లెదనాన్ని పరిచయం చేస్తూ ఆంత్రప్రెన్యూర్‌గా రాణిస్తున్నది. ప్రకృతి ఆరాధకుడైన తన భర్త కలలను సాకారం చేస్తూ.. ఆతిథ్య రంగంలోకి అడుగుపెట్టింది. పచ్చని పొలాలు, పండ్ల తోటల నడుమ మండువా లోగిలి నిర్మించి.. అతిథులకు ఆహ్వానం పలుకుతున్నది. పశుపక్ష్యాదుల పలకరింపులతో అలరారే ఈ సంప్రదాయ గృహాన్ని జాయ్‌ఫుల్ వీకెండ్ డెస్టినేషన్‌గా నిలిపింది. పంటపొలాలు లేనివాళ్లు, పల్లెలకు దూరంగా వచ్చినవాళ్లు.. వారాంతంలో ఇక్కడికి వచ్చి ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. ఏనాడూ పల్లె వాతావరణం తెలియని ఆమె.. పట్నవాసులకు గ్రామీణ వాతావరణాన్ని అందిస్తున్నది. వ్యవసాయ క్షేత్రాన్ని వ్యాపార కేంద్రంగా మలిచిన గ్రీన్ ఎకర్స్ వ్యవస్థాపకురాలు తల్లా అనిత స్టార్టప్ స్టోరీ ఆమె మాటల్లోనే. నేను పుట్టింది హైదరాబాద్‌లో. ఇక్కడే పెరిగాను. ఏనాడూ సిటీ దాటింది లేదు. పల్లెటూరు ఎలా ఉంటుందో కూడా తెలియదు. ఉద్యోగరీత్యా కొన్నాళ్లు అమెరికాలో ఉన్నాం. మా ఆయన తల్లా వెంకటేశ్వర్‌కు వ్యవసాయం అంటే చాలా ఇష్టం. ఆయనతో కలిసి వ్యవసాయక్షేత్రంలోకి అడుగుపెట్టాను. అదే గ్రీన్ ఎకర్స్ వీకెండ్ హోమ్‌కు బీజం వేసింది. 1999లో సన్నిహితులతో కలిసి కొనుగోలు చేసిన ఐదు ఎకరాల భూమిలో ఆర్గానిక్ వ్యవసాయం మొదలుపెట్టాం. అలా గ్రీన్ ఎకర్స్ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఆర్గానిక్ ఫార్మింగ్ చేసినా అంతగా గిట్టుబాటు కాలేదు. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న క్రమంలో గ్రీన్ ఎకర్స్ ఫార్మ్ స్టే ఆలోచన వచ్చింది. అలా పదేండ్ల కిందట మా వ్యవసాయ క్షేత్రంలో అర ఎకరం విస్తీర్ణంతో తాతలనాటి మండువా ఇల్లు కట్టించాం. చుట్టూ ఆరు ఎకరాల్లో తోటలు పెంచి వీకెండ్ డెస్టినేషన్ హోమ్‌గా దీనిని తీర్చిదిద్దాం. నిత్యం బిజీగా ఉంటూ, ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కలుసుకోవడానికి ఓ అందమైన వేదిక ఇది. మా ఆయన సహకారంతో మా వ్యవసాయక్షేత్రాన్ని ఎకో ఫ్రెండ్లీ విహార కేంద్రంగా మలిచాను.

**ఇల్లే అర ఎకరం**

కేరళ, కొచ్చి లాంటి ప్రాంతాలను సందర్శించినప్పుడు అక్కడ కనిపించే మండువ లోగిళ్లు నాకెంతో నచ్చాయి. వాటిని ఆదర్శంగా తీసుకొని దీనిని రూపకల్పన చేశాను. వీకెండ్‌లో సరదాగా పంటపొలాలు, పచ్చని చెట్ల నడుమ స్వచ్ఛమైన ప్రాణవాయువుతో పునరుత్తేజం కలిగించే ఫార్మ్ స్టే హోమ్ నిర్మాణం కోసం ఎంతగానో అధ్యయనం చేశాను. ఎన్నో పర్యాటక ప్రాంతాలను సందర్శించి అరుదైన కళాకృతులు సేకరించా. నిర్మాణ శైలిలోనూ ప్రత్యేకత కనిపించేలా జాగ్రత్తలు తీసుకున్నా. కనుచూపు మేరలో చిక్కటి పచ్చదనంతో దీనిని తీర్చిదిద్దాం. అర ఎకరంలో విస్తరించిన ఈ ఇంట్లో ఆరు పడకగదులు, విశాలమైన సిట్ అవుట్, ఓపెన్ జిమ్ ఏర్పాటుచేశాం. ఒకసారి గ్రీన్ ఎకర్స్‌లో అడుగుపెడితే.. ప్రపంచాన్ని మర్చిపోయి సరదాగా కాలం గడిపేయొచ్చు.

**01. పసందైన విందు**

యాంత్రిక జీవనంతో పోటీపడుతూ బంధాలకు దూరమైన ఎంతోమంది ఈ పచ్చని పొలాలు, పక్షుల రాగాల నడుమ సేదతీరుతున్నారు. కాంక్రీట్ జంగిల్‌లో బతుకుతున్న ఈ తరానికి మన మూలాలను పరిచయం చేయాలన్న మా సంకల్పం దీంతో నెరవేరింది. గ్రీన్ ఎకర్స్ చుట్టూ పది ఎకరాల విస్తీర్ణంలో పూర్తిగా సేంద్రియ విధానంలో పంటలు సాగు చేస్తున్నాం. ఇక్కడ పండించిన వాటినే అతిథులకు భోజనంగా అందిస్తున్నాం. గ్రీన్ ఎకర్స్‌కు ఒకసారి వచ్చిన వారంతా మళ్లీ మళ్లీ రావడానికి ఉత్సుకత చూపుతున్నారు. పంట పొలాల మధ్య హాయిగా కాలం గడుపుతున్నారు. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు నుంచి కూడా గ్రీన్‌ఎకర్స్‌లో గడిపేందుకు ఔత్సాహికులు వస్తున్నారు. విదేశాల్లో స్థిరపడి, స్వదేశానికి వచ్చినవాళ్లు%ొ% తమ బంధువులతో ఇక్కడ గెట్ టుగెదర్ జరుపుకొంటున్నారు.

## అచ్చెరువొందేలా..


ఈ స్టే హోమ్ నిర్మాణ శైలి ప్రత్యేకంగా ఉంటుంది. దీనికోసం దక్షిణ భారతంలో కొన్ని పర్యాటక ప్రాంతాలను సందర్శించి, అక్కడ నుంచి పురాతన ఫర్నీచర్ సేకరించాను. ఈ లోగిలిలో కిటికీలు, ప్రధాన ద్వారాలు, తలుపులు, స్తంభాలన్నీ కూడా వంద సంత్సరాల కిందట డిజైన్ చేసినవాటి శైలిలో ఉంటాయి. ఇంటి ఆవరణ, పరిసరాలు కూడా ప్రత్యేకంగా ఉంటాయి. పిల్లగాలికి ఊగుతూ చిన్నారులను జోలపుచ్చే ఊయలలు, నులక మంచాలు, పడుకునేందుకు పెద్ద పీటలు ఇలా ఇక్కడున్నవన్నీ అచ్చెరువొందిస్తాయి. యూఎస్‌లో స్థిరపడిన మా పిల్లలు కరోనా సమయంలో ఇక్కడికి వచ్చారు. మూడు నెలలు గ్రీన్ ఎకర్స్‌లో మేమంతా హాయిగా గడిపాం. అదే ఆనందాన్ని నాతోపాటు మరెన్నో కుటుంబాలకు అందిస్తున్నాను. ఇంతకీ మా గ్రీన్ ఎకర్స్ ఫార్మ్ స్టే హోమ్ ఎక్కడున్నది చెప్పలేదు కదూ! తెలంగాణలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట క్షేత్రానికి దగ్గర్లో, కూనురు గ్రామ సమీపంలో ఈ ప్రకృతి నిలయం ఉంది.

# హిమాచల్‌ను ముంచిన కాంగ్రెస్ గ్యారెంటీలు



భారతీయ జనతా పార్టీ పాలనలో ఆగమాగమైన హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీల కారణంగా మరింత సంక్షోభంలోకి కూరుకుపోయింది. దీంతో ఆ రాష్ట్రం పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. సుఖ్‌విందర్ సింగ్ సుఖూ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ గద్దెనెక్కి రెండేండ్లు కూడా పూర్తికాకముందే ఆ రాష్ట్రం దివాలా దిశగా సాగుతున్నది. ఎలాగైనా హిమాచల్‌ప్రదేశ్ పీఠమెక్కాలనుకున్న కాంగ్రెస్ పార్టీ 2022లో జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 10 గ్యారెంటీలను గుప్పించింది. ఆ గ్యారెంటీలకు ఆకర్షితులైన హిమాచల్ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఎన్నో ఆశలతో ఊరిస్తూ అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ వారి ఆశలను అడియాశలు చేసింది. అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమైన ఈ గ్యారెంటీల్లో ఇప్పుడు ఏ ఒక్కటీ అమలుచేయడం లేదు. వారంటీ లేని గ్యారెంటీలను నమ్మిన అక్కడి ప్రజలు నట్టేట మునిగారు. దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున ఉన్న హిమాచల్ భవన్‌ను అటాచ్ చేస్తూ హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు నవంబర్ 18న ఉత్తర్వులు జారీచేసింది. సెలీ జల విద్యుత్తు కేంద్రానికి సంబంధించిన రూ.150 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశా లు జారీచేసింది. ఆ మరుసటి రోజే టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నేతృత్వంలో నష్టాల్లో నడుస్తున్న 18 హోటళ్లను మూసివేయాలని ఆ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆ హోటళ్లను హైకోర్టు 'తెల్ల ఏనుగులు'గా అభివర్ణించడం గమనార్హం. అంతేకాదు, రిటైర్డ్ ఉద్యోగుల కు రావాల్సిన బకాయిలను సదరు కార్పొరేషన్ చెల్లించకపోవడం ప్రభుత్వ అసమర్థతేనని హైకో ర్టు దుయ్యబట్టింది. సుఖూ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ పాలనా వైఫల్యాలు పరాకాష్ఠకు చేరాయనడానికి ఈ ఘటనలే నిదర్శనం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీలు హిమాచ ల్‌కు గుదిబండగా మారాయి. కాంగ్రెస్ పాలకుల అసమర్థత కారణంగా ఆ రాష్ట్ర ఆర్థిక వనరులు పెరగడం గ్యారెంటీల పేర అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అప్పులు చేసుకుంటూ పోతున్నది. అయినా గ్యారెంటీలను నెరవేర్చలేదు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) పునరుద్ధరణ, ఐదు లక్షల ఉద్యోగాల కల్పన, మహిళలకు నెల నెలా రూ.1,500 ఆర్థిక సాయం, 300 యూని ట్ల వరకు ఉచిత విద్యుత్తు, యువత కోసం రూ.680 కోట్ల స్టార్టప్ ఫండ్, ప్రతి నియోజకవర్గంలో నాలుగు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు, మొబైల్ క్లినిక్‌ల ఏర్పాటు ద్వారా గ్రామాల్లో ఉచి త వైద్యం లాంటి గ్యారెంటీల వర్షం కురిపించిం ది. అయితే, వీటిలో ఏ హామీ అమలుకు నోచుకోలేదు. ఒకటీ, అరా అమలుచేసినా అవి కూడా కోతలు, కొర్రీలతోనే అసంపూర్తిగా మిగిపోయా యి. ఓపీఎస్ పునరుద్ధరణ హామీని ఎప్పుడో గాలికి వదిలేసింది. మహిళలకు ఇస్తామన్న రూ.1,500 భృతి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఈ హామీని అమలుచేస్తే రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.800 కోట్ల భారం పడుతుంది. దీనినుంచి తప్పించుకునేందుకు సుఖూ సర్కార్ విఫలయత్నం చేస్తున్నది. ఈ పథకానికి మొత్తం 7.88 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. 28,249 మంది మహిళలను మాత్ర మే అర్హులుగా గుర్తించింది. అక్టోబర్‌కు సంబంధించి రూ.91.62 లక్షలు మాత్రమే అందజేయడం గమనార్హం. 300 యూనిట్ల వరకు ఉచి త విద్యుత్తు ఇస్తామన్న కాంగ్రెస్ పాలకులు అం దుకు ప్రజలపై భారం చార్జీలను పెంచడమే కాకుండా, జల విద్యుత్తు కేంద్రాల ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంట్‌ను వాడుతున్న వినియోగదారులపై సెస్ వేయాలని యోచిస్తున్నది. తద్వారా ప్రజల నుంచి ఏటా రూ.2-3 వేల కోట్ల వరకు వసూలు చేయాలన్నది ప్రభు త్వ పన్నాగం. అంతేకాదు, 125 యూనిట్ల లోపు విద్యుత్తు వాడే కుటుంబాలకు ఇస్తున్న రాయితీని నిలిపివేసి ఏటా రూ.200 కోట్ల నిధులను మిగిల్చుకోవాలనేది ఇంకో కుటిలయత్నం. సంపద సృష్టించి ఆదాయాన్ని పెంచకుండా పథకాలు నిలిపివేసి తద్వారా మిగిలే నిధులను ఆదాయం గా చెప్పుకుంటుండటం విడ్డూరం. ఉద్యోగాల విషయంలోనూ అట్లాగే వ్యవహరించింది. ఆర్థిక వనరులను పెంచే విషయమై కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన లేకపోవడంతో పన్నుల పెంపు, కొత్త పన్నులు తీసుకురావడంపైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నది. సీఎం సుఖూ తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి పరిశ్రమలు, గృహ విద్యుత్తు వినియోగదారులకు సబ్సిడీలను నిలిపివేయడం లాంటి చర్యలకు ఉపక్రమించేందుకు యత్నిస్తున్నారు. పర్యావరణం, పాల సెస్ విధించాలని చూస్తుండటం హేయనీయం. అంతేకాదు, సుఖూ సర్కార్ దేశంలో ఎక్కడాలేని విధంగా టాయిలెట్ ట్యాక్స్‌ను తీసుకురావాలనీ ప్రయత్నిస్తున్నది. అయితే ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో సుఖూ తోక ముడవక తప్పలేదు. హిమాచల్‌ప్రదేశ్ జనాభా 77.56 లక్షలు కాగా.. ఒక్కో నెత్తిపై రూ.1.17 లక్షల అప్పు ఉన్న ది. 2018లో ఆ రాష్ట్ర అప్పులు రూ.47,906 కోట్లు ఉంటే, ప్రస్తుతం ఆ సంఖ్య రూ.86,589 కోట్లకు చేరుకున్నది. రెండేండ్లలోనే సుఖూ సర్కా ర్ రూ.22 వేల కోట్లకు పైగా అప్పు చేసింది. అవి చాలవన్నట్టు రూ.2,810 కోట్ల అప్పు పెన్షనర్స్ వెల్ఫేర్ నుంచి తీసుకున్నది. అయితే, ఈ సొమ్మంతా ఎటుపోతున్నదనేది ప్రశ్నార్థకం. భారీగా తెస్తున్న ఈ అప్పులకు లెక్కాపత్రమూ లేదు. హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం ఖర్చుచేసే ప్రతి రూ.100లో రూ.25 జీతభత్యాలకు, రూ.17 పెన్షన్లకు, రూ.11 వడ్డీలకు, రూ.9 తిరిగి చెల్లించే అప్పులకు, రూ.10 గ్రాంట్ల రూపంలో పోతున్నా యి. ఈ లెక్కన మూలధన వ్యయం, ఇతర ఖర్చులకు రూ.28 మాత్రమే రాష్ట్ర ఖజానాలో మిగులుతున్నాయి. ఈ లెక్కలన్నీ స్వయంగా సీఎం సుఖూ అసెంబ్లీ సాక్షిగా వెల్లడించారు. కేంద్రం ఇప్పటికే జీఎస్టీ పరిహారాన్ని నిలిపివేయడంతో ఖజానాకు రూ.2,500-3,000 కోట్ల మేర గండిపడింది. ఈ నేపథ్యంలో 2025-2026 ఆర్థిక సంవత్సరంలో హిమాచల్ ప్రభుత్వానికి అసలైన సవాలు ఎదురుకానున్నట్టు ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సుఖూ నిర్వాకం వల్ల హిమాచల్‌లో ఆర్థిక అత్యయిక స్థితి విధించే దుస్థితి దాపురించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై కనీస అవగాహన లేకుండా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారెంటీల కారణంగానే ఇప్పుడు హిమాచల్ రోడ్డున పడ్డది. ఒక్క హిమాచల్ మాత్రమే కాదు, కాంగ్రెస్ పాలి త రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణలు కూడా పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయాయి. సుఖూకు, రేవంత్‌కు పెద్దగా వ్యత్యాసం లేదని చెప్పడంలో ఏ మాత్ర సంశయం అక్కరలేదు. కాంగ్రెస్ పాలనలో అధ్వాన్నస్థితికి చేరిన హిమాచల్‌ప్రదేశ్‌ను చూస్తుంటే.. మన తెలంగాణ కూడా అధఃపాతాళంలోకి వెళ్తున్న దృశ్యం కండ్లముందు సాక్షాత్కరిస్తున్నది.

# వనితా.. నీవెక్కడ?



అగ్రరాజ్యమైన అమెరికాలో ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికలు ఎన్నో ప్రశ్నలకు, అనేక సందేహాలకు కేంద్ర బిందువుగా నిలిచాయి. చివరి నిమిషం వరకు సర్వశక్తులొడ్డి పోరాడిన నల్ల కలువ కమలా హ్యారిస్ ఓటమి వెనుక పైకి కనిపించని కారణాలెన్నో ఉన్నాయన్న విషయం ఈ ఎన్నికల ద్వారా మనకు అవగతమైంది. వ్యవస్థీకృతమైన లింగవివక్ష, పురుషాధిక్య రాజకీయ వ్యవస్థ, మహిళా నాయకత్వం పట్ల చిన్నచూపు లాంటి అంశాలు కమలా హ్యారిస్ ఓటమికి ప్రత్యక్షంగా దోహదపడ్డాయి. రాజకీయ అర్హత, పరిపాలనా అనుభవం, విద్యార్హతల వంటి అనేక అంశాలను దాటుకొని అధ్యక్ష రేసులో నిలిచిన కమలా హ్యారిస్‌పై లింగవివక్ష పైచేయి సాధించింది. కమలా హ్యారిస్ ఓటమి ఆమె వ్యక్తిగతం కాదు. అది ప్రపంచంలోని యావత్ మహిళా లోకానిది. ప్రజాస్వామ్యానికి స్ఫూర్తి, అభ్యుద య భావాలకు నిలయమని చెప్పుకునే అమెరికాలో ఒక మహిళ అధ్యక్ష పీఠాన్ని అధిరోహించేందుకు, వైట్‌హౌజ్‌లో అడుగు పెట్టేందుకు ఆపసోపాలు పడుతుండటం దేనికి సంకేతం? అమెరికా రాజకీయాల్లో మహిళలు ఏం సాధించలేదని కాదు, ప్రజాప్రతినిధులుగా మహిళామణులు ఎంతో మంది తమ పదవులకు వన్నె తీసుకువచ్చారు. కానీ, అధ్యక్షురాలి పీఠం మాత్రం వారికి అందని ద్రాక్షగానే మిగులుతున్నది. ఇప్పటివరకు ఒక్క మహిళ అధ్యక్షురాలిగా ఎన్నిక కాకపోవడం యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఒక మహిళను తమ దేశ అధ్యక్షురాలిగా అమెరికా ప్రజలు ఎందుకు ఇష్టపడటం లేదు. ఇది మహిళా నాయకత్వం పట్ల వారికున్న అశక్తతకు నిదర్శనంగానే చెప్పవచ్చు. మహిళా అధ్యక్షురాలిని ఎన్నుకునే అవకాశాన్ని అమెరికా రెండుసార్లు కోల్పోయింది. 2016లో హిల్లరీ క్లింటన్, 2024లో కమలాహ్యారిస్ చివరి వరకు పోరాడి ఓటమి పాలయ్యారు. వారి ఓటమికి ప్రధాన కారణం లింగ వివక్షే. ప్రపంచ పెదన్నగా పిలిచే అమెరికాలో లింగ వివక్ష నేటిది కాదు. అన్ని దేశాల్లో వలె 1920 వరకు అమెరికాలో కూడా మహిళలకు ఓటు హక్కు లేదు. సుసాన్ బీ ఆంథోని నాయకత్వంలో జరిగిన ఉద్యమ ఫలితంగా అమెరికా మహిళలకు ఓటు హక్కు లభించింది. ఆ తర్వాత అనేక మంది నారీమణులు ప్రజాప్రతినిధులయ్యారు. మొదటి మహిళా స్పీకర్‌గా నాన్సీ ఫెలోసీ రికార్డు సృష్టించారు. ఈ క్రమంలోనే హిల్లరీ క్లింటన్, కమలా హ్యారిస్ అధ్యక్ష పీఠం కోసం పోటీ పడే స్థాయికి ఎదిగారు. అయితే, పురుషాధిక్యత, లింగవివక్ష కారణంగా వారు విజయతీరాలకు చేరలేకపోయారు. అయితే, అమెరికాతో పోలిస్తే ఆసియా ఖండంలో, ప్రత్యేకించి దక్షిణాసియాలో పరిస్థితులు కాస్త మెరుగ్గా ఉంటాయనే చెప్పుకోవాలి. ఈ ప్రాంతానికి చెందిన చాలామంది మహిళలు తమ దేశాధినేతలుగా సేవలందించారు. భారత్‌లో ఇందిరాగాంధీ, శ్రీలంకలో సిరిమావో బండారనాయకే, పాకిస్థాన్‌లో బెనజీర్ భుట్టో, బంగ్లాదేశ్‌లో ఖలేదా జియా, షేక్ హసీనా, మయన్మార్‌లో ఆంగ్‌సాన్ సూకీ ఆయా దేశాధినేతలుగా రాణించారు. ఇక మన దేశం విషయానికి వస్తే.. దేశ రాజకీయాల్లో ఎంతోమంది మహిళలు తమదైన ప్రత్యేక ముద్ర వేశారు. 1925లో జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సరోజినీ నాయుడు ఎన్నిక కావడంతో మొదలైన ఈ ప్రస్థానం ఇప్పటికీ నిరాటంకంగా కొనసాగుతున్నది. అయితే, ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది మాత్రం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గురించి. ఆమె మన దేశ ఏకైక మహిళా ప్రధాని. ఆమె మరణం తర్వాత ఇప్పటివరకు మరో మహిళ ప్రధాని పీఠాన్ని అధిరోహించలేదు. నందినీ సత్పతి, జయలలిత, మాయావతి, మమతా బెనర్జీ, సుష్మా స్వరాజ్, షీలా దీక్షిత్, తాజాగా మర్లేనా ఆతిశీ ముఖ్యమంత్రులుగా రాణించినప్పటికీ ప్రధాని స్థాయికి మాత్రం చేరుకోలేకపోయారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక మంది మహిళలు పాల్గొన్నప్పటికీ అవకాశాలు మాత్రం కొందరికే దక్కాయి. పితృస్వామ్య రాజకీయ వ్యవస్థ ఉండటమే అందుకు ప్రధాన కారణం. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా పురుషాధిక్యతే కొనసాగుతున్నది. మహిళల సామర్థ్యాన్ని కూడా పురుషులే నిర్ణయిస్తుండటంతో అతివలు ఇప్పటికీ వివక్షకు గురవుతునే ఉన్నారు. అయితే, మన దేశంలో జాతీయోద్యమం మొదలు తెలంగాణ సాయు ధ పోరాటం, తొలి దశ, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో పురుషులతో దీటుగా మహిళలు కదం తొక్కారు. కానీ, రాజకీయ అవకాశాలు మాత్రం పురుషులకే ఎక్కువగా లభించాయి. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల వల్ల పరిస్థితి కొంతవరకు మెరుగైనప్పటికీ ఇంకా మహిళలు స్వతంత్రంగా బాధ్యతలు నిర్వర్తించే పరిస్థితులు లేవు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలుగా మహిళలు ఎన్నికవుతున్నా.. వారిని నామమాత్రంగా చూపిస్తూ భర్తలే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత పార్లమెంట్ మహిళా బిల్లును ఆమోదించడం శుభ పరిణామం. ఈ బిల్లు అమల్లోకి వస్తే చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు దక్కుతాయి. మహిళలకు హక్కుగా దక్కాల్సిన సీట్లను వారికే రాజకీయ పార్టీలు కచ్చితంగా కేటాయించాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే 2025లో జనగణన చేయనున్న కేంద్ర ప్రభుత్వం 2026లో డీలిమిటేషన్ ప్రక్రియను షురూ చేయనున్నదనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మహిళామణులు సంసిద్ధంగా ఉండాలి. ప్రతి అవకాశాన్ని ఒక మెట్టుగా మలుచుకొని అతివలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. రాబోయే శాసనసభ ఎన్నికల నాటికి మహిళలు మానసికంగా దృఢంగా తయారవ్వాలి. రాజకీయంగా బలోపేతమవ్వాలి. ప్రతి పురుషుని విజయం వెనుక మహిళే ఉంటుందని అనాదిగా పెద్దలు చెప్తూనే ఉన్నారు. అలాంటి మహిళను ముందువరుసలో నిలబెట్టేందుకు పురుషాధికత్య, లింగవివక్షలు ఎందుకు అడ్డ వస్తున్నాయో అర్థం కాని స్థితి యావత్ ప్రపంచంలో నెలకొన్నది. ఇకనైనా ఆ స్థితి కనుమరుగు కావాలి. అందుకు అగ్రరాజ్యమైన అమెరికానే కాదు, ప్రపంచంలోని అన్ని దేశాలు మహిళలకు పెద్దపీట వేయాలి. ఇక మన విషయానికి వస్తే.. స్థానిక సంస్థలు, చట్టసభలు, విధానపరమైన నిర్ణయాల్లో మహిళలు భాగస్వాములయ్యే దాకా మహిళా సాధికారిత సంపూర్ణం కాదనే విషయాన్ని మహిళలు గుర్తుంచుకోవాలి. మాట్లాడితే చాలు మహిళల కోసం ఇది చేశాం, అది చేశాం అని గొప్పలకు పోయే ప్రభుత్వాలు ఇకనైనా ఆ దిశగా చర్యలు తీసుకుంటాయని ఆశిద్దాం.

# శీతాకాలం ఉత్సాహంగా తిందాం!



నిరుత్సాహపరిచే శీతగాలుల్లో ఉత్సాహంగా ఉండేందుకు కొన్ని ఎంపిక చేసిన ఆహారాలను తప్పక తీసుకోవాలి. చలికాలంలో ఉండే బద్ధకాన్ని వదిలించుకునేందుకు, చల్లటి వాతావరణంలో కలిగే జలుబు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉండేందుకు మీ డైట్‌లో ఈ మెనూ ఉండేలా చూసుకోండి.

**చేప కొవ్వు**

కొవ్వు అధికంగా ఉండే చేపలను వారానికి ఒకసారి తప్పకుండా తినండి. వీటిలో ఒమెగా3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి మానసిక ఒత్తిడి, ఆందోళన వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గిస్తాయి. ఒమెగా3 ఫ్యాటీ ఆమ్లాలు మెదడు చురుకుదనాన్ని ప్రభావితం చేసే న్యూరోట్రాన్స్‌మీటర్స్ పనితీరుని మెరుగుపరుస్తాయి. కాబట్టి బద్ధకంగా, నిరుత్సాహంగా ఉండేవాళ్లు కనీసం వారానికి మూడు సార్లు చేపల కూర తింటే మంచిది.

**ఆకు కూరలు**

ఆకుకూరల్లో ఉండే విటమిన్ బీ-9 (ఫోలేట్) మెదడులో సంతోషాన్ని కలిగించే సెరటోనిన్‌ని ప్రభావితం చేస్తుంది. పాలకూర, కాలే (లీఫ్ క్యాబేజ్)లతోపాటు మిగతా ఆకుకూరలు కూడా తినొచ్చు. ఆకుకూరల్లో యాంటి ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. కాబట్టి అన్ని రకాల ఆకు కూరలూ తీసుకునే ప్రయత్నం చేయాలి. అస్తమా, జలుబు, దగ్గు, గొంతునొప్పి తరచుగా బాధిస్తుంటే ప్రతి రోజూ ఏదో ఒక పూట ఆకుకూర ఉండేలా చూసుకోవాలి.

**మేలుచేసే బ్యాక్టీరియా**

జీర్ణ వ్యవస్థ మెరుగ్గా పని చేయడం వల్ల సాధారణ అలర్జీలు దరిచేరవు. అంతేకాదు శీతాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు వ్యాధినిరోధ శక్తిని పెంపొందించుకోవాలి. ఇందుకోసం జీర్ణవ్యవస్థలో మేలుచేసే బ్యాక్టీరియా ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. మజ్జిగ, పెరుగు, యోగర్ట్ తీసుకుంటే మంచిది.

**పుల్లని పండ్లే మేలు**

పండ్లు తింటే ఆరోగ్య మెరుగవుతుందనే అవగాహన అందరికీ ఉంది. అలాగే శీతాకాలంలో పుల్లని పండ్లు తింటే అలర్జీ (జలుబు, తుమ్ములు) వస్తుందనే అపోహ కూడా ఉంది. ఆ అలర్జీలను తగ్గించే, వ్యాధినిరోధకతను పెంచడంలో పుల్లని పండ్లకు మరేవీ సాటిరావు. పుల్లని ఫలరసాల్లో విటమిన్-సి అధికంగా ఉంటుంది. బత్తాయి, నారింజ ఫల రసాలను తరచుగా తాగుతూ ఉంటే శీతాకాలంలో బలుబు సమస్య రాదు.

**దుంపలు మరువొద్దు**

ఎక్కడికి పోయినా మన మూలాలు మరచిపోవద్దని చెబుతారు. ఆరోగ్య విషయంలోనూ అంతే. దుంప(వేర్లు)ల్లో కార్బోహైడ్రేట్‌లు పుష్కలంగా ఉంటాయి. పిండి పదార్థాలతోపాటు ఫైబర్ కూడా వీటిలో ఉంటుంది. క్యారెట్, బీట్‌రూట్, ఆలుగడ్డలు, చామగడ్డలు వంటి దుంపకూరల్ని తప్పక తినాలి.

**హెర్బల్ టీ**

శీతాకాలంలో వేడివేడి టీలు ఎక్కువగా తాగుతారు. పాలతో చేసిన టీ, కాఫీల కంటే హెర్బల్ టీలు తాగితే ఎక్కువ మేలు జరుగుతుంది. లెమన్ టీ, చామంతితో చేసిన టీ తాగితే ఆందోళన వల్ల కలిగే దుష్ప్రభావాలు తగ్గుతాయి. హెర్బల్ టీ తాగితే నాడీ వ్యవస్థ మెరుగవుతుంది. గురక సమస్య కూడా తగ్గుతుంది.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 22 - 02 - 2025

## 30 ఏళ్లు దాటిన పురుషులు తప్పకుండా వీటిని రోజూ తీసుకోవాలి



పురుషుల్లో 30 ఏళ్లు దాటిన తరువాత నుంచి శరీరంలో అనేక మార్పులు సంభవిస్తుంటాయి. ముఖ్యంగా కండరాల పనితీరు మందగిస్తుంది. కండరాలు కుచించుకుపోతుంటాయి. ప్రతి 10 ఏళ్లకు ఒకసారి 3 నుంచి 5 శాతం మేర కండరాల మోతాదు తగ్గుతుంది. దీంతో శక్తి నశించిపోతుంది. అయితే పురుషుల్లో కండర పుష్టికి టెస్టోస్టిరాన్ అనే హార్మోన్ దోహదపడుతుంది. కానీ 40 ఏళ్లు దాటిన అనంతరం ఇది కూడా తగ్గుతుంటుంది. కనుక 40 ఏళ్లు దాటిన తరువాత నుంచి పురుషుల్లో గణనీయమైన మార్పులు వస్తుంటాయి. ముఖ్యంగా బరువు ఎత్తడం వంటి పనులు చేయలేకపోతుంటారు. కానీ ముందు నుంచే వ్యాయామం చేస్తే కండరాల క్షీణతను కాస్త నెమ్మదింపజేయవచ్చు.

### కండరాల క్షీణత ఎక్కువగానే..

రోజూ వ్యాయామం చేసే వారిలో కండరాల క్షీణత తక్కువగా ఉంటుంది. కనుక రోజూ కనీసం 30 నిమిషాల పాటు అయినా సరే వ్యాయామం చేయాల్సి ఉంటుంది. వ్యాయామం చేయడం వల్ల కండరాల క్షీణతను తగ్గించవచ్చు. అలాగే ప్రోటీన్లు ఉండే ఆహారాలను కూడా తీసుకుంటుండాలి. దీంతో కూడా మంచి ఫలితం ఉంటుంది. ఇక జిమ్‌లలో వ్యాయామాలు చేసేవారు ప్రోటీన్ పొడులను తీసుకుంటూ ఉంటారు. ఇది ఈ మధ్య కాలంలో ఎక్కువైందని చెప్పవచ్చు. కానీ ఈ పొడులను డాక్టర్ సలహా మేరకు తీసుకోవాల్సి ఉంటుంది.

### ఎంత మోతాదులో..?

ఇక శారీరక శ్రమ, వ్యాయామం చేయకపోతే అలాంటి వారు రోజుకు తమ శరీర బరువులో ఒక కిలోకు 0.8 గ్రాముల ప్రోటీన్‌ను తీసుకుంటే చాలు. అయితే కండరాల నిర్మాణం కోరుకునే వారు మాత్రం 1.2 గ్రాముల వరకు ప్రోటీన్‌లను తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు 80 కిలోల బరువు ఉన్న వ్యక్తి రోజూ వ్యాయామం చేస్తుంటే రోజుకు సుమారుగా 95 గ్రాముల మేర ప్రోటీన్‌లను తీసుకోవాల్సి ఉంటుంది. రోజుకు అవసరమైన దాంట్లో 20 నుంచి 40 శాతం ప్రోటీన్లను వ్యాయామం చేసిన గంటలోపు తీసుకోవాలి. దీంతో కండరాలు త్వరగా మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో కండరాల నిర్మాణం జరుగుతుంది.

### ప్రోటీన్లు ఉండే ఆహారాలు..

అయితే ఎంత ప్రోటీన్‌ను తీసుకుంటున్నాం అనేది తినే పదార్థాన్ని బట్టి ఉంటుంది. సాధారణంగా 85 గ్రాముల చికెన్ తీసుకుంటే అందులో 24 గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. 225 గ్రాముల పెరుగు తింటే 23 గ్రాములు, ఉడికించిన పప్పులను ఒక కప్పు తింటే 18 గ్రాములు, 85 గ్రాముల చేపలతో 17 గ్రాములు, ఒక గుడ్డుతో 6.5 గ్రాములు, ఒక కప్పు పల్లీలతో 7 గ్రాముల ప్రోటీన్ లభిస్తాయి. కనుక ఈ మోతాదు ప్రకారం ప్రోటీన్లను లెక్కవేసుకోవాల్సి ఉంటుంది. ప్రోటీన్లు మనకు కోడిగుడ్లు, చీజ్, పనీర్, పిస్తా, పప్పు దినుసులు వంటి వాటి ద్వారా లభిస్తాయి. అన్ని రకాల ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల ప్రోటీన్లు సరిగ్గా అందేలా చూసుకోవచ్చు. ప్రోటీన్ల వల్ల కండరాలు నిర్మాణం అవుతాయి. శక్తి లభిస్తుంది. వయస్సు మీద పడిన తరువాత కండరాల క్షీణత వేగంగా ఉంటుంది కనుక ప్రోటీన్లను తింటే కండరాల క్షీణతను నెమ్మదింపజేయవచ్చు. ఈ విధంగా ప్రోటీన్లు మనకు మేలు చేస్తాయి.

## అప్పులలో రికార్డు



సూదిమొనంత పనిచెయ్యనోళ్లు ఏనుగంత అప్పు తెచ్చి రాష్ట్ర ప్రజల నెత్తిమీద రుద్దారు. అప్పు చేయడమే తప్పన్నట్టుగా ఇల్లెక్కి కూసినోళ్లు అప్పుల కుప్పలుగా తయారయ్యారు. పాత సర్కారు చేసిన అప్పుల మీద రోతమాటలు మాట్లాడినోళ్లు చేసిన అప్పుల లెక్క చూస్తే గుండె గుబేలనిపించక మానదు. అప్పు చేయడమే తప్పన్నోళ్లు అధికారంలోకి వచ్చి పది నెలలైనా పూర్తికాకముందే చేసిన అప్పు అక్షరాలా రూ.75,118 కోట్లు. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని సర్కార్లు కలిసి చేసిన మొత్తం అప్పు రూ.72,658 కోట్లే. అది 60 ఏండ్ల అప్పు. ఆ సంగతి కాంగ్రెస్ శ్వేతపత్రంలోనే రాసుకున్నది. మరి ఏడాదికి రెండు నెలలు తక్కువ ఉండగానే అంతకుమించి అప్పు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఎక్కడెక్కడో, ఏవేవో జామీనులిచ్చి తెచ్చిన అంతలావు సొమ్ము ఏం చేశారు? ఎక్కడ పోశారు? ఒక్క ఇటుక పెట్టలేదు. మీటరు గోడ లేపలేదు. ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వలేదు. డీఏ కూడా ఇవ్వలేదు. ఒక్క కొత్త ఉద్యోగం ఇవ్వలేదు. మరి ఏమయ్యాయి అప్పు తెచ్చిన వేల కోట్లు? రైతుబంధు వేశారా? అంటే వేయలేదు. అన్నమాట ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేశారా? అంటే చేయలేదు. మహిళలకు, వృద్ధులకు పింఛన్లు పెంచలేదు. ఆడబిడ్డలకు తులం బంగారం పంచలేదు. కనీసం పుట్టిన పాపకు కేసీఆర్ కిట్ ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి అతీగతీ లేదు. దళితబంధు జాడే లేదు. ప్రాజెక్టు కట్టడం మాట దేవుడెరుగు, కనీసం కిలోమీటరు రోడ్డు కూడా వేయలేదు. బాండ్లు రాసిచ్చి మరీ తెస్తున్న అప్పునంతా ఎక్కడ ఖర్చు చేశారో చెప్పే నాథుడే కరువయ్యాడు. రూ.80 వేల కోట్ల కాళేశ్వరంలో లక్ష కోట్లు చేతులు మారాయని వితండవాదం చేసినవాళ్లు దాదాపుగా అంతే మొత్తాన్ని తెచ్చి ఏ గొయ్యిలో పోశారో చెప్పలేకపోతున్నారు. కేసీఆర్ అప్పు తేలేదని ఎవరన్నారు? అప్పుచేసి తెచ్చిన సొమ్మును ఏం చేశారనేది అసలు సంగతి. ఆ సొమ్మును కేసీఆర్ సంపదను పెంచేందుకు వినియోగించడం వల్లే రాష్ట్రం అభివృద్ధిలో అంగలు వేసిందనేది ప్రత్యక్షర సత్యం. మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లా నీళ్లు అందించారు. మిషన్ కాకతీయతో వేల చెరువుల పూడిక తీశారు. కాంగ్రెస్ సర్కారు కనీసం తట్టెడు మట్టి ఎత్తలేదు. చెంబెడు నీళ్లు ఇవ్వలేదు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాదైనా కొత్త పని ఒక్కటీ మొదలుపెట్టలేదు. అభివృద్ధి ఆగమైంది. సంక్షేమం సదుగులు ఇరిగినై. అప్పులు మాత్రం తుప్పల్లా పెరిగినై. ఏమయ్యాయి అప్పు చేసి తెచ్చిన నిధులు? అని ప్రజలు అడుగుతున్నారు. ఎవరి జేబుల్లోకి వెళ్లాయని నిలదీస్తున్నరు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరంతో కోటి రతనాల వీణ కోటి ఎకరాల మాగాణంగా రూపు సవరించుకుంది. రాష్ట్రం పచ్చగా కళకళలాడింది. ప్రజల బతుకులు మారాయి. మరి మూటల కొద్దీ పైసలు తెచ్చి కాంగ్రెస్ ఏం కట్టిందీ? అంటే సమాధానం సున్నా. తెచ్చిన అప్పులపై ప్రజలకు పైసా పైసా లెక్క చెప్పాల్సి ఉంటుందని కాంగ్రెస్ సర్కారు పెద్దలు గుర్తుంచుకుంటే మంచిది. సంపద పెంచి అందరికి పంచిన చరిత్ర కేసీఆర్‌ది. అధికారమే సోపానంగా, అడ్డగోలు హామీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్‌కు కూలగొట్టుడు తప్ప కట్టుడు తెలువదని ప్రజలకు మరోసారి తెలిసివచ్చింది.

## ఈస్టర్న్ లడాఖ్‌లో ఇండో-చైనా బలగాల కోఆర్డినేటెడ్ పెట్రోలింగ్




ఈస్టర్న్ లడాక్‌లోని డెమ్‌చోక్‌లో రెండు దేశాల బలగాలు.. సహకార పద్ధతిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. భారతీయ ఆర్మీ వర్గాలు ఈ విషయాన్ని శుక్రవారం పేర్కొన్నాయి. త్వరలో దేప్‌సాంగ్ వద్ద కూడా కోఆర్డినేటెడ్ పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. ఈస్టర్న్ లడాక్‌లోని రెండు ప్రాంతాల నుంచి బలగాల ఉపసంహరణ బుధవారం ప్రారంభమైంది. 2020 మే నెల నుంచి రెండు దేశాల మధ్య ఉద్రిక్తంగా ఉన్న అన్ని ప్రదేశాల నుంచి ప్రస్తుతం బలగాల ఉపసంహరణ జరిగినట్లు పేర్కొన్నారు.

# ఫిరాయింపులేనా ప్రజలను పట్టించుకోరా



'ఇంకేముంది బీఆర్ఎస్ పనైపోయింది. అందరూ మా వైపు వచ్చేస్తున్నారు. ఖేల్ ఖతం దుక్‌నం బంద్' అంటూ అధికారంలోకి వచ్చిన కొత్తలో కాంగ్రెస్ నేతలు ఊదరగొట్టారు. వారన్నట్టే ఓ పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జారుకున్నారు. ఆ వలస అంతటితో ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం చూశాక తెలిసి తెలిసి ఆ పార్టీలో చేరడానికి ఎవరూ సాహసించడం లేదు. ఆశల రెక్కలొచ్చి ఎగిరిపోయిన ఎమ్మెల్యేలు సైతం స్థానిక కాంగ్రెస్ కుంపట్ల వేడి ఉక్కపోత భరించలేక సతమతమవుతున్నారు. కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్న ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు తామింకా బీఆర్ఎస్సే అని బుకాయిస్తున్నారే కానీ, ధైర్యంగా 'మేం కాంగ్రెస్' అని చెప్పలేకపోతున్నారు. కొందరు తిరిగి సొంతింటికి రావడానికి ముహూర్తాలు చూసుకుంటున్నారు. విద్యార్థులు, యువత తమ సమస్య ల పరిష్కారం కోసం, ఎన్నికల హామీల అమలు కోసం ఉద్యమిస్తున్నారు. తులం బంగారం ఏద ని తల్లులు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఏకంగా పోలీసులే వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. మత వైషమ్యాల ప్రమాదం మళ్లీ పొంచి చూస్తున్నది. ఫిరాయింపు ఎమ్మెల్యేలు పదవిలో కొనసాగుతారా? లేక అనర్హత వేటుకు గురవుతారా? అన్న డోలాయమాన పరిస్థితి సద్దుమణిగిన తర్వాత కొత్త పీసీసీ అధ్యక్షుడు మళ్లీ పాత రాగాన్ని అందుకున్నారు. మరికొంతమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమకు టచ్‌లో ఉన్నారని, వారిలో కేటీఆర్ సన్నిహితులు కూడా ఉన్నారని అరిగిపోయిన పాత రికార్డునే ఆయన మళ్లీ వినిపించారు. నిత్యం బీఆర్ఎస్‌ను బలహీనపరచాలనే యావ తప్ప, ఆవగింజంతైనా ప్రజలు కోరుకున్న పరిపాలన అందించాలనే ఆలోచన కాంగ్రెస్‌కు లేకపోవడం విడ్డూరం. చీలికలు, ఫిరాయింపులు అంటూ పదే పదే గొంతు చించుకుంటున్న కాంగ్రెస్ వ్యవహారశైలి చూస్తుంటే గురివింద సామెత గుర్తుకొస్తున్నది. వాస్తవానికి, కాంగ్రెస్ పార్టీలో వచ్చినన్ని చీలికలు, జరిగినన్ని ఫిరాయింపులు ఇతర ఏ పార్టీల్లో చోటుచేసుకోలేదు. ఆ దిశగా కాంగ్రెస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకుంటే మంచిది. కేంద్రంలో, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్వాకం సజావుగా ఉంటే దేశంలో ఇన్ని పార్టీలు పుట్టి ఉండేవి కాదు. ఒకప్పుడు మన దేశాన్ని ఆసేతుహిమాచల పర్యంతం ఎదురులేకుండా ఏలిన కాంగ్రెస్ చివరికి ఉనికి కోసం చిన్నాచితక పార్టీల గుమ్మాల ముందు సాగిలపడే దుస్థితి ఉండేది కాదు. ప్రధానులు చరణ్‌సింగ్, వీపీ సింగ్, చంద్రశేఖర్, దేవెగౌడ, ఐకే గుజ్రాల్ నాడు కామరాజ్, బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ మొదలుకొని నేటి శరద్ పవార్, చంద్రబాబు, మమతాబెనర్జీ వరకు దేశవ్యాప్తంగా ఎందరో అతిరథ మహారథులు గత ఆరు దశాబ్దాలలో కాంగ్రెస్ పార్టీకి దూరమైపోయినవారే. నెహ్రూ హయాంలో కాంగ్రెస్ సంక్షోభాలు ఎదుర్కోలేదు. కానీ, ఇందిరమ్మ రంగప్రవేశం తర్వాతే కాంగ్రెస్ పార్టీ చీలికలు పీలికలైంది. దేశ చరిత్రలో తొలిసారిగా 1969లో అధికార కాంగ్రెస్ పార్టీ రాష్ట్రపతి అభ్యర్థి నీలం సంజీవరెడ్డి గెలువగలిగిన సంఖ్యాబలం కేంద్రంలో, రాష్ట్రాలలో పుష్కలంగా ఉండి కూడా ఓడిపోవడానికి సొంత పార్టీకి చెందిన ప్రధాని ఇందిరమ్మ అంతరాత్మ ప్రబోధం పేర జరిగిన క్రాస్ ఓటింగ్ కారణమైంది. ఇందిరమ్మపై బహిష్కరణ వేటు పడింది. పర్యవసానంగా ఢిల్లీ నుంచి గల్లీ దాకా పార్టీ నిలువునా చీలిపోయింది. అంతవరకు కాంగ్రెస్ పార్టీకున్న కాడెద్దుల ఎన్నికల గుర్తు కామరాజ్ నిజలింగప్ప వర్గానికి, కొత్తగా ఆవు దూడ గుర్తును ఇందిరమ్మ వర్గానికి ఎన్నికల కమిషన్ కేటాయించింది. కాంగ్రెస్ నిట్టనిలువునా రెండు ముక్కలైంది. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ మూడు దశాబ్దాల జైత్రయాత్రకు బ్రేక్‌పడింది. ప్రధాని ఇందిర, ఆమె తనయుడు సంజయ్‌గాంధీ సహా కాంగ్రెస్ ఘనాపాటీలెందరో ఓడిపోయారు. ఎన్నికల్లో ఒక ప్రధాని ఓడిపోవడం, ఆ ప్రధాని సొంత రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో 85కు 85 సీట్లలో పార్టీ ఓడిపోవడం అదే తొలిసారి. తన వెంట నడిచిన నాయకులతో ఇందిరమ్మ 1978లో కొత్తగా మరో పార్టీ కాంగ్రెస్ (ఐ)ని స్థాపించి, చెయ్యి గుర్తుతో రంగంలోకి దిగారు. దీంతో కాంగ్రెస్ మరోసారి నిలువునా చీలిపోయింది. కాడెద్దుల కాంగ్రెస్, ఆవు దూడ కాంగ్రెస్, హస్తం కాంగ్రెస్ పరస్పరం ఎన్నికల్లో సుదీర్ఘకాలం తలపడ్డాయి. చీలికలు, ఫిరాయింపుల వల్ల కాంగ్రెస్ ఎన్నికల గుర్తులు రెండు కూడా (కాడెద్దులు, ఆవు దూడ) కనిపించకుండాపోయాయి. డజన్ల కొద్దీ పిల్ల కాంగ్రెస్‌లు పుట్టుకొచ్చాయి. అధికారం పెనుగులాటలో పేకముక్కలు మార్చినట్టు ముగ్గురు నలుగురు ముఖ్యమంత్రులు మార్చిన కాంగ్రెస్ వైపరీత్యాలకు మిగతా రాష్ట్రాల మాదిరిగానే సమైక్య ఆంధ్రప్రదేశ్ కూడా సాక్ష్యంగా నిలిచింది. అంతెందుకు ఎన్నికలై ఏడాదిన్నర అయ్యిందో, లేదో పక్కనే ఉన్న కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఉద్వాసన పలికే అంకానికి తెరలేచింది. తెలంగాణలో కూడా మంత్రులు, స్వపక్షీయులే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గోతులు తవ్వుతున్నట్టు సాక్షాత్తూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించిన విషయం గమనార్హం. ఐదున్నర దశాబ్దాలుగా బహిష్కరణలు, చీలికలు, వర్గాలు, కలహాలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్‌తో పోల్చుకుంటే బీఆర్ఎస్ (టీఆర్ఎస్) పార్టీ ఆవిర్భావం నుంచి శతధా, సహస్రధా పటిష్ఠంగానే ఉంది. ఐక్యంగానే ఉంది. ఏనాడూ పార్టీలో చీలిక రాలేదు. ఎన్నికల గుర్తులేమీ మారలేదు. అదే కారు గుర్తు. అదే కేసీఆర్ నాయకత్వం. ఆయన మాటే శిలాశాసనం. ఏ పొత్తులు లేకుండానే రెండుసార్లు బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. పదేండ్ల పాటు కేసీఆరే ముఖ్యమంత్రిగా పనిచేశారు. సమైక్య రాష్ట్రంలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంటి హేమాహేమీలు శతవిధాలా ప్రయత్నించినా టీఆర్ఎస్ ప్రస్థానాన్ని అడ్డుకోలేకపోయారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 26 మంది టీఆర్ఎస్ సభ్యుల్లో పది మందిని నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి లాక్కున్నా, 2008 ఉప ఎన్నికల్లో, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగిలినా తర్వాత జరిగిన అన్ని ఉప ఎన్నికల్లో సత్తాచాటింది. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని యథావిధిగా ముందుకు నడిపించి రాష్ట్రాన్ని సాధించింది. 2014, 2018లో ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి వచ్చింది. ఈ కాలక్రమంలో వేళ్ల మీద లెక్కపెట్టగలిగేవాళ్లు వెళ్లిపోయినంత మాత్రాన బీఆర్ఎస్ బలం చెక్కుచెదరలేదు. నేడైనా అంతే. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని నెత్తిన పెట్టుకొని ఫిరాయింపులను వ్యతిరేకిస్తుంటే.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఫిరాయింపులను ప్రోత్సహించడం గమనార్హం. ఫిరాయింపులకు చోటే లేదని గత ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి ఏకంగా ఫిరాయింపుదారులను ఎలా శిక్షించవచ్చునో విడమర్చి మరీ చెప్పారు. ఫిరాయింపుదారులు అసెంబ్లీ గేటు తాకడానికి వీల్లేదని సభల్లో నినదించారు. కానీ, నిత్యం ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ నేతలు ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ బీఆర్ఎస్ ఖాళీ అన్నట్టు మాట్లాడుతుంటే.. వారికి చరిత్ర తెలియదనుకోవాలా? లేక ఒక వికృత మానసిక క్రీడకు ఒడిగట్టారని భావించాలా? పిల్లి శాపాలకు ఉట్టి తెగదు కదా? కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు ఒక హెచ్చరికగా భావించకుండా పదే పదే ఫిరాయింపు జపం చేయడం వెనుక ప్రజల దృష్టిని పక్కదారిపట్టించే కుట్ర దాగి ఉంది. అందుకు కారణం లేకపోలేదు. కాంగ్రెస్ గద్దెనెక్కిన నాటి నుంచి రాష్ట్ర ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. ఎన్నికల హామీల అమలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది. రైతులు, విద్యార్థులు, యువత తమ సమస్య ల పరిష్కారం కోసం, ఎన్నికల హామీల అమలు కోసం ఉద్యమిస్తున్నారు. తులం బంగారం ఏద ని తల్లులు ప్రశ్నిస్తున్నారు. ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఏకంగా పోలీసులే వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. మత వైషమ్యాల ప్రమాదం మళ్లీ పొంచి చూస్తున్నది. పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలు గాలికొదిలి మంత్రులు అధ్యయనం పేరిట విదేశీ పర్యటనల్లో తలమునకలై ఉన్నారు. ఏ ప్రభుత్వ హయాంలోనైనా గత ప్రభుత్వమే బాగుండేదని, ఆ రోజులే బాగుండేవని గుర్తుచేసుకుంటూ ప్రజలు పశ్చాత్తాపపడ్డారంటే అది వర్తమాన ప్రభుత్వ వైఫల్యాలకు పరాకాష్ఠ. ఆ దుస్థితిని కప్పిపుచ్చడానికి ఎప్పటికప్పుడు బూతులో, బుల్డోజర్‌లో, అక్రమ కేసులో, అభాండాలో ఏవైతేనేం.. ఒక అలజడి, ఒక సంచలనం సృష్టించడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చి ఉపశమనం పొందవచ్చన్న ధ్యాస కాంగ్రెస్ అధికారగణంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. అందులో భాగంగానే పదే పదే ఫిరాయింపు పునరుక్తి దోషానికి ఆ పార్టీ పాల్పడుతున్నది. ఆకులు రాలినంత మాత్రాన చెట్టు మోడువారదు. మళ్లీ చిగురిస్తుంది. బీఆర్ఎస్ కూడా అంతే.

# ప్రజల మనిషి వట్టికోట



ప్రజల కోసమే పుట్టి, ప్రజల కోసమే బతికి, ప్రజల కోసమే మరణించినవారిని ప్రజలు మరిచిపోతారేమో కానీ, చరిత్రలో వారు సృష్టించుకున్న పేజీలు మాత్రం మరిచిపోలేవు. నిరంతరం వారి త్యాగా లను గుర్తుచేస్తూనే ఉంటాయి. వారు సృష్టించుకున్న చైతన్యదీప్తి ఈ సమాజాన్ని ఎప్పుడూ ముందుకు నడిపిస్తూనే ఉంటుంది. అందుకే చరిత్ర ఈ మహనీయులను ప్రజల మనుషులుగా అభివర్ణిస్తుంది. ఆ విధంగా గుర్తించినవారిలో వట్టికోట ఆళ్వారుస్వామి ముందువరుసలో ఉంటారు. 'విశ్రాంతి తెలియనివాడు-స్వసుఖం కోరనివాడు వారం వారం మారనివాడు-రంగులద్దుకోలేనివాడు' అని వట్టికోట ఆళ్వారుస్వామిని కీర్తిస్తూ తన అద్భుతరచన 'అగ్నిధార'ను వట్టికోటకు అంకితమిచ్చారు మహాకవి దాశరథి. అంతేకాదు, కేతవరపు రామకోటి శాస్త్రి తన 'పీహెచ్‌డీ సిద్ధాంత' గ్రంథాన్ని, దాశరథి రంగాచార్య తన 'జనపదం' నవలను అంకితమిచ్చారు. తెలంగాణ తొలితరం నవలా సాహిత్యకారుడు వట్టికోట ఆళ్వారుస్వామి స్ఫూర్తి, రాష్ట్ర సాధన కోసం సాగిన సాహిత్య, సాంస్కృతిక ఉద్యమంలో కీలక భూమికను పోషించిందని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 'వట్టికోట'ను ప్రశంసించారు. ఎందరో మహనీయుల ప్రశంసలందుకున్న వట్టికోట 1915 నవంబర్ 1న నల్గొండ జిల్లాలోని చెరువు మాదారం గ్రామంలోని నిరుపేద (సింహాద్రమ్మ- రామచంద్రాచార్య) దంపతులకు జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. ఆయన కుటుంబం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. కాంచనపల్లి సీతారామారావు అనే ఉపాధ్యాయునికి వండిపెడుతూ వట్టికోట తన చదువును కొనసాగించారు. ఆ తర్వాత గ్రంథాలయాలనే పవిత్ర ఆలయాలుగా భావించిన వట్టికోట నిరంతరం గ్రంథాలయాల్లోనే గ్రంథ పఠనం చేస్తూ సాహిత్య సౌరభాలను ఆఘ్రాణించారు. విజయవాడలో ఒక హోటల్‌లో సర్వర్‌గా పనిచేసినప్పుడు అక్కడి సాహిత్యకారులతో పరిచయం ఏర్పరుచుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చిన వట్టికోట 1936-37లో గోలకొండ పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా, ఆ తర్వాత మీజాన్ పత్రికలో ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా పనిచేశారు. నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే ఆయనకు ఆంధ్ర మహాసభతో సాన్నిహిత్యం ఏర్పడింది. దాంతో ఆంధ్ర మహాసభ, నల్గొండ శాఖకు అధ్యక్షుడయ్యారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, స్టేట్ కాంగ్రెస్, ఆర్యసమాజ్ కార్యకర్తగా, అభ్యుదయ రచయితల సం ఘం, తెలంగాణ రచయితల సంఘం సభ్యుడిగా నిరంతరం ప్రజల కోసమే జీవించారు. ఇక నిజాం వ్యతిరేక పోరాటాల్లో పాల్గొనడంతో ప్రభుత్వ ఆగ్రహానికి గురై జైలు పాలయ్యారు. జైలు లోపల గడిపిన రోజుల్లో అప్పటికే జైల్లో ఉన్న దాశరథితో సాన్నిహిత్యం ఏర్పడింది. జైలు గోడలపై బొగ్గుతో రాసిన దాశరథి కవితలను కంఠస్థం చేసేవారు. జైలు నుంచి విడుదలైన వట్టికోట సమాజ చైతన్యానికి విజ్ఞాన ప్రచారమే సాధనమని భావించారు. అందుకే సికింద్రాబాద్‌లో దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించి పలువురు ప్రముఖుల గ్రంథాలను ప్రచురించారు. ఈ గ్రంథమాల సురవరం ప్రతాపరెడ్డి రాసిన 'హైందవ ధర్మవీరులు', 'ప్రాథమిక స్వత్వములు' గ్రంథాలతో సహా 35 గ్రంథాలను ప్రచురించింది. అంతేకాదు ఊరూరా తిరుగుతూ ఈ గ్రంథాలను తక్కువ ధరకే విక్రయించిన వట్టికోట సమాజంలో చైతన్యదీప్తిని ప్రజ్వరిల్లజేశారు. సాహిత్య ప్రచార సారథిగా మాత్రమే కాదు, ఆయన తొలితరం నవలా రచయిత, కథకుడు, సంపాదకుడు, ప్రచురణకర్త కూడా. వట్టికోట కొంతకాలం 'తెలుగు తల్లి' అనే మాసపత్రికను నిర్వహించారు. 'తెలంగాణ' అనే వార్తాపత్రికను కూడా నడిపారు. ఆయన రాసిన 'ప్రజల మనిషి' 1938కి ముందు నిజాం పాలన కింద ఉన్న తెలంగాణ పరిస్థితులకు దర్పణం పడుతుంది. 'జైలు లోపల' అనే కథా సంపుటి తాను జైలులో స్వయంగా దర్శించిన ఖైదీల విభిన్న మనస్తత్వాలను విపులంగా విశదీకరిస్తుంది. ఇక 'గంగు' అసంపూర్ణ నవల 1940-45 మధ్య నిజాంకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటానికి అద్దం పడుతుంది. 'రామప్ప రభస' వ్యాసాలు సామాజిక సమస్యలను కండ్లెదుట వ్యంగ్యంగా నిలుపుతాయి. అంతేకాదు వట్టికోట 'ధర్మరాజు' అనే కలం పేరుతో కూడా కొన్ని రచనలు చేశారు. తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి. 1961, ఫిబ్రవరి 5న దివంగతులయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ప్రభుత్వం 2014, నవంబర్ 1న ఆయన శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. అంతేకాదు, హైదరాబాద్‌లోని సిటీ సెంట్రల్ గ్రంథాలయానికి వట్టికోట ఆళ్వారుస్వామి పేరు పెట్టాలని గత ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయం.

# యవ్వనంగా కనిపించాలా అయితే పుట్టగొడుగులను తినండి



గ్రామీణ ప్రాంతాల్లో అయితే మనకు పుట్టగొడుగులు ఈ సీజన్‌లో ఎక్కువగా లభిస్తుంటాయి. అయితే పుట్టగొడుగులను ఇప్పుడు చాలా మంది పండిస్తున్నారు. కనుక మనకు ఇవి ఎప్పుడంటే అప్పుడు అందుబాటులో ఉంటున్నాయి. పుట్టగొడుగులు ఫంగస్ జాతికి చెందినవి. వీటిని శాకాహారంగా చెప్పవచ్చు. పుట్టగొడుగులతో చేసే ఏ వంటకం అయినా సరే ఎంతో రుచిగా ఉంటుంది. అందుకనే రెస్టారెంట్లలో చాలా మంది వెజిటేరియన్లు పుట్టగొడుగులను తినేందుకు ఇష్టపడుతుంటారు. అయితే పుట్టగొడుగులు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తినడం వల్ల పలు అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు.

### సూర్య కిరణాల నుంచి రక్షణ..

పుట్టగొడుగుల్లో బీటా గ్లూకన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి సాల్యుబుల్ ఫైబర్ జాతికి చెందినవి. హానికర బాక్టీరియాను ఇవి నిర్మూలిస్తాయి. దీంతో చర్మ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. అలాగే మొటిమలు, మచ్చల నుంచి విముక్తి లభిస్తుంది. కనుక పుట్టగొడుగులను తరచూ తింటుండాలి. వీటిలో ఎర్గోథియోనెయిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఒక అమైనో ఆమ్లం. ఇది యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది. ఇది డీఎన్ఏకు మరమ్మత్తులు చేస్తుంది. సూర్యకాంతి వల్ల డ్యామేజ్ అయిన కణాలను తిరిగి పునరుద్ధరిస్తుంది. సూర్యుని నుంచి వచ్చే అల్ట్రా వయోలెట్ కిరణాల నుంచి, కాలుష్య కారకాల నుంచి రక్షణను అందిస్తుంది. దీని వల్ల చర్మం సురక్షితంగా ఉంటుంది. పలు రకాల పుట్టగొడుగుల్లో పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల జాబితాకు చెందుతాయి. వీటిల్లో పాలిశాకరైడ్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని మృదువుగా మార్చుతాయి. తేమగా ఉండేలా చూస్తాయి. పుట్టగొడుగులలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాల నిర్మాణం సరిగ్గా ఉంటుంది. అలాగే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. దీంతో వయస్సు మీద పడుతున్నప్పటికీ యవ్వనంగా కనిపిస్తారు.

### స్కిన్ టోన్ మెరుగు పడుతుంది..

పుట్టగొడుగులలో మెలనిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మాన్ని హానికర కిరణాల నుంచి రక్షిస్తుంది. వీటిలో కోజిక్ యాసిడ్ ఉంటుంది. ఇది సహజసిద్ధమైన సమ్మేళనం. ఇది చర్మానికి కాంతినిస్తుంది. డార్క్ స్పాట్స్‌ను తొలగిస్తుంది. దీంతో స్కిన్ టోన్ మెరుగు పడుతుంది. పుట్టగొడుగులు అన్నీ కూడా తినేవి కావు, వీటిల్లో తినే పుట్టగొడుగులు వేరే ఉంటాయి. అయితే మార్కెట్‌లో మాత్రం తినే పుట్టగొడుగులనే విక్రయిస్తుంటారు. ఇక ప్రపంచవ్యాప్తంగా చాలా పుట్టగొడుగు వెరైటీలు ఉన్నప్పటికీ మనం తినే పుట్టగొడుగులు మాత్రం 13 రకాలు మాత్రమే ఉన్నాయి. ఇవి చర్మాన్ని సంరక్షించడంతోపాటు అందాన్ని కూడా ఇస్తాయి. అందువల్ల పుట్టగొడుగులను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శనివారం 22 - 02 - 2025

# కృష్ణా జలాలు.. నిజానిజాలు !



ఇటీవలి కాలంలో కృష్ణా జలాల పంపిణీపై '2015, జూన్‌లో జరిగిన ఒప్పందం చేసుకోవడం ద్వారా కృష్ణా జలాల్లో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణకు శాశ్వతంగా నష్టం కలుగజేసింది. తెలంగాణ వాటాను 299 టీఎంసీలకు పరిమితం చేసి 512 టీఎంసీల నీటిని ఆంధ్రాకు అప్పజెప్పింది' అని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యతిరేకులు దుష్ప్రచారం చేస్తున్నారు. అందుకు వారు 2015, జూన్ 18, 19 తేదీల్లో జరిగిన అంతర్రాష్ట్ర సమావేశపు మినిట్స్‌ను సాక్ష్యంగా చూపిస్తున్నారు. ఆ మినిట్స్‌లో రాసుకున్న అంశాలను పూర్తిగా చదవకుండానే, చదివినా కుట్రపూరితంగా, ఉద్దేశపూరితంగానే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారనుకోవాలి. వారు చూపిస్తున్న సమావేశపు మినిట్సే ఆ అబద్ధాలకు సాక్ష్యం.ఆ మినిట్స్‌ను దగ్గరుండి రాయించింది నాటి కేసీఆర్ ప్రభుత్వంలో సాగునీటి సలహాదారులుగా పనిచేసిన దివంగత ఆర్.విద్యాసాగర్‌రావు. తెలంగాణ సాధన ఉద్యమంలో నీళ్లల్లో నిప్పులు రగిలించినవాడు ఆర్.విద్యాసాగర్‌రావు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి రంగంలో జరిగిన అన్యాయాలను, వివక్షను ప్రజలకు పూసగుచ్చినట్టు తన ఉపన్యాసాల్లో వివరించాడు. పత్రికల్లో వందలాది వ్యాసాలను రాసి నీటి సంగతులు ప్రజలకు తెలియపరిచాడు. ఆ వ్యాసాలను 'నీళ్లు-నిజాలు' పేరుతో రెండు సంకలనాలుగా ప్రచురించి ప్రజలను చైతన్య పరిచాడు. అలాంటి నిబద్ధ, నిష్కళంక ఉద్యమకారుడు కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు అన్యాయం చేస్తాడని ఊహించడానికే కంపరంగా ఉన్నది.కృష్ణా జలాల పునః పంపిణీ కోసం 2002 నుంచే పోరాటం చేసిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే ఒప్పుకుంటారా? ఆ సమావేశానికి ఢిల్లీ వెళ్లే ముందు ఆనాటి సీఎం కేసీఆర్‌తో సమీక్షా సమావేశం జరిగింది. అందులో రాష్ట్ర వైఖరిని చర్చించాం. అప్పటికే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ప్రకారం కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఏర్పాటైంది. 2015-16 వాటర్ ఇయర్‌కు నీటి పంపిణీ చేయవలసిన బాధ్యత కృష్ణా బోర్డుదే. అదే విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2014, మే 15న గజిట్ నోటిఫికేషన్ జారీచేసి బ్రిజేష్ కుమార్ (కెడబ్ల్యూడీటీ-2) ట్రిబ్యునల్‌కు రెండేండ్ల పాటు పదవీ కాలాన్ని పొడిగించింది. 2014, జూన్ నుంచే ట్రిబ్యునల్ విచారణను ప్రారంభించింది. ట్రిబ్యునల్ ముందు హాజరు కావాలని తెలంగాణ సహా 4 రాష్ట్రాలకు 2014, జూన్ 20న నోటీసులూ జారీ చేసింది. దీంతో రెండేండ్లలో తీర్పును వెలువరించే అవకాశం ఉన్నదనే ఆశాభావం అందరిలో కలిగింది.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జలయజ్ఞం కింద ప్రారంభించిన కృష్ణా బేసిన్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్టులు ఇంకా నీటిని వినియోగించుకునే దశకు రాలేదు. అనేక సమస్యల కారణంగా అవి పెండింగ్ ప్రాజెక్టులుగానే మిగిలిపోయాయి. తెలంగాణ ఏర్పాటు కాగానే కరువుకు, వలసలకు, రైతుల ఆత్మహత్యలకు నిలయంగా మారిన మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులను పూర్తిచేయడానికి కేసీఆర్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యాన్నిచ్చింది. భూ సేకరణ చేసింది. అటవీ సంబంధిత, రైల్వే, రోడ్డు క్రాసింగ్ సమస్యలను పరిష్కరించింది. 2015 నాటికి ఆ ప్రాజెక్టుల పనులు ఇంకా పురోగతిలో ఉన్నాయి.పైన వివరించిన కారణాల రీత్యా 2015 జూన్ 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన అంతర్రాష్ట్ర సమావేశంలో సాగునీటి సలహాదారుగా తెలంగాణ బృందానికి నాయకత్వం వహించి, కృష్ణా జలాల నీటి పంపిణీపై ఒక ఏడాది కోసం తాత్కాలిక వెసులుబాటు (%ఔశీతీఎఱఅస్త్ర౯ాతీతీఖఅస్త్రవఎవత్%) ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఆ మినిట్స్‌లో తెలంగాణ ప్రయోజనాలకు ఎటువంటి భంగం కలగకుండా ఆర్.విద్యాసాగర్ రావు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. మొదటి పేజీలో రెండుసార్లు, చివరి పేజీలో రెండు సార్లు ఒక ఏడాది కోసమే ఈ ఒప్పందం అని, ఈ ఒప్పందం ట్రిబ్యునల్, కోర్టులు, ఇతర చట్టబద్ధ సంస్థల ముందు రాష్ట్రాల నీటి హక్కులపై ఏ రకమైన ప్రభావాన్ని చూపజాలదని నొక్కిచెప్పారు.2018 నాటికి పైన పేర్కొన్న మహబూబ్‌నగర్ ప్రాజెక్టులు.. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతలు బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన ప్రత్యేక శ్రద్ధ వల్ల పూర్తయి పాక్షికంగా నీటిని వినియోగించుకునే దశకు చేరుకున్నాయి. ఆర్‌డీఎస్ కాలువకు కింద ఉన్న 58 వేల ఎకరాల స్థిరీకరణకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కూడా 11 నెలల్లో పూర్తి చేయించింది. కాబట్టి, ఒక ఏడాది కోసం చేసుకున్న ఒప్పందాన్ని వదిలేసి ట్రిబ్యునల్ తీర్పు వచ్చేవరకు కృష్ణా జలాల్లో 50 శాతం నీటిని వినియోగించుకోవడానికి అనుమతినివ్వాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు, కృష్ణా యాజమాన్య బోర్డుకు నిరంతరం నివేదిస్తూనే ఉన్నది తెలంగాణ ప్రభుత్వం. 2018, ఫిబ్రవరి 15న రాసిన లేఖతో మొదలైన 50 శాతం నీటి పోరాటం 2023 దాకా కొనసాగింది.ఏటా జరిగే కృష్ణా బోర్డు సమావేశాల్లో మన ప్రతినిధులు ఈ అంశంపై గట్టిగా వాదించారు. అయితే బోర్డు చైర్మన్ తన విచక్షణాధికారాలను వినియోగించి 34(తె): 66 (ఆం) నిష్పత్తిని కొనసాగించేవారు. చైర్మన్ ఈ విచక్షణాధికారాన్ని ప్రశ్నిస్తూ అనేకసార్లు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు కూడా లేఖలు రాశారు. కేంద్రం ఈ విషయంలో తీసుకున్న చర్యలు శూన్యం. 2021లో జరిగిన కృష్ణా బోర్డు 14వ సమావేశంలో, 2022లో జరిగిన 16వ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్ కుమార్ కృష్ణా బేసిన్ ప్యారామీటర్లను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ కృష్ణా జలాల్లో 70.80 శాతం వాటా పొందడానికి అర్హత ఉన్నదని గట్టిగా వాదించారు. కృష్ణా బేసిన్‌లో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు (ఎస్-ఎల్‌బీసీ)కి 40 టీఎంసీలు, కల్వకుర్తి ప్రాజెక్టుకు 40 టీఎంసీలు, నెట్టెంపాడుకు 25 టీఎంసీలు మొత్తం 105 టీఎంసీలు వినియోగం కోసం అవసరమని, ఈ నీటిని వాడుకోవడానికి అనుమతించాలని పట్టుబట్టారు.ట్రిబ్యునల్ తీర్పు వచ్చేదాకా 811 టీఎంసీలలో 405.5 టీఎంసీలను తెలంగాణ వాడుకుంటుందని బోర్డు చైర్మన్‌కు నివేదించారు. 2023లో జరిగిన బోర్డు 17వ సమావేశంలో కూడా 50 శాతం నీటి వాటా కోసం గట్టిగా వాదించడమే కాదు, బోర్డు చైర్మన్ తన విచక్షణాధికారంతో నీటి పంపిణీ నిష్పత్తిని నిర్ధారించడాన్ని తెలంగా ణ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఈ రకంగా 50 శాతం తాత్కాలిక నీటి వాటా కోసం పోరాటం కేసీఆర్ ప్రభుత్వంలో కొనసాగింది.అదే సమయంలో నాటి కేసీఆర్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల పరిష్కార చట్టం-1956, సెక్షన్ 3 ప్రకారం.. కృష్ణా ట్రిబ్యునల్ వేయమని కేంద్రాన్ని నిరంతరం కోరింది. సాగునీటి మంత్రిగా హరీశ్‌రావు కేంద్ర జల వనరుల మంత్రులకు, ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రధాని మోదీకి వ్యక్తిగతంగా లేఖలు కూడా రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నెల రోజులకే సెక్షన్ 3 కింద కృష్ణా జలాల పునఃపంపిణీ అంశాన్ని కృష్ణా ట్రిబ్యునల్‌కు నివేదించాలని కోరింది. 2016లో జరిగిన మొదటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కూడా ఈ అంశంపై కేసీఆర్ గట్టిగా వాదించారు. ట్రిబ్యునల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆనాటి కేంద్ర జల వనరుల మంత్రి ఉమాభారతి హామీ ఇచ్చారు. ఆమె ఈ అంశంలో చిత్తశుద్ధితోనే వ్యవహరించారు. కానీ, ఆమె ప్రయత్నాలను కొన్ని దుష్టశక్తులు అడ్డుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం లేఖ రాసి ఒకటిన్నరేండ్లు గడిచినా కేంద్రంలో చలనం రాలేదు. న్యాయం కోసం తెలంగాణ ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించింది. సుప్రీంలో కేసు ఉన్నప్పటికీ కేంద్రంతో ఈ అంశంపై నిరంతరం సంప్రదింపులు జరిపింది.విభజన చట్టం సెక్షన్ 89 ప్రకారం%ఠా% బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ జరుపుతుండగా మళ్లీ ఈ సెక్షన్ 3 కింద ట్రిబ్యునల్ వేయమని ఎందుకు కోరుతున్నారని మేధావులకు సహా చాలామందికి అర్థం కాలేదు. సెక్షన్ 3 కిందనే విచారణ జరగాలని కేసీఆర్ ప్రభుత్వం కోరుకోవడానికి కారణం ఉన్నది. విభజన చట్టం సెక్షన్ 89లో కృష్ణా జలాల పునః పంపిణీ ప్రస్తావన లేదు. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేయమని మాత్రమే అందులో ప్రస్తావించింది.ఇది చట్టం రూపొందించినప్పుడు జరిగిన తప్పిదం. అందులోనే సెక్షన్ 3 కింద పునఃపంపిణీ అంశాన్ని చేర్చి ఉంటే ఈపాటికి తెలంగాణ న్యాయమైన వాటా పొంది ఉండేది. చట్టం రూపకర్తలు ఆంధ్రా అనుకూల చట్టాన్ని తయారుచేశా రు. విభజన చట్టంలో ఇలాంటి అనేక తప్పిదాలు జరిగిన సంగతి ఉద్యమకారులు గుర్తించి సవరణ చేయమని కోరారు. మీకు చట్టం ఆమోదం కావాలో, సవరణలు కావాలో తేల్చుకోండని కేం ద్ర ప్రభుత్వ పెద్దలు బెదిరిస్తే ఇక తప్పనిసరి పరిస్థితుల్లో సవరణలకు పట్టుబట్టకుండా తప్పులతో నే చట్టం ఆమోదానికి సమ్మతించవలసి వచ్చింది.సెక్షన్ 89 కింద విచారణ వల్ల తెలంగాణకు న్యాయం జరగదన్న స్పృహ కేసీఆర్‌కు ఉన్నది. ట్రిబ్యునల్ కూడా సెక్షన్ 89 కింద తమకు కృష్ణా జలాల పునః పంపిణీకి అవకాశం లేదని, పునః పంపిణీ అనే అంశం తమ విచారణ పరిధిలో లేదని రెండుసార్లు రాత పూర్వకంగా తమ తీర్పుల్లో పేర్కొన్నది. ఇవే అభిప్రాయాలను విచారణ సందర్భంగా అనేకసార్లు వెల్లడించింది. కాబట్టే సెక్షన్ 3 కింద జరిగే విచారణ ద్వారానే రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీ న్యాయబద్ధంగా జరుగుతుందని భావించి నిరంతరం పోరాడారు.2020, అక్టోబర్‌లో జరిగిన 2వ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ ఈ అంశంపై పదే పదే పట్టుబడితే నాటి కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్ ట్రిబ్యునల్ వేయడానికి అంగీకరించారు. అయితే, అందుకు మెలికలు పెట్టారు. ఒకటి, తెలంగాణ ప్రభుత్వం సుప్రీంలో వేసిన కేసును వాపస్ తీసుకోవాలి. రెండు, సెక్షన్ 3 రిఫరెన్స్ కొత్త ట్రిబ్యునల్‌కు నివేదించాలా, లేదా సెక్షన్ 89 కింద విచారణ జరుపుతున్న ప్రస్తుత బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించాలా అన్న అంశంపై కేంద్ర న్యాయశాఖ అభిప్రాయం తీసుకుంటామని, ఆ తర్వాతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇవన్నీ మినిట్స్‌లో నమోదయ్యాయి. కేంద్ర మంత్రి హామీని పురస్కరించుకొని సుప్రీంలో కేసు వాపస్ తీసుకొమ్మని కేసీఆర్ అధికారులను ఆదేశించారు.సుప్రీంకోర్టు 2021 అక్టోబర్‌లో కేసు వాపస్ తీసుకోవడానికి తెలంగాణ రాష్ట్రాన్ని అనుమతించింది. ఇది జరిగి రెండేండ్లు గడిచిన తర్వాత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023, అక్టోబర్‌లో సెక్షన్ 3 కింద అదనపు రెఫరెన్స్‌ను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించింది. దీంతో కృష్ణా ట్రిబ్యునల్ కోసం కేసీఆర్ ప్రభుత్వం చేసిన పదేండ్ల పోరాటం ఫలించింది. కేంద్రం చేసిన ఈ రిఫరెన్స్‌ను వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంలో కేసు వేసింది. ఈ కేసు విచారణ ఇంకా జరుగుతున్నది. అయితే, ఏపీ కోరిన స్టేను మాత్రం మంజూరు చేయకపోవడం తెలంగాణకు ఒక ఊరట. ఇటీవల ట్రిబ్యునల్ కూడా సెక్షన్ 3 కిందనే తొలుత విచారణ చేస్తామని ప్రకటించడం మరొక ఊరట.ఇక్కడ ప్రజలు, మేధావులు, బుద్ధిజీవులు రాజకీయాలకతీతంగా ఆలోచించవలసిన అంశం ఏమంటే%ఠా% కేసీఆర్ ప్రభుత్వం చేసిన నిరంతర కృషి, పోరాట ఫలితమే సెక్షన్ 3 రిఫరెన్సులు. ఇది విస్మరించరాని సత్యం. కేసీఆర్ ప్రభుత్వం ట్రిబ్యునల్ ముందు ఉంచిన డిమాండ్ 575 టీఎంసీలను సాధించడం ఎట్లా? అన్నదే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ముందు, తెలంగాణ సమాజం ముందున్న అసలైన సవాలు. ఇందులో రాజకీయాలకు తావులేదు. తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం.కనీసం ఈ అంశంలోనైనా రాజకీయ విమర్శలు మాని ఏకోన్ముఖంగా ముందుకుసాగడమే మనందరి లక్ష్యం కావాలి. ఈ రోజు అధికారంలో ఉండే మనుషులు, పార్టీలు రేపు అధికారంలో ఉండకపోవచ్చు. కానీ, ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా కొనసాగే నిరంతర వ్యవస్థ. ఈ అవగాహనతో, ఈ కీలక సమయంలో గత కేసీఆర్ ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు మాని కృష్ణా ట్రిబ్యునల్ ముందు వాదించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. అందరినీ కలుపుకుపోవాలి. ఈ విషయంలో ప్రభుత్వానికి సహకరించడానికి ప్రతీ ఒక్కరూ సిద్ధంగానే ఉంటారు. ట్రిబ్యునల్‌లో న్యాయమైన వాటా సాధించడమే లక్ష్యంగా ఏకోన్ముఖ కృషి తెలంగాణ సమాజం తరపున జరగాలి.నాటి కేసీఆర్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల పరిష్కార చట్టం-1956, సెక్షన్ 3 ప్రకారం.. కృష్ణా ట్రిబ్యునల్ వేయమని కేంద్రాన్ని నిరంతరం కోరింది. సాగునీటి మంత్రిగా హరీశ్‌రావు కేంద్ర జల వనరుల మంత్రులకు, ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రధాని మోదీకి వ్యక్తిగతంగా లేఖలు కూడా రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నెల రోజులకే సెక్షన్ 3 కింద కృష్ణా జలాల పునఃపంపిణీ అంశాన్ని కృష్ణా ట్రిబ్యునల్‌కు నివేదించాలని కోరింది.

# తెలంగాణ చేనేత దుస్తుల్లో ప్రపంచ సుందరి పోటీదారులు ?

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రపంచ సుందరి పోటీ 'మిస్ వరల్డ్' 72వ ఎడిషన్‌కు తెలంగాణ వేదిక కాబోతుంది. 2025లో ఈ వేడుకను తెలంగాణలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు.ఈసారి మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణలో నిర్వహించనున్నట్లు మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈవో, చైర్మన్ జూలియా మోర్లీ, తెలంగాణ ప్రభుత్వ పర్యటక, సాంస్కృతిక, వారసత్వ, యువ వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్‌తో కలిసి ప్రకటించారు.మే 4 నుంచి మే 31 వరకు 28 రోజుల పాటు సాగే ఈ కార్యక్రమం.. తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నారు.తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, ఆధునికత ఉట్టిపడేలా ఈ కార్యక్రమం జరపనున్నట్లు ప్రభుత్వం, నిర్వాహకులు చెబుతున్నారు. మిస్ వరల్డ్‌కు చెందిన గ్రాండ్ ఫైనల్‌తో పాటు ప్రారంభ, ముగింపు వేడుకలకు హైదరాబాద్ వేదిక కానుంది." 72వ ప్రపంచ సుందరి వేడుకను గొప్ప సంస్కృతి, వినూత్నత, ఆతిథ్యానికి నెలవైన తెలంగాణలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం ద్వారా ఈ ప్రాంత అద్భుతమైన వారసత్వాన్ని, గతిశీల వృద్ధిని ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు మాకు అవకాశం కల్పిస్తుంది. ఇది కేవలం ప్రపంచ సుందరి వేడుకను నిర్వహించడమే కాదు..కమ్యూనిటీల్లో సాధికారత తీసుకురావడం, వైవిధ్యాన్ని వేడుకగా చేయడం, 'బ్యూటీ విత్ పర్పస్' అనే ప్రామిస్ ద్వారా దీర్ఘకాలిక ప్రభావం చూపించే ప్రయత్నం కూడా." అని జూలియా మోర్లీ అన్నారు.

**అంతకుముందు వేడుకలూ భారత్‌లోనే..**

రాజధాని న్యూదిల్లీలో, ముంబయిలో 71వ ఎడిషన్ మిస్ వరల్డ్ పోటీలు జరిగాయి. 72వ ఎడిషన్ పోటీలను కూడా భారత్‌లోనే నిర్వహిస్తున్నారు.ముంబయిలో జరిగిన 71వ ఎడిషన్ 'మిస్ వరల్డ్' ఫైనల్ పోటీల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రిస్టినా పిస్కోవా విజేతగా నిలిచారు.ఆ ఎడిషన్‌లో భారత్ నుంచి పోటీల్లో పాల్గొన్న కన్నడ అమ్మాయి సిని శెట్టి టాప్-8లో నిలిచారు. అంతకుముందు 1996లో భారత్‌లో ఈ పోటీలు జరిగాయి.

**'ప్రధాన ఆకర్షణ చేనేత దుస్తులే.. '**

ఈసారి తెలంగాణలో జరగబోయే మిస్ వరల్డ్ పోటీల్లో ప్రధాన ఆకర్షణ చేనేత దుస్తులు. దేశ విదేశాల నుంచి అందాల పోటీలకు వచ్చే అమ్మాయిలంతా తెలంగాణ చేనేత వస్త్రాలు ధరించేలా ప్రణాళిక చేస్తోంది రాష్ట్ర ప్రభుత్వం.మిస్ వరల్డ్ పోటీల్లో అనేక థీమ్‌లు ఉంటాయి. అందులో భాగంగా ఒక థీమ్ తెలంగాణ చేనేత వస్త్రాలు ఉండేలా చూస్తామంటున్నారు అధికారులు."ఈ మిస్ వరల్డ్ పోటీలను ఉపయోగించుకుని చేనేత పరిశ్రమకు మేలు చేసేలా ఒక ప్రణాళిక వేస్తున్నాం. ఆ పోటీల్లో తెలంగాణ హ్యాండ్లూమ్ అనే థీమ్ కూడా పెడుతున్నాం. పోటీలో పాల్గొనే అమ్మాయిలంతా తెలంగాణ చేనేత వస్త్రాలు వేసుకుంటారు. ఇందుకోసం మేం స్థానిక, అంతర్జాతీయ డిజైనర్లను కూడా ఆహ్వానిస్తున్నాం. మోడ్రన్, ట్రెడిషనల్ కలిపి మిక్స్ అండ్ మ్యాచ్‌గా చేయబోతున్నాం." అని బీబీసీతో చెప్పారు తెలంగాణ టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్.మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే విదేశీ యువతులంతా ఇలా చేనేత దుస్తులు వేసుకుంటే అది భారతీయ చేనేత రంగానికి ప్రోత్సాహాన్నిస్తుందని అధికారులు భావిస్తున్నారు.పోచంపల్లి, గద్వాల, నారాయణపేట వంటి వస్త్రాలతో పోటీదార్లకు సరికొత్త డిజైన్ల దుస్తులను రూపొందించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోంది.మొత్తం ప్రపంచంలోని అన్ని దేశాల ప్రతినిధులూ పాల్గొనే పోటీ కాబట్టి, తెలంగాణ టూరిజం, ఉత్పత్తులు, పెట్టుబడి అవకాశాలు వీటన్నింటినీ అతిథులు ముందు ఉంచేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది."ఇది తెలంగాణ పర్యటక రంగానికి చాలా గొప్ప అవకాశం. చాలా పొటెన్షియల్ ఉన్న సందర్భం ఇది. అందుకే దీన్ని అన్ని రకాలుగా ఉపయోగించుకుంటూ భాగస్వాములం అవుతున్నాం. తెలంగాణ ఆహారం, ఆతిథ్యం, పర్యటక ప్రాంతాలు, చారిత్రక ప్రాంతాలు, చేనేత, పెట్టుబడులు.. ఇలా అన్ని రంగాల్లో తెలంగాణను ముందు పెట్టడానికి ఈ వేడుకను ఒక అవకాశంగా తీసుకుంటాం." అని బీబీసీతో చెప్పారు స్మితా సబర్వాల్.పోటీదార్లను రామప్ప వంటి స్థలాలు, ఇతర పర్యటక ప్రాంతాలకు తీసుకెళ్లే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

**'బ్యూటీ విత్ పర్పస్' అనే లక్ష్యంతో..**

ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్) అనేది నేడు అత్యంత గుర్తింపు పొందిన హోదాగా నిలుస్తోంది. ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్న వేడుకలు ఇవి.120 దేశాలు, భూభాగాలకు చెందిన పోటీదార్లను ఈ ప్రతిష్టాత్మక ప్రపంచ సుందరి వేడుక ఒకే వేదికపైకి తీసుకొస్తుంది. కేవలం గౌరవప్రదమైన టైటిల్, కిరీటం కోసమే కాకుండా.. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌కు చెందిన 'బ్యూటీ విత్ పర్పస్' అనే లక్ష్యం కోసం ఈ వేడుకలో పోటీ పడాలి.వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహించే వారు, మే 4న తెలంగాణకు రానున్నారు. హైదరాబాద్‌లో మే 31న జరిగే ఫైనల్ వేడుకలో, అంతకుముందు మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవా తన కిరీటాన్ని ప్రపంచ సుందరిగా గెలిచే వారికి అలంకరించనున్నారు.ఈ వేడుకను గ్రాండ్‌గా నిర్వహించేందుకు సిద్ధమవుతున్న




రాష్ట్రం.. 'తెలంగాణ, జరూర్ ఆనా : అందం తన నిజమైన అర్థాన్ని కనుగొనే చోటు' అనే పిలుపుతో ప్రపంచానికి ఆహ్వానం పంపుతోంది.

**తొలి ప్రపంచ సుందరి ఎవరు?**

1951 లో బ్రిటన్‌కు చెందిన ఎరిక్ మెర్లే ఈ పోటీలకు రూపకల్పన చేశారు. అదే ఏడాది జులై 29న మొదటిసారి లండన్‌లో పోటీలు నిర్వహించారు. మొట్టమొదటి ప్రపంచ సుందరిగా స్వీడన్‌కు చెందిన కికి హకన్సన్ నిలిచారు.ఫెమినిస్ట్ గ్రూప్‌ల నుంచి పెద్ద ఎత్తున విమర్శలే కాక, అనేక వివాదాలలో చిక్కుకున్నప్పటికీ..20వ శతాబ్దంలో ప్రపంచ సుందరి పోటీలు బాగా ప్రాచుర్యాన్ని సంపాదించుకున్నాయి. 20వ శతాబ్దం చివరిలో ఈ వేడుకలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయి.ఇందులో పాల్గొనే వారు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టేందుకు 'బ్యూటీ విత్ పర్పస్' అనే నినాదాన్ని అప్పుడే ప్రవేశపెట్టారు.ఆధునిక కాలంలో మిస్ వరల్డ్ పోటీలను మహిళల్లో సాధికారత కల్పించేందుకు, వ్యక్తిగత విజయాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు, ఫిజికల్ అప్పియరెన్స్‌తో సామాజిక సహకారానికి దోహదం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు.

**భారత ప్రపంచ సుందరీమణులు..**

ఇప్పటివరకు ఆరుగురు భారతీయ యువతులు మిస్ వరల్డ్ కిరీటాన్ని చేజిక్కించుకున్నారు. 1966లో రీటా ఫారియా మొదటిసారిగా ప్రపంచ సుందరిగా నిలిచారు.ఆ తర్వాత చాలా ఏళ్లకు ఐశ్వర్యరాయ్ 1994లో మిస్ వరల్డ్‌గా నిలిచారు. 1997లో డయానా హెడెన్, 1999లో యుక్తాముఖి, 2000 సంవత్సరంలో ప్రియాంక చోప్రా ప్రపంచ సుందరిగా నిలిచారు. 17 ఏళ్ల తర్వాత 2017 మిస్ వరల్డ్ కిరీటాన్ని మళ్లీ భారత్‌కు చెందిన మానుషి చిల్లర్ సొంతం చేసుకున్నారు.

# ప్రాణాలంటే విలువేది?

వెల్లువలా వచ్చిపడుతున్న ప్రయాణికులు, రివాజు తప్పకుండా ఆలస్యంగా వచ్చిపోయే రైళ్లు, ఉన్న గందరగోళాన్ని ఒకింత పెంచే అనౌన్స్‌మెంట్లు, ఏమూలకూ సరిపోని మౌలిక సదుపాయాలు... ఇవన్నీ ఏకమై 45 నిమిషాలపాటు ఏకధాటిగా సృష్టించిన తీవ్ర గందరగోళ స్థితి న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాటకు దారితీసి 18 మంది ప్రాణాలను బలి తీసుకుంది. ఈ మరణాలకు సంతాపం ప్రకటించటం, బాధిత కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేయటం సరే... జరిగిన ఘోర ఉదంతానికి నైతిక బాధ్యత వహించాల్సిందెవరు? ఇలాంటివి పునరావృత్తం కానీయ బోమని చెప్పేదెవరు? మన దేశంలో ఎప్పుడు జనసమ్మర్దం అధికంగా ఉంటుందో, ఏ చర్యలు అవసరమో అధికార యంత్రాంగానికి తెలియక కాదు. అందుకు సంబంధించి ఇప్పటికే బోలెడు చేదు అనుభవాలున్నాయి. కానీ ఎన్ని జరుగుతున్నా గుణపాఠం నేర్వని మనస్తత్వమే ఈ విషాద ఘటనకు దారితీసింది. కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాట చోటు చేసుకుని 30 మంది ప్రాణాలు బలై పక్షం రోజులు కాలేదు. అదే ప్రయాగ్‌రాజ్‌కు బయల్దేరిన భక్తులకు ఢిల్లీ రైల్వే స్టేషనే ఈసారి మృత్యుఘంటిక మోగించిందంటే నేరం ఎవరిదనుకోవాలి.తొక్కిసలాట జరిగిన అజ్మీరీ గేట్ టెర్మినల్ గురించి ఉత్తరాదిలో పనిచేసే రైల్వే ఉన్నతాధికారులకూ, ప్రత్యేకించి న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ అధికారులకూ తెలియంది కాదు. సాధారణ దినాల్లో సైతం ఆ టెర్మినల్ కిక్కిరిసివుంటుంది. ఢిల్లీ మెట్రో రైల్‌ను నేరుగా అనుసంధానం చేసే ప్రాంతమది. పైపెచ్చు వాహనాల పార్కింగ్‌కు అనువైనది. యూపీ మీదుగా వెళ్లాల్సిన రైళ్లు ఆగే అయిదు ప్లాట్ ఫాంలు అజ్మీరీ గేట్ టెర్మినల్ ప్రాంతంలోనే ఉన్నాయి. దానికితోడు ఇప్పుడు కుంభమేళా సంరంభం కొనసాగుతోంది. తగిన ప్రణాళిక రూపొందించుకుని, అదనపు జాగ్రత్తలు తీసుకోవడా నికి ఈ కారణాలు చాలవా? సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటలలోపు బయల్దేరే రైళ్లను అందు కోవటానికి వచ్చే జనరల్ కంపార్ట్‌మెంట్ ప్రయాణికులకు అక్కడ రోజూ 7,000 టిక్కెట్లు విక్రయి స్తారు. కానీ శనివారం రోజు కేవలం రెండు గంటల వ్యవధిలో అదనంగా మరో 2,600 మందికి టిక్కెట్లు విక్రయించారు. అంటే రిజర్వేషన్‌లేని ప్రయాణికుల సంఖ్య దాదాపు పదివేలు! ఇంత మంది టికెట్ల తనిఖీ అసాధ్యం. కనుక టికెట్ లేకుండా ప్రయాణించేవారు ఇంతకు మూడు నాలుగు రెట్లు అధికంగా ఉంటారని ఒక అంచనా. అందుబాటులో ఉన్న బోగీలెన్నో, జారీ చేయాల్సిన టికెట్లెన్నో కనీస అంచనాకు రాకపోవటం... అవసరమైన పోలీసు బలగాలను సమకూర్చుకోవాలన్న స్పృహ లోపించటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఘటన జరిగినప్పుడు ఆ ప్రాంతంలో 20 మంది పోలీసులు మాత్రమే ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వారు సైతం ఈ తొక్కిస లాట సమయంలో 'బతుకుజీవుడా' అనుకుంటూ పక్కకుపోయారు. పర్యవసానంగా 'రక్షించండి...' అంటూ ఆర్తనాదాలు చేస్తున్నవారి కోసం పోర్టర్లే రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. వారే గనుక ఆపద్బాంధవుల్లా రాకపోతే మరింతమంది మృత్యువాత పడేవారు. కుంభమేళా సందర్భంగా డిమాండ్ ఎక్కువుంది గనుక ఉన్న రైళ్లను సమయానికి నడిపుంటే ఇంత జనసమ్మర్దం ఉండేది కాదు. ఎంతో జాప్యం జరిగి ఒకదాని వెనక మరొకటిగా వరసపెట్టి మూడు రైళ్లుండటం వల్ల 14, 15 నంబర్ ప్లాట్‌ఫాంలపై వేలాదిమంది పడిగాపులు పడుతున్నప్పుడే ప్రయాగ్‌రాజ్ వెళ్లే ప్రత్యేక రైలుపై వెలువడిన అనౌన్స్‌మెంట్ తీవ్ర గందరగోళానికి దారితీసి తొక్కిసలాట జరిగిందంటున్నారు. మన దేశం వరకూ చూస్తే తొక్కిసలాటల్లో దాదాపు 80 శాతం మతపరమైన పవిత్ర దినాల్లో, తీర్థయాత్రల్లో ఎక్కువగా జరుగుతున్నట్టు 2013లో ఒక అధ్యయనం తేల్చిచెప్పింది. భారీగా వచ్చి పడే ప్రజానీకాన్ని నియంత్రించటానికి జాతీయ విపత్తు నివారణ ప్రాధికార సంస్థ ఆ ఏడాదే సవివరమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఇప్పుడు సాంకేతికత మరింత విస్తరించి సీసీ కెమెరాలు, డ్రోన్‌ల వంటివి అందుబాటులోకొచ్చాయి. వీటి సాయంతో ఎప్పటికప్పుడు కంప్యూటర్ మానిటర్ లలో పర్యవేక్షిస్తూ అవసరమైన చోటకు బలగాలను తరలించటానికి, చర్యలు తీసుకోవటానికి పుష్క లంగా అవకాశాలున్నాయి. ఎక్కడో మారుమూల అడవుల్లో నక్సలైట్లను అణచడానికి వినియోగి స్తున్నామంటున్న సాంకేతికత దేశ రాజధాని నగరంలో కొలువుదీరిన రైల్వే స్టేషన్‌లో ఎందుకు ఆచూకీ లేకపోయిందో పాలకులు చెప్పగలరా?విషాదం చోటుచేసుకున్నప్పుడల్లా దాన్ని తక్కువ చేసి చూపటానికి, అంతా నియంత్రణలో ఉందని చెప్పటానికి పాలకులు తెగ తాపత్రయపడుతుంటారు. 2015లో రాజమండ్రిలో తన కళ్ల ముందే పుష్కరాల్లో 29మంది భక్తులు ప్రాణాలు కోల్పోతే చంద్రబాబు ఎంతటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారో ఎవరూ మరిచిపోరు. మొన్నటికి మొన్న తిరుపతి తొక్కిసలాట జరిగినప్పుడూ ఆయనది అదే వైఖరి. ఇప్పుడు న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ ఉదంతంలోనూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ట్వీట్‌ల ప్రహసనం సైతం అలాగే వుంది. శ్రావణబెళగొళ, స్వర్ణాలయం వంటి చోట్ల ఇంతకు మించి ఎన్నో రెట్లు అధికంగా భక్తులు తరలివస్తారు. కానీ ఎప్పుడూ ఎలాంటి అపశ్రుతులూ చోటు చేసుకో లేదు. ఇందుకు వారు అనుసరిస్తున్న నియంత్రణ చర్యలేమిటో అధ్యయనం చేయాలన్న స్పృహ కూడా ఎవరికీ ఉన్నట్టు లేదు. ఈ విషాదం చెప్పే గుణపాఠాన్ని గ్రహించకపోతే, తప్పు తమది కానట్టు ప్రవర్తిస్తే మళ్లీ మళ్లీ ఇలాంటివే చోటు చేసుకుంటాయి. కమిటీలు, విచారణల తంతు సరే... నిర్దిష్టంగా తాము గ్రహించిందేమిటో, ఇకపై తీసుకోబోయే చర్యలేమిటో ప్రకటిస్తే జనం సంతోషిస్తారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY

శనివారం 22 - 02 - 2025

# పెట్టుబడుల వరద



డాటా సెంటర్లలోకి రెండేండ్లలో 100 బిలియన్ డాలర్లు: సీబీఆర్ఈ

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: పెట్టుబడులను ఆకర్శించడంలో డాటా సెంటర్లు దూసుకుపోతున్నాయి. 2027 నాటికి డాటా సెంటర్ల విభాగంలోకి 100 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నదని సీబీఆర్ఈ అంచనావేస్తున్నది. అలాగే డాటా సెంటర్ల కెపాసిటీ 2070 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపింది. ప్రస్తుతం 1,255 మెగావాట్ల స్థాయిలో ఉన్న డాటా సెంటర్ల సామర్థ్యం..ఈ ఏడాది చివరినాటికి 1,600 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపింది. గడిచిన ఆరేండ్లలో 60 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్శించిన దేశీయ డాటా సెంటర్ల విభాగం..వచ్చే మూడేండ్లలో 100 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నదని సీబీఆర్ఈ సౌత్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం 19 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో డాటా సెంటర్లు నిర్వహిస్తుండగా, వచ్చే ఏడాది చివరినాటికి ఇది 31 మిలియన్ చదరపు అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నదని పేర్కొంది. అలాగే 475 మెగావాట్ల డాటా సెంటర్లు నిర్మాణ దశలో ఉన్నాయని, వచ్చే కొన్ని నెలల్లో ఇవి అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపింది. బీఎఫ్ఎస్ఐ, టెక్నాలజీ, టెలికం రంగాల నుంచి డాటా సెంటర్లకు డిమాండ్ ఉంటుందని తెలిపింది.

**అంతర్జాతీయ సంస్థలు కూడా..**

దేశీయ డాటా సెంటర్లలోకి అంతర్జాతీయ సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. వీటితోపాటు రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ప్రైవేట్ ఈక్విటీ ఫండ్లు కూడా భారీగా నిధులుచొప్పించడానికి సిద్ధమవుతున్నాయి. డాటా సెంటర్ల నిర్వహణలో ముంబై తొలిస్థానం నిలిచింది. ఆ తర్వాతి క్రమంలో చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరులు ఉన్నాయి.

## టాప్-5 సంస్థల ఎం-క్యాప్ రూ.1.13 లక్షల కోట్లు వృద్ధి భారీగా లబ్ధి పొందిన భారతీ ఎయిర్‌టెల్

గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల్లో టాప్-10 సంస్థల్లో ఐదు సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,13,117.17 కోట్లు వృద్ధి చెందింది. భారతీ ఎయిర్‌టెల్ భారీగా లబ్ధి పొందగా, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ఐసీ నష్టపోయాయి. గతవారం బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 623.07 పాయింట్లు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 90.5 పాయింట్లు వృద్ధి చెందాయి. భారతీ ఎయిర్ టెల్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.47,836.6 కోట్ల వృద్ధితో రూ.9,57,842.40 కోట్లకు చేరుకున్నది. ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.31,826.97 కోట్లు పెరిగి రూ.8,30,387.10 కోట్లకు చేరుకున్నది. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ రూ.11,887.78 కోట్లు పుంజుకుని రూ.14,31,158.06 కోట్ల వద్ద స్థిర పడింది. ఐసీఐసీఐ బ్యాంకు ఎం-క్యాప్ రూ.11,760.8 కోట్ల లబ్ధితో 9,49,306.37 కోట్లకు చేరింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఎం-క్యాప్ రూ.9,805.02 కోట్లు పుంజుకుని రూ.16,18,587.63 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.52,031.98 కోట్ల పతనంతో రూ.17,23,144.70 కోట్ల వద్ద నిలిచింది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఎం-క్యాప్ రూ.32,067.73 కోట్ల నష్టంతో రూ.5,89,869.29 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎం-క్యాప్ రూ.22,250.63 కోట్లు పతనమై రూ.5,61,423.08 కోట్లకు చేరుకున్నది. ఎస్బీఐ ఎం-క్యాప్ రూ.2,052.66 కోట్లు, ఐటీసీ ఎం-క్యాప్ రూ.1,376.19 కోట్లు కోల్పోయాయి. గతవారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్-10 సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్డీఎఫ్సీ బ్యాంకు, భారతీ ఎయిర్ టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్ఐసీ, హిందూస్థాన్ యూనీ లివర్, ఎస్బీఐ, ఐటీసీ నిలిచాయి.

# పెట్టుబడుల వరద

డాటా సెంటర్లలోకి రెండేండ్లలో 100 బిలియన్ డాలర్లు: సీబీఆర్ఈ



పెట్టుబడులను ఆకర్శించడంలో డాటా సెంటర్లు దూసుకుపోతున్నాయి. 2027 నాటికి డాటా సెంటర్ల విభాగంలోకి 100 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నదని సీబీఆర్ఈ అంచనావేస్తున్నది. అలాగే డాటా సెంటర్ల కెపాసిటీ 2070 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపింది. ప్రస్తుతం 1,255 మెగావాట్ల స్థాయిలో ఉన్న డాటా సెంటర్ల సామర్థ్యం..ఈ ఏడాది చివరినాటికి 1,600 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపింది. గడిచిన ఆరేండ్లలో 60 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్శించిన దేశీయ డాటా సెంటర్ల విభాగం..వచ్చే మూడేండ్లలో 100 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నదని సీబీఆర్ఈ సౌత్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం 19 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో డాటా సెంటర్లు నిర్వహిస్తుండగా, వచ్చే ఏడాది చివరినాటికి ఇది 31 మిలియన్ చదరపు అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నదని పేర్కొంది. అలాగే 475 మెగావాట్ల డాటా సెంటర్లు నిర్మాణ దశలో ఉన్నాయని, వచ్చే కొన్ని నెలల్లో ఇవి అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపింది. బీఎఫ్ఎస్ఐ, టెక్నాలజీ, టెలికం రంగాల నుంచి డాటా సెంటర్లకు డిమాండ్ ఉంటుందని తెలిపింది.

**అంతర్జాతీయ సంస్థలు కూడా..**

దేశీయ డాటా సెంటర్లలోకి అంతర్జాతీయ సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. వీటితోపాటు రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ప్రైవేట్ ఈక్విటీ ఫండ్లు కూడా భారీగా నిధులుచొప్పించడానికి సిద్ధమవుతున్నాయి. డాటా సెంటర్ల నిర్వహణలో ముంబై తొలిస్థానం నిలిచింది. ఆ తర్వాతి క్రమంలో చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరులు ఉన్నాయి.

# గోల్డ్ ర్యాలీకి బ్రేక్



ఈ ఏడాది జోరుగా పెరిగిన బంగారం ధరలు.. వచ్చే ఏడాదిలో మాత్రం నెమ్మదించవచ్చని చెప్తున్నది ప్రపంచ స్వర్ణ మండలి .మునుపెన్నడూ లేనివిధంగా దేశంలో పసిడి ధర ఈ సంవత్సరం అక్టోబర్‌లో ఆల్‌టైమ్ హైకి చేరిన విషయం తెలిసిందే. తులం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి రేటు గరిష్ఠంగా రూ.82,400 పలికింది. అయితే అక్టోబర్ ఆఖరుదాకా పరుగులు పెట్టిన గోల్డ్ రేట్లు.. గత నెలన్నర (45 రోజులు)గా పడుతూ.. లేస్తూ.. సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డబ్ల్యూజీసీ తాజా అంచనాలు సైతం ప్రస్తుత మార్కెట్ తీరుకు అనుగుణంగానే ఉన్నాయి. కొత్త ఏడాదిలోనూ మార్కెట్ ట్రెండ్ ఇదే రీతిలో ఉండవచ్చన్న అభిప్రాయాన్ని 2025 ఔట్‌లుక్‌లో వ్యక్తం చేసింది.

**30 శాతానికిపైగానే..**

ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు 30 శాతానికిపైగా పుంజుకున్నాయి. సెంట్రల్ బ్యాంకులు, ముఖ్యంగా పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా బంగారం కొనుగోళ్లకు పెద్దపీట వేసింది. ఆర్బీఐ సైతం గోల్డ్ రిజర్వులకు అత్యంత ప్రాధాన్యాన్నిస్తున్న సంగతి విదితమే. అలాగే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ పోరు, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధానం వంటివి స్టాక్ మార్కెట్లను కుంగదీశాయి. ఫలితంగా మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం ప్రత్యామ్నాయ మార్గమైన పసిడి వైపు చూశారు. దీంతో ఈ ఏడాది గోల్డ్ మార్కెట్‌లో డిమాండ్ ఊహించనివిధంగా పెరిగిపోయింది. ఇది ధరలను పరుగులు పెట్టించింది. మరోవైపు పండుగ సీజన్లు, పెండ్లిళ్ల సీజన్ కొనుగోళ్లు కూడా కలిసొచ్చాయి.

**ఇదీ సంగతి..**

బంగారం ధరలు వచ్చే ఏడాది ఈ స్థాయిలో పెరగకపోవచ్చని డబ్ల్యూజీసీ తాజాగా పేర్కొన్నది. జీడీపీ వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు గోల్డ్ మార్కెట్ క్రయవిక్రయాలను ప్రభావితం చేయవచ్చని అంటున్నది. జనవరిలో అమెరికాకు రాబోయే నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు వాణిజ్య యుద్ధాలకు తెర లేపవచ్చన్న ఆందోళనల్ని కనబర్చింది మరి. పరస్పర సుంకాలతో మదుపరులు, కొనుగోలుదారులు మార్కెట్‌కు దూరం కావచ్చని, దీంతో ఆయా దేశాల జీడీపీ, విపణిలో డిమాండ్ పడిపోవచ్చని హెచ్చరించడం గమనార్హం. కానీ ఇప్పటికైతే బంగారం ధరలు అంతర్జాతీయంగా గరిష్ఠ స్థాయిల్లోనే కదలాడుతున్నాయి. ఔన్స్ 2,700 డాలర్ల సమీపంలో ఉన్నది. ఇక గోల్డ్‌మన్ సాచ్స్ గ్రూప్ వచ్చే ఏడాది ఆఖర్లో 3,000 డాలర్లకు పోవచ్చంటున్నది. యూబీఎస్ ఏజీ అంచనా 2,900 డాలర్లుగా ఉన్నది.

**మరో రూ.1,000 డౌన్**


బంగారం ధరలు శనివారం మరింత తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు రూ.980 దిగి రూ.77,890గా నమోదైంది. 22 క్యారెట్ రూ.900 పడిపోయి రూ.71,400 పలికింది. మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడమే కారణమని వ్యాపారులు చెప్తున్నారు. కాగా, శుక్రవారం కూడా ధరలు బాగా తగ్గిన విషయం తెలిసిందే. ఢిల్లీలో ఒక్కరోజే 24 క్యారెట్ తులం రూ.1,400 క్షీణించింది. ఇక వెండి కిలో ధర ఏకంగా రూ.4,200 పతనమై రూ.92,800 వద్దకు పరిమితమైంది. ఈ ఏడాది కిలో ధర లక్షా 2 వేల రూపాయల ఆల్‌టైమ్ హైని తాకినది తెలిసిందే.

## సుజుకి ఈ-విటారా నుంచి టయోటా అర్బన్ క్రూయిజర్ ఈవీ జనవరిలో భారత్ మార్కెట్లో ఆవిష్కరణ




ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్.. బ్రిటన్ మార్కెట్లో తన అర్బన్ క్రూయిజర్ ఈవీ కారును ఆవిష్కరించింది. సుజుకి మోటార్స్ ఈ-విటారా బ్యాడ్జితో రూపుదిద్దుకున్నదీ అర్బన్ క్రూయిజర్ ఈవీ. ఈ ఏడాది ప్రారంభంలో సుజుకి ఈ-విటారా ఆవిష్కరించారు. టయోటా, మారుతి సుజుకిల నుంచి వస్తున్న రెండు ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ కార్లు వచ్చేనెలలో భారత్ ఎక్స్ పోలో ప్రదర్శించనున్నారు. మారుతి సుజుకి, టయోటా మధ్య టెక్నాలజీ మార్పిడి ఒప్పందం ఉన్న సంగతి తెలిసిందే. సుజుకి ఈవీఎక్స్ కాన్సెప్ట్ ఆధారంగా రూపుదిద్దుకున్నదే టయోటా అర్బన్ క్రూయిజర్ ఈవీ. గుజరాత్ లోని మారుతి సుజుకి ప్లాంట్ లో టయోటా అర్బన్ క్రూయిజర్ ఈవీ / సుజుకి ఈ విటారా తయారవుతాయి. తొలుత భారత్ మార్కెట్లో మారుతి సుజుకి తన ఈ-విటారా కారును ఆవిష్కరిస్తుంది. అటుపై టయోటా తన అర్బన్ క్రూయిజర్ ఈవీ కారును మార్కెట్లోకి తీసుకొస్తుంది. అర్బన్ క్రూయిజర్ ఈవీ, ఈ-విటారా కార్లు బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్స్ (బీఈవీ) డెడికెటేడ్ ప్లాట్ ఫామ్ ఆధారంగా రూపుదిద్దుకున్నాయి. హై ఓల్టేజ్ భాగాల నుంచి రక్షణ కల్పిస్తూ ఈ రెండు కార్లను నిర్మించారు. టయోటా అర్బన్ క్రూయిజర్ ఈవీ కారు స్లీక్ ఫ్రంట్, ఎల్ఈడీ డీఆర్ఎల్స్ , ఎల్ఇడీ టెయిల్ ల్యాంప్స్ తోపాటు ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, మస్క్యులర్ ఫ్రంట్ అండ్ రేర్ బంపర్లు, 18/19 అంగుళాల వీల్స్ ఉంటాయి. బ్లాక్ రూఫ్ తోపాటు డ్యుయల్ టోన్ ఆప్షన్లతో వస్తోంది టయోటా అర్బన్ క్రూయిజర్ ఈవీ. టయోటా అర్బన్ క్రూయిజర్ ఈవీ ఇంటిగ్రేటెడ్ 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్, 10.1 అంగుళాల టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్ మెంట్, వైర్ లెస్ చార్జర్, జేబీఎల్ ప్రీమియం ఆటో సిస్టమ్, 360-డిగ్రీ కెమెరా అండ్ సన్ రూఫ్, ప్రీ కొల్లిషన్ సిస్టమ్, అడాప్టివ్ క్రూయిజ్ కంట్రోల్, లేన్ డిపార్చర్ అల్టర్, లేన్ కీప్ అసిస్ట్ తదితర అడాస్ సేఫ్టీ ఫీచర్లు ఉంటాయి. సింగిల్ చార్జింగ్ తో 500 కిమీ దూరం ప్రయాణిస్తుందని భావిస్తున్నారు. దీని ధర సుమారు రూ.19 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభం కానున్నది.

# యూపీఐపై క్రెడిట్ లైన్ ఎలా వాడుకోవాలో తెలుసా?



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. తమ తాజా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కస్టమర్లకు 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' సౌకర్యాన్ని కల్పించేందుకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ అనుమతిచ్చింది. నిజానికి గత ఏడాది సెప్టెంబర్‌లోనే యూపీఐపై క్రెడిట్ లైన్ సదుపాయం మొదలైంది. అయితే ఇప్పటిదాకా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల్లోనే ఆ సేవలు అందుబాటులో ఉన్నాయి. కానీ ఇప్పుడు చిన్నతరహా బ్యాంకులైన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకూ ఆర్బీఐ ఈ వీలు కల్పించింది. ఈ నిర్ణయం యూపీఐ యూజర్లకు మరింత కలిసి రానున్నది. త్వరలోనే ఇందుకు సంబంధించి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు విధివిధానాలను ఆర్బీఐ ప్రకటించనున్నది. కాగా, అసలు ఈ యూపీఐపై 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్' అంటే ఏమిటి? ఎలా ఈ సౌకర్యాన్ని రుణగ్రహీతలు పొందవచ్చో తెలుసుకుందాం.

**ఇదీ సంగతి..**

నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం 'ప్రీ-శాంక్షన్డ్ క్రెడిట్ లైన్ ఆన్ యూపీఐ' అనేది ఆర్బీఐ విజన్‌కు అనుగుణంగా అభివృద్ధిపర్చిన ఓ సరికొత్త ఆర్థిక వెసులుబాటు. దీనిద్వారా బ్యాంకుల నుంచి వ్యక్తులు, వ్యాపారులు తక్షణ రుణాలను పొందవచ్చు. యూపీఐ ద్వారా లావాదేవీల కోసం ఈ రుణాలను వెంటనే వినియోగించుకోవచ్చు. అయితే యూపీఐ యాప్స్ ద్వారా క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనుకుంటే ముందు గా మీకు సేవింగ్స్ ఖాతా (యూపీఐ యాప్స్‌కు లింకై ఉన్న సేవింగ్స్ అకౌంట్) గల బ్యాంక్ నుంచి ఆమోదం పొందాలి. ఇందుకోసం ఓ అప్లికేషన్‌ను బ్యాంక్‌లో సమర్పించాలి. అప్పుడు బ్యాంక్ మీ అర్హత, ఆదాయం, క్రెడిట్ స్కోర్, రుణ చరిత్రను పరిశీలిస్తుంది. ఈ క్రమంలో ఆదాయం, గుర్తింపు, చిరునామా, ఇతరత్రా అవసరమైన డాక్యుమెంట్లను బ్యాంక్‌కు సమర్పించాల్సి ఉంటుంది. అన్నింటినీ పరిశీలించిన తర్వాత బ్యాంక్ ఆమోదిస్తే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యం లభిస్తుంది. అవసరం ఉన్నప్పుడు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

**ఎలా లింక్ చేసుకోవాలి?**

ఎన్‌పీసీఐ వెబ్‌సైట్ ప్రకారం తొలుత గూగుల్ ప్లే స్టోర్ నుంచి యూపీఐ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒకవేళ మీ స్మార్ట్‌ఫోన్‌లో ఇప్పటికే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యూపీఐ యాప్‌లు ఉన్నైట్లైతే మళ్లీ ఏ డౌన్‌లోడ్‌లూ అవసరం లేదు. ఉదాహరణకు ఫోన్‌పేలోకి లాగిన్ అయిన తర్వాత పైన కుడివైపు చివర్లో కనిపించే రౌండ్ బాక్స్‌లో ఉన్న కొశ్చన్ మార్క్‌పై క్లిక్‌చేస్తే ఓ కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. అందులో ప్రొఫైల్ అండ్ పేమెంట్స్ ఆప్షన్ ఉంటుంది. దానిపై క్లిక్‌చేసి పేమెంట్స్ మెథడ్స్‌ను ఎంచుకోవాలి. అందులో మీకు యూపీఐ క్రెడిట్ లైన్ ఆప్షన్ ఉంటుంది. దాన్ని ఎంచుకొంటే మీకు క్రెడిట్ లైన్ సౌకర్యాన్ని కల్పించిన బ్యాంక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి పిన్ నెంబర్ ద్వారా పేమెంట్స్‌ను పూర్తి చేయవచ్చు. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఫోన్‌పే తదితర యాప్‌ల ద్వారా కూడా బై నౌ-పే లేటర్ సదుపాయాలు లభిస్తున్నాయి.

**గుర్తుంచుకోండి..**

ఈ క్రెడిట్ లైన్ రీపేమెంట్స్.. బ్యాంకునుబట్టి ఒక్కో రకంగా ఉంటాయి. అలాగే మీ ఖాతాలో నగదు నిల్వలు లేకపోయినా రుణం ద్వారా మీ అవసరాలను యూపీఐ పేమెంట్స్‌తో చేసుకుంటున్నందున దీనికి వడ్డీరేట్లు కూడా ఎక్కువే ఉంటాయి. ఇక అప్రమత్తంగా లేకపోతే సైబర్ మోసాలకూ తావుంటుంది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332